ninadam.in

తెలుగు దినపత్రిక

# నినాదం

నిఖార్సైన జర్నలిజం

బుధవారం, మార్చి 11, 2026 | సంపుటి - 22 | సంచిక 164 | వెల - 7 | పేజీలు - 12 - 8

Published from Hyderabad, Vijayawada Circulated from TS and AP.. Hyderabad, Karimnagar, Khammam, Mahabubnagar, Nalgonda, Nizamabad, Warangal, Vijayawada, Guntur, Ongole, Nellore, Tirupathi, Kadapa, Ananthapur, Kurnool, Tadepalligudem, Rajahmundry, Visakhapatnam, Srikakulam



హైదరాబాద్ చేరుకున్న

## కొత్త గవర్నర్

**శివప్రతాప్ శుక్లాను స్వాగతించిన సిఎం**

**హైదరాబాద్, నినాదం:** తెలంగాణకు కొత్తగా నియమితులైన నూతన గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా మంగళవారం ఉదయం శంషాబాద్ ఎయిర్ పోర్ట్ చేరుకున్నారు. ఎయిర్పోర్టుకు చేరుకున్న సిఎం రేవంత్ తదితరులున గవర్నర్‌కు స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు గవర్నర్‌కు స్వాగతం పలికి వారిలో ఉన్నారు. అనంతరం గవర్నర్ నేరుగా లోక్‌భవన్ చేరుకున్నారు.

ప్రభాకరుని కవచాలు..

# ఆ రెండు ఠాణాలు

- పూడూరు కేంద్రంగా స్మగ్లింగ్ • పేదల బియ్యం గ్యాంబ్లింగ్
- రెండు మిల్లులకు రవాణా • సివిల్ సప్లై, ఖాకీలకు నజరానా ..!

**కరీంనగర్ బ్యూరో,మార్చి10(నినాదం):** జగిత్యాల జిల్లా సరిహద్దున గల ఓ ప్రాంతంలో పేదల బియ్యం భారీ స్మగ్లింగ్ కు గురవుతోంది.విషయం సొంత శాఖ,పోలీసులు,సామాన్యులకు సైతం తెలిసిన బహిరంగ రహస్యం. అయినా పూర్తి స్థాయి కట్టడికి ఎవరూ ఉపక్రమించటం లేదని తీవ్ర ఆరోపణలున్నాయి.సివిల్ సప్లై సహా సంబంధిత అధికారులందరికీ తాంబూలాల పంపకమే పై ఉదాసీనతకు అసలు కారణంగా స్థానికులు చెబుతున్నారు.




**డాన్‌కు ఆ రెండు ఠాణాల అండ ఉందంట..!**

కాగా ఏదైతే ఈ స్మగ్లింగ్ జరిగే ప్రాంతముందో అది ఓ రెండు ఠాణాల మధ్యలో ఉంటుందని తెలిసింది. ప్రభాకరుని కిరణాలవలె సదరు బియ్యం డాన్ కు ఆ ఠాణాల సపోర్టు ఎల్లవేళలా ఉంటుందని వినికిడి. ఇది పలు సందర్భాల్లో ఆ స్మగ్లరే అక్కడిక్కడ చెప్పుకోవటం గమనార్హం.కాగా ఇది విన్న పలువురు అయినా నిప్పులేనిదే పొగరాదుగా అని చెవులు కొరుక్కుంటున్నారు.

ఏదేమైనా ఈ పూడూరు అవినీతి ఆరోపణల్ని సదరు ఠాణాల ఖాకీలు ఇంత సాహసోపేతంగా మోయటం ఆసక్తిగా మారింది.వాళ్లూ వీళ్లూ కాదు ఏకంగా రాష్ట్ర ముఖ్యమంత్రే ఈ స్మగ్లింగ్ పై ప్రత్యేక దృష్టిసారించారు.అయినా స్థానిక స్మగ్లర్ కు ఇక్కడి అధికారులు అండగా నిలుస్తున్నారంటే వారి గుండె ధైర్యాన్ని చూసి పలవురు విస్మయం చెందుతున్నారు.

స్మగ్లర్లుగా మిల్లర్లు..

# ఆరోపణల్లో అధికారులు !

- కాగజ్ నగర్ లో భారీ పీడీఎస్ దందా • మినీ వ్యాన్లు,ఆటోలు,బైక్ ల ద్వారా సేకరణ
- ఉదయం నుండి మధ్యాహ్నం వరకు రవాణా • బాధ్యులకు పట్టదు ఏ కోషాన..!


**ప్రత్యేక ప్రతినిధి, మార్చి10(నినాదం):**

***పిల్లి గుడ్డిదైతే ఎలుక డ్యాన్సాడినట్లు మారింది కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా అధికారుల తీరు.సొంత శాఖ టీంతో పాటు పోలీసు వ్యవస్థ సైతం కాగజ్ నగర్ లో అత్యంత పటిష్టంగా ఉండగా, పీడీఎస్ అక్రమ రవాణా మాత్రం నిరంతరం సాగుతూనే ఉంది.ఇంత మంది ఉండీ అదెలా సాధ్యమని పలువురు ప్రశ్నిస్తున్నారు.***

సివిల్ సప్లై శాఖకు సంబంధించి సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల తీసుకున్న సంచలన నిర్ణయం నేపథ్యంలో కాగజ్ నగర్ లోని ఈపరిస్థితి ప్రాధాన్యత సంతరించుకుంది. అధికారుల పాత్ర లేకుండా ఇంతటి విధ్వంసం ఏమాత్రం సాధ్యపడదని,అంతాతెలిసే జరుగుతోందనే ఆరోపణ ప్రజల్లో వ్యక్తమవుతోంది.

**పట్టిచ్చిన వివరాలు తెలిపేందుకూ ససేమిరా**

ఇటీవల సుమారు 07 క్వింటాళ్ల రైస్ ను అక్రమంగా తరలిస్తున్న ఆటో ఒకటి స్పెషల్ బ్రాంచి పోలీసులకు చిక్కింది.కాగా ఆ వివరాలు మీడియాకు చెప్పేందుకు సైతం టౌన్ పోలీసులు ఆసక్తి కనబరచలేదు. కొందరు విలేకరులు పనిగట్టుకుని అడిగినా పైపైన వివరాలు తెలిపారని,ఆపై సదరు ఆటోకు చెందిన ఫొటో కోసం మళ్లీ కాల్ చేస్తే కనీసం రెస్పాండు కూడా కాలేదని కొందరు విలేకరులు తెలిపారు.




**లోకల్ మిల్లర్ల బరితెగింపు**

పట్టణంలోని పలు మిల్లులు కొన్నేళ్లుగా పెద్ద ఎత్తున పీడీఎస్ రైస్ స్మగ్లింగ్ చేస్తున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. కాగా రాష్ట్రవ్యాప్తంగా సీఎంఆర్ బకాయిల విషయంలో సీఎం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసారు. అవకతవకలు జరిగితే ఆ ప్రిమిసెస్ లోని కలెక్టర్,ఎస్పీలను సైతం బాధ్యుల్ని చేసి సస్పెండ్ చేస్తామని గట్టి వార్నింగ్ కూడా ఇచ్చారు. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సంబంధిత అధికారులంతా నిత్యం ఏదో ఓ మిల్లుకు వెళ్లి కూర్చుంటున్నారు. రికవరీతో పాటు ఎలాంటి ఫర్ దర్ అవకతవకలకు తావివ్వకుండా చూసుకుంటున్నారు. కానీ కాగజ్ నగర్ టీమ్ మాత్రం దీనికి భిన్నంగా వ్యవహరిస్తోంది.నేటి రికవరీ తంటాకు కారణమైన పీడీఎస్ రైస్ స్మగ్లింగ్ కు సైతం కనీసం చెక్ పెట్టడంలేదు,పైగా మిల్లర్ల నుండి కొందరు అధికారులు ముడుపులు సైతం పొందుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.పై తీవ్రత నేపథ్యంలోనైనా మిల్లర్ల చేతిని ఆఅధికారులు విడుస్తారో లేదో వేచిచూడాలి.



ఇరాన్ యుద్ధ ప్రభావంతో

## ధరల మోత

**గ్యాస్ ధరలు పెరగడంతో పెట్రో ధరలపై ఆందోళన**

**ఇప్పటికిప్పుడు ప్రమాదం లేదని వెల్లడించిన కేంద్రం**

గ్యాస్ ధరలు పెరిగాయి. అలాగే పెట్రో ధరలు పెరుగాయని అంటున్నారు. వీటి ప్రభావంతో నిత్యావసరాలు కూడా పెరగక తప్పేలా లేదు. ఈ నేపథ్యంలో కేంద్రం స్పందించింది. ముఖ్యంగా పెట్రోల్ ధరలు పెరుగుతాయనే వార్తలను ఖండించింది.

6



ఇంధన ధరలు

## దిగి వస్తాయి

**త్వరలోనే ఇరాన్ యుద్ధం ముగుస్తుంది**

**ట్రంప్ సంచలన ప్రకటన**

వాషింగ్టన్, నినాదం: ఇరాన్‌పై యుద్ధం కొన సాగుతుందని,వెనక్కి తగ్గేది లేదన్న ట్రంప్ కొంత మెత్త బడ్డారు. వెనక్కి తగ్గుతున్నట్లుగా కనిపిస్తున్నారు. ఇరాన్ యుద్ధం త్వరలోనే ముగుస్తుందని, చమురు ధరలు కిందకు దిగి వస్తాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు.



రంగనాయక్ సాగర్‌పై

## ఎందుకీ తాత్సారం

- ఆందోళన చేస్తున్న రైతుల అరెస్ట్ దుర్మార్గం
- మండిపడ్డ కేంద్రమంత్రి బండి సంజయ్

**హైదరాబాద్,(నినాదం):** రాజన్న సిరిసిల్ల జిల్లాలో రంగనాయక్ సాగర్ కెనాల్ పనులు పూర్తి చేయాలంటూ నిరసనకు దిగిన రైతులను అరెస్ట్ చేయడాన్ని కేంద్రమంత్రి బండి సంజయ్ ఖండించారు. సమస్యలపై ఆందోళన చేస్తే అరెస్ట్ చేస్తారా అని ప్రశ్నించారు. ఇదేనా ప్రజాప్రభుత్వం తీరు అంటూ విమర్శలు గుప్పించారు.

2

దేశీయంగా 10శాతం

# ఎల్పీజీ ఉత్పత్తి పెంపు



**కృత్రిమ కొరత సృష్టిస్తే అత్యవసర చట్టం ప్రయోగం**

*దేశవ్యాప్తంగా ఎల్పీజీ గ్యాస్ కొరత పెరుగుతున్న నేపథ్యంలో, కేంద్ర పెట్రోలియం శాఖ రంగంలోకి దిగింది. గ్యాస్ ఉత్పత్తిని తక్షణమే పెంచాలని ప్రభుత్వ, ప్రైవేట్ రంగ ఇంధన కంపెనీలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.*

- గ్యాస్ కంపెనీలకు కేంద్రం ఆదేశం
- పెట్రో కంపెనీలతో కమిటీ ఏర్పాటు
- కేంద్రమంత్రులతో ప్రధాని అత్యవసర భేటీ
- పెట్రో, గ్యాస్ నిల్వలు, సరఫరాలపై సమీక్ష

2

**న్యూఢిల్లీ,మార్చి10(నినాదం):** కనీసం 10శాతం గ్యాస్ ఉత్పత్తిని పెంచాలని కేంద్రం ఆదేశించింది. ముఖ్యంగా అంతర్జాతీయ పరిణామాల వల్ల సరఫరాలో ఏర్పడిన ఆటంకాలను అధిగమించి, దేశీయ అవసరాలకు తగినంత స్టాక్ అందుబాటులో ఉంచాలని ప్రభుత్వం సూచించింది. సామాన్య ప్రజలకు వంట గ్యాస్ ఇబ్బందులు కలగకుండా చూడటమే ఈ నిర్ణయం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశ్యం. ఇరాన్ యుద్ధం భారత్‌లో చమురు ఆందోళనలు రేకెత్తిస్తోంది.



గ్యాస్ సిలిండర్లకు

# కొరత

- హోటల్ పరిశ్రమకు గ్యాస్ అలభ్యత
- ఇప్పటికే మూతపడ్డ 20శాతం హోటళ్లు
- గ్యాస్ దొరకకపోతే మూసివేత తప్పదన్న యాజమాన్యాలు

**న్యూఢిల్లీ,మార్చి10(నినాదం):** పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా పెట్రోల్, గ్యాస్, ఎరువుల దిగుమతులకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. ఈ నేపథ్యంలోనే దేశ వ్యాప్తంగా ఎల్పీజీ కొరత ఏర్పడింది. గ్యాస్ కంపెనీలు ఎల్పీజీ సిలిండర్ల ధరను భారీగా పెంచేశాయి. కమర్షియల్ గ్యాస్ సిలిండర్లతో పాటు డొమస్టిక్ గ్యాస్ సిలిండర్ల ధర పెరిగింది. డొమస్టిక్ సిలిండర్లపై 60 రూపాయలు.. కమర్షియల్ సిలిండర్లపై 115 రూపాయలు పెరిగింది.

▸▸తరువాయి2లో..



మా భూములు

## మాకివ్వాలి

కూల్చినందుకు నష్టపరిహారం చెల్లించాలి


వెలుగమట్ల బాధితుల ఆవేదన

2

**హైదరాబాద్, నినాదం:** ఖమ్మం జిల్లా వెలుగుమట్ల భూదాన్ భూముల్లో పేదలు ఎంతో కష్టపడి రూపాయి రూపాయి కూడ బెట్టుకుని కట్టుకున్న ఇళ్లను రేవంత్ సర్కార్ బుల్డోజర్లతో నేలమట్టం చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

తెలుగు వైభవం

## ఉట్టిపడేలా అమరావతి



- క్రీడలు, పర్యాటకానికి పెద్దపీట వేసేలా ప్రణాళికలు
- వివిధ సంస్థలకు భూ కేటాయింపులు
- సీఆర్‌డీఏ అథారిటీ 59వ సమావేశంలో సీఎం చంద్రబాబు

2

లోక్‌సభ స్పీకర్

# ఓంబిర్లాపై అవిశ్వాసం

- జగదంబికా పాల్ ప్రత్యేక స్పీకర్‌గా విధులు
- చర్చను ప్రారంభించిన కాంగ్రెస్ ఎంపి జావెద్
- విపక్ష నేతను అవమానిస్తూ మాట్లాడేందుకు నిరాకరించారని ఆరోపణ
- కాంగ్రెస్ సంప్రదాయాలు పాటించడం లేదన్న రిజిజు
- నెహ్రూను తిట్టేవారు ఆయనను జపిస్తున్నారంటూ ప్రియాంక ఎదురుదాడి

***లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానం గురించి లోక్‌సభలో చర్చ ప్రారంభమైంది. ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానాన్ని కాంగ్రెస్ ఎంపీ మహమ్మద్ జావెద్ లోక్‌సభలో మంగళవారం ప్రవేశపెట్టారు. అనంతరం దీనిపై చర్చ ప్రారంభమైంది.***



**న్యూఢిల్లీ,మార్చి10(నినాదం):** లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానం గురించి లోక్‌సభలో చర్చ ప్రారంభమైంది. ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానాన్ని కాంగ్రెస్ ఎంపీ మహమ్మద్ జావెద్ లోక్‌సభలో మంగళవారం ప్రవేశపెట్టారు. అనంతరం దీనిపై చర్చ ప్రారంభమైంది. ఈ చర్చ కోసం పది గంటల సమయం కేటాయించారు. అనంతరం తీర్మానంపై ఓటింగ్ నిర్వహించనున్నారు. స్పీకర్ ఓం బిర్లా నిష్పక్షపాతంగా వ్యవహరించడం లేదని,

▸▸తరువాయి2లో..



ఏప్రిల్ 2-3 తేదీల్లో

## 13వ ఏషియన్ టెక్స్ టైల్ కాన్ఫరెన్సు

*ప్రపంచస్థాయి13వ ఏషియన్ టెక్స్ టైల్ కాన్ఫరెన్సు (ATEXCON) ఏప్రిల్ 2-3 తేదీల్లో హైదరాబాద్ లో జరుగుతుందనిరాష్ట్ర వ్యవసాయ, చేనేత మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబులు వెల్లడించారు.*

2

దక్షిణాది రాష్ట్రాల్లో రైతు రుణభారం

## తెలంగాణలోనే తక్కువ

**రుణమాఫీతో తీరిన అన్నదాతల వెతలు**

**వివిధ రాష్ట్రాల్లో రైతులకు ఉన్న అప్పుల మొత్తంపై లోక్‌సభలో కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి ఓ ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.**



మూడేళ్లలో పంచాయతీలకు

## శాశ్వత భవనాలు

- హాస్టళ్లు, గురుకులాల అభివృద్ధికి నిధుల మంజూరు
- వివిధ శాఖల అధికారులతో డిప్యూటి సిఎం భట్టి సమీక్ష

2

**హైదరాబాద్, (నినాదం):** రాబోయే మూడేళ్లలో శాశ్వత భవనాలు లేని అన్ని గ్రామ పంచాయతీలకు కొత్త భవనాలు నిర్మిస్తామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు.



## మా భూములు మాకివ్వాలి

హైదరాబాద్, నినాదం: ఖమ్మం జిల్లా వెలుగుమట్ల భూదాన్ భూముల్లో పేదలు ఎంతో కష్టపడి రూపాయి రూపాయి కూడ బెట్టుకుని కట్టుకున్నఇళ్లను రేవంత్ సర్కార్ బుల్డోజర్లతో నేలమట్టం చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం కనికరం లేకుండా వ్యవహరించిన తీరుతో పేదలకు నిలువ నీడ లేకుండా పోయింది. కాంగ్రెస్ సర్కార్ పేదలను వారి ఇళ్లలో నుంచి బలవంతంగా ఖాళీ చేయించి ఇళ్లను కూల్చేసింది. ప్రభుత్వ చర్యలతో భూదాన్ భూముల్లో ఇండ్లను కోల్పోయిన పేదలు నిర్దాక్షిణ్యంగా రోడ్డున పడ్డారు. కాంగ్రెస్ సర్కార్ దౌర్జన్యంపై వెలుగుమట్ల బాధితురాలు తీవ్రంగా మండిపడ్డది. ప్రెస్ మీట్‌లో మాట్లాడుతూ.. ఇల్లు కోల్పోయిన వాళ్ల ఆవేదనను పంచుకుంది. మా భూములు మాకివ్వాలి.. మీరిచ్చేది కాదు.. మిమ్మల్ని ఇవ్వమని మేం అడగడం లేదు. ముందు రండి. లా అండ్ ఆర్డర్ ప్రకారంగా వెళ్దామని అడుగుతున్నాం. ఒక్కొక్కరికి నష్టపరిహారాలు చెల్లించాలి. మీ సొమ్ము తీసుకుని మేం ఇళ్లు కట్టుకోలేదు. మా సొమ్ము మీద ఇలా చేయడానికి మీకే మాత్రం అర్హత లేదు. అక్కడున్న ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేసింది. కట్టుబట్టలతో ఇండ్లలో నుంచి బయటకు వచ్చి నిరాశ్రయులైన బాధితులు సామాగ్రితో చెట్ల కింద, వాహనాల్లో తలదాచుకుంటున్న ద్రుశ్యాలు ఇప్పటికే అందరినీ కలిచి వేస్తున్నాయి. వెలుగుమట్ల బాధితుల దయనీయ పరిస్థితి ఎలా ఉందో కళ్లకు కట్టినట్టు చూపించే దృశ్యాలు ఇప్పటికే సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయని తెలిసిందే.

## లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాపై అవిశ్వాసం

ఆయన అధికార పార్టీ భాష మాట్లాడుతున్నారని తీర్మానాన్ని ప్రవేశపెట్టిన కాంగ్రెస్ ఎంపీ మహమ్మద్ జావెద్ ఆరోపించారు. అనంతరం అవిశ్వాస తీర్మానంపై కేంద్రమంత్రి కిరణ్ రిజిజు చర్చను ప్రారంభించారు. స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం గురించి చర్చ జరుగుతున్న సమయంలో సభను నడిపేందుకు ప్రత్యేక సభాపతిని నియమించాలని విపక్షాలు డిమాండ్ చేశాయి. ఈ డిమాండ్‌కు కేంద్రం అంగీకరించింది. సీనియర్ ఎంపీ, చైర్ పర్సన్స్ ప్యానెల్ సభ్యుడు జగదాంబికా పాల్‌ను నియమించింది. ఆయన నేతృత్వంలో ప్రస్తుతం స్పీకర్ ఓం బిర్లా అవిశ్వాస తీర్మానంపై చర్చ చేపట్టారు. ప్రతిపక్షాల తరపున కాంగ్రెస్ ఎంపి గౌరవ్ గొగోయ్ మాట్లాడుతూ.. భారత్ అమెరికా వాణిజ్య ఒప్పందం సహా పలు అంశాలపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీకి మాట్లాడేందుకు యత్నించారని, కానీ స్పీకర్ అనుమతినివ్వలేదని అన్నారు. ప్రతిపక్ష ఇండియా కూటమికి లోక్‌సభలో సుమారు 200మంది సభ్యులున్నప్పటికీ.. డిప్యూటీ స్పీకర్ లేరని అన్నారు. డిప్యూటీ స్పీకర్ లేకుండా సభ ఎలా నడుస్తుందో దేశ ప్రజలు చూడాలని అన్నారు. మైక్‌ని కూడా ఆయుధంగా వినియోగి స్తున్నారని అన్నారు. ఎన్‌డిఎ సభ్యులకు మాట్లాడేందుకు అనుమతినిస్తున్నారని, కానీ ప్రతిపక్షాలకు మాట్లాడేందుకు మైక్‌ని ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారని అన్నారు. అయితే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సభలో హుందాగా మెలగడం లేదని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ఆరోపించారు. ఈ క్రమంలో గతంలో ప్రధాని మోదీని రాహుల్ ఆలింగనం చేసుకున్న ఘటనను ప్రస్తావించారు. ప్రధాని మోదీ దగ్గరకు వచ్చిన రాహుల్.. ఆలింగనం చేసుకొని వెళ్లి తన సీట్లో కూర్చున్నారు. అనంతరం తోటి ఎంపీలను చూసుకుంటూ కళ్లు ఎగరవేశారు. అటువంటి నేతను ఎప్పుడూ చూడలేదు‘ అని కిరణ్ రిజిజు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గతంలో నెహ్రూ చెప్పిన నాటి స్పీకర్ జీవీ మావలాంకర్‌ను సమర్థిస్తూ మాటలను గుర్తుంచుకోవాలని కాంగ్రెస్ నేతలకు సూచించారు. దీనిపై దీటుగా స్పందించిన ప్రియాంకా గాంధీ.. ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు.రిజిజు విమర్శలను ఎంపీ ప్రియాంకా గాంధీ తిప్పికొట్టారు. విపక్ష నేత రాహుల్ గాంధీ చెప్పే విషయాలను అధికార పక్షం జీర్ణించుకోలేక పోతోందన్నారు. గడిచిన 12 ఏళ్లలో ప్రభుత్వానికి దీటుగా నిలిచిన వ్యక్తి రాహుల్ ఒక్కరేనని అన్నారు. నెహ్రూను ఎప్పుడూ విమర్శించే వాళ్లు అకస్మాత్తుగా ఆయన్ను ప్రశంసించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అందుకే తనకు నవ్వు వస్తోందన్నారు. నిరంతరం నెహ్రూను ఆడిపోసుకుంటున్న వారు ఆయన గురించి మాట్లాడంతో నవ్వు ఆపుకోలేక పోయానని అన్నారు. అయితే, ప్రధాని మోదీ, రాహుల్ గాంధీ సభలో లేని సమయంలో ఈ చర్చ జరిగింది. ఆ సమయంలో స్పీకర్ స్థానంలో టిడిపికి చెందిన తెన్నేటి కృష్ణప్రసాద్ ఉన్నారు.

## రంగానాయక్ సాగర్‌పై ఎందుకీ తాత్సారం

మంగళవారం కేంద్రమంత్రి మీడియాతో మాట్లాడుతూ.. ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని రైతులు నిరసన చేస్తే వారిని అరెస్ట్ చేస్తారా అంటూ మండిపడ్డారు. రంగనాయక్ సాగర్ నుంచి పెద్దలింగాపూర్, తంగళ్లపల్లి మండలానికి నీళ్లిచ్చే కాలువ పనులను ఎందుకు పూర్తి చేయడం లేదని కేంద్రమంత్రి ప్రశ్నించారు. రూ.3 కోట్ల నిధులు విడుదలయ్యాయని స్థానిక ఎమ్మెల్యే ప్రకటించి ఏడాది దాటినా పనులు ఎందుకు ప్రారంభించలేదని అడిగారు. కాలువ పనులు పూర్తి చేసి ఉంటే 9,500 ఎకరాలకు సాగునీరు అందేదని ఆయన స్పష్టం చేశారు. అధికారంలో ఉన్నన్నాళ్లు రంగనాయక్ సాగర్ ద్వారా సిరిసిల్ల జిల్లాకు నీరివ్వని కేటీఆర్ రైతు ద్రోహి అని బండి సంజయ్ ఆరోపించారు. కాంగ్రెస్, బీఆరఎస్ పాలకుల వైఫల్యాల వల్ల రైతులు వరుసగా పంటలు నష్టపోతున్నారని కేంద్రమంత్రి అన్నారు. తక్షణమే పనులు ప్రారంభించకపోతే ఆయా ప్రాంత రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. న్యాయం చేయాలని అడిగిన రైతులను అరెస్ట్ చేయడం అన్యాయమన్నారు. రైతులకు సంఘీభావం తెలిపిన బీజేపీ జిల్లా అధ్యక్షులు గోపీ సహా పార్టీ నాయకులను స్టేషన్‌కు తరలించడం అక్రమమని కేంద్రమంత్రి తీవ్రంగా మండిపడ్డారు. రైతులపై కేసులు నమోదు చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. తక్షణమే రైతులను, బీజేపీ నేతలను బేషరతుగా విడుదల చేయాలన్నారు. రంగనాయక్ సాగర్ 11వ ప్యాకేజీ నుంచి ఎలఎం 4, ఎలఎం 6 ద్వారా కాలువ పనులను పూర్తి చేయాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ డిమాండ్ చేశారు.

## తెలుగు వైభవం ఉట్టిపడేలా అమరావతి

**అమరావతి,మార్చి10(నినాదం):**

తెలుగు వైభవం చాటేలా అమరావతి అభి వృద్ధి జరగాలని సీఎం చంద్రబాబు అన్నారు. సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్టులపై దృష్టి సారించాలన్నారు. క్రీడలు, పర్యాటకానికి పెద్దపీట వేసేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. సీఎం చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో సీఆర్‌డీఏ అథారిటీ 59వ సమావేశం జరిగింది. భూ కేటాయింపులు సహా వివిధ ప్రతిపాదనలకు సీఆర్‌డీఏ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా అధికారులకు సీఎం పలు సూచనలు చేశారు. పెట్టుబడులు పెట్టేందుకు వచ్చే సంస్థలతో నిరంతరం సంప్రదింపులు జరపాలన్నారు. మరోవైపు సీబీఎసఈ కార్యాలయ నిర్మాణానికి 80 సెంట్ల భూమి కేటాయింపునకు సీఆర్‌డీఏ ఆమోదం తెలిపింది. తుళ్లూరు ఎడ్యుకేషనల్ సొసైటీకి 3 ఎకరాలు, పంచాయతీరాజ్ విభాగంలోని ఏపీఎసఐఆర్‌డీకి 5 ఎకరాల భూ కేటాయింపునకు అనుమతిచ్చింది. సచివాలయం, హెచ్‌వోడీ టవర్ల పనులకు రూ.2,316 కోట్లకు పాలనా అనుమతులిచ్చింది. రూ.119 కోట్లతో తెలుగు కల్చరల్ సెంటర్ నిర్మాణానికి సీఆర్‌డీఏ ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వివిధ సంస్థలకు భూ కేటాయింపులు, జీవోఎంల నిర్ణయాలు, సచివాలయం, హెచఓడీ భవనాల్లో మౌలిక సదుపాయాల కల్పన వంటి ముఖ్య అంశాలపై విస్తృతంగా చర్చ జరిగింది. ఈ సమావేశంలో ఈపీసీ పద్ధతిలో తెలుగు కల్చరల్ సెంటర్ ఏర్పాటు చేయడంపై సమీక్ష జరిగింది. అలాగే రాజధాని పరిధిలో కన్వెన్షన్ సెంటర్ నిర్మాణంపై కూడా వివరంగా చర్చించారు. వివిధ సమావేశాలు, కార్యక్రమాలు నిర్వహించుకునేలా కన్వెన్షన్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తోంది. ఈ సమావేశంలో పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, సీఎస్ సాయి ప్రసాద్‌తో పాటు పట్టణాభివృద్ధి, సీఆర్డీఏ, ఏపీడీసీఎల్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# దేశీయంగా 10శాతం ఎల్పీజీ ఉత్పత్తి పెంపు



దేశ ప్రజలకు ఇంధన, గ్యాస్ కొరత ఏర్పడకుండా కేంద్రం చర్యలు తీసుకుంటుంది. ఈ క్రమంలోనే మంగళవారం ప్రధాని నరేంద్రమోదీ కీలక భేటీ నిర్వహించారు. విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురితో చర్చలు జరిపారు. ఎల్‌పీజీ ఉత్పత్తులు, సరఫరాపై సమీక్ష జరిపారు. ఇరాన్ యుద్ధం సామాన్యులపై ప్రభావం చూపకూడదని ప్రధాని మోదీ మంత్రులకు తెలిపారు. అలాగే యుద్ధంతో ఉత్పన్నమయ్యే అంతరాయాల గురించి చర్చించారని జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. మరోవైపు పరిశ్రమల నుంచి గ్యాస్‌ను మళ్లించడం ద్వారా ప్రజలకు గ్యాస్ కొరత ఏర్పడకుండా చర్యలు తీసుకుంటున్నారు. గతంలో ఇరవై ఒక్క రోజుల తర్వాత బుకింగ్‌లు జరిగేవి, ఇప్పుడు25 రోజులకు పొడిగిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. అలానే ఎల్పీజీ ఉత్పత్తిని 10 శాతం పెరిగిందని కేంద్ర వర్గాలు తెలిపాయి. ఇజ్రాయెల్ అమెరికా, ఇరాన్ యుద్ధంతో హర్మూజ్ జలసంధి నుంచి నౌకల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో పెట్రోల్, డీజిల్, గ్యాస్‌కు కత్రిమ కొరత కలగకుండా కేంద్రం ఎసెన్షియల్ కమోడిటీస్ యాక్ట్ ప్రయోగించింది. బ్లాక్ మార్కెటింగ్, నిల్వలను నియంత్రించే ఉద్దేశంతో పెట్రోలియం శాఖ ఈ నిర్ణయం తీసుకుంది. గతంలో దాదాపు రెండున్నర లేదా మూడు రోజుల్లో వినియోగదారులకు గ్యాస్ సరఫరా జరిగేది, ప్రస్తుత పరిస్థితుల్లో కూడా అదే సమయం పడుతుందని వర్గాలు తెలిపాయి. అన్ని శుద్ధి కర్మాగారాలు పూర్తి సామర్థ్యంతో పనిచేస్తున్నాయి, దేశ వ్యాప్తంగా ప్రతిరోజూ దాదాపు 60 లక్షల సిలిండర్లు సరఫరా అవుతున్నాయని కేంద్ర వర్గాలు చెబుతున్నాయి. దేశంలో ఎల్‌పీజీ కొరత లేదని, సరఫరాను స్థిరీకరించామని కేంద్ర ప్రభుత్వవర్గాలు వెల్లడించాయి. వాణిజ్య సిలిండర్ల కొరత కారణంగా దేశంలో పలు హోటళ్లు, రెస్టారంట్లు మూతపడినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ ఆందోళనల నేపథ్యంలో కేంద్రం నుంచి స్పందన వచ్చింది. ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి రిఫైనరీలు ఎల్‌పీజీ ఉత్పత్తిని 10శాతం మేర పెంచాయని పేర్కొన్నాయి. కృత్రిమ కొరతను నిరోధించేందుకు పలు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపాయి. ఎల్‌పీజీ సరఫరా విషయంలో సమస్యలను అర్థం చేసుకునేందుకు చమురు మార్కెటింగ్ కంపెనీలు వివిధ రెస్టారంట్ అసోసియేషన్లతో మాట్లాడుతాయి. ఇందుకోసం ఐఓసీ, హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్‌కు చెందిన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లతో ఓ కమిటీ ఇప్పటికే ఏర్పాటైంది. హోటళ్లు, రెస్టారంట్ల అవసరాలకు తగ్గట్టుగా కమిటీ సరఫరాకు ప్రాధాన్యత ఇస్తుంది. అలాగే కొన్నిరోజుల వ్యవధిలోనే దేశీయ ఎల్‌పీజీ ఉత్పత్తి 10 శాతం మేర పెరిగింది. ఎల్‌పీజీ, ఎలఎన్‌జీ కన్‌సైన్‌మెంట్ వివిధ వనరుల నుంచి వస్తోంది. కొత్త కన్‌సైన్‌మెంట్ కూడా వచ్చే అవకాశం ఉంది. పెట్రోలియం ఉత్పత్తుల విషయంలో మనం గతంలో సంక్షోభ పరిస్థితులు ఎదుర్కొన్నాం కానీ.. ఇప్పుడు అలాంటివి ఏమీ లేవు. ఇరాన్ ఇజ్రాయెల్ ఘర్షణకు ముందువలే భారత రిఫైనరీలు పూర్తి సామర్థ్యంతో నడుస్తున్నాయి. మన ముడి చమురు దిగుమతుల్లో 70 శాతం హర్మూజ్ జలసంధి నుంచి కాకుండా ఇతర వనరుల నుంచి సమకూరుతున్నాయి. ఇక సంక్షోభం తర్వాత ఇతర దేశాల కంటే మనమే మెరుగ్గా మనం కోలుకుంటాం. అంతేగాకుండా శుద్ధిచేసిన చమురు ఎగుమతులను నియంత్రించడంపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

### గ్యాస్ సిలిండర్లకు కొరత

అంతేకాదు.. వాణిజ్య, పారిశ్రామిక వినియోగదారులకు ఎల్పీజీ సరఫరా నిలిచిపోయింది. కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల సరఫరా నిలిచిపోవటంతో బెంగళూరు, చెన్నై, ముంబైలలోని హోటళ్లు, రెస్టారెంట్లపై తీవ్ర ప్రభావం పడింది. ఈ నగరాల్లోని దాదాపు 20 శాతం హోటళ్లు మూతపడ్డాయి. వాణిజ్య సిలిండర్ల కొరత కారణంగా ముంబయి లో 20శాతం హోటళ్లు, రెస్టారంట్లు మూతపడ్డాయని హెటల్ హోటల్ అండ్ రెస్టారంట్ అసోసియేషన్ మంగళవారం వెల్లడించింది. పరిస్థితి ఇలాగే కొనసాగితే రాబోయే రెండు రోజుల్లో నగరంలోని సగం హోటళ్లు మూతపడతాయని పేర్కొన్న సంగతి తెలిసిందే. 'ది బెంగళూరు హోటల్స్ అసోసియేషన' ఓ ప్రకటన విడుదల చేసింది. ఆ ప్రకటనలో.. 'గ్యాస్ సరఫరా నిలిచిపోవటంతో.. హోటల్స్ మూతపడనున్నాయి. భోజనం కోసం హోటల్స్‌పై ఆధారపడిన సాధారణ ప్రజలు, విద్యార్థులు, మెడికల్ ప్రొఫెషనల్స్ ఇబ్బందులు పడకతప్పదు. గ్యాస్ సరఫరా సాధారణ స్థితికి వచ్చే వరకు మా హోటల్ ఇండస్ట్రీ ఇబ్బందులు పడక తప్పదు. ఈ విషయంలో కేంద్రం త్వరగా సరైన చర్యలు తీసుకోవాలి' అని పేర్కొంది. చెన్నై హోటల్స్ అసోసియేషన్ కూడా ఓ ప్రకటన విడుదల చేసింది. ఆ ప్రకటనలో .. 'పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. కమర్షియల్ గ్యాస్ సిలిండర్లు సరఫరా చేసే డిస్ట్రిబ్యూటర్లు గ్యాస్ సిలిండర్ల సప్లైని పూర్తిగా ఆపేశారు. స్టాక్ లేదని అంటున్నారు. దీని ఫలితంగా చాలా హోటళ్లు బలవంతంగా మూసేయాల్సి వస్తోంది' అని పేర్కొంది. 'ది నేషనల్ రెస్టారెంట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా'.. కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల సరఫరాపై స్పందించింది. ఈ మేరకు సోమవారం ఎక్స్ ఖాతాలో ఓ పోస్టు పెట్టింది. ఆ పోస్టులో.. 'రెస్టారెంట్ ఇండస్ట్రీకి కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల సరఫరాపై ఎటువంటి నిషేధం లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. అయితే, క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. సప్లయర్లు గ్యాస్ సిలిండర్లు సరఫరా చేయలేమని చేతులు ఎత్తేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ విషయంలో కలుగజేసుకోవాలని కోరింది. ఒక్కో వాణిజ్య సిలిండర్‌ను రెట్టింపు ధరకు విక్రయిస్తున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. బ్లాక్ విక్రయాలను అరికట్టేందుకు సిలిండర్ల బుకింగ్ వ్యవధిని ప్రస్తుతమున్న 21 రోజుల నుంచి 25 రోజులకు పెంచింది. అలాగే చమురు సంస్థలపై నిత్యావసర సరకుల చట్టాన్ని ప్రయోగించింది

# ఏప్రిల్ 2-3 తేదీల్లో 13వ ఏషియన్ టెక్స్ టైల్ కాన్ఫరెన్సు




ప్రపంచస్థాయి13వ ఏషియన్ టెక్స్ టైల్ కాన్ఫరెన్సు (ATEXCON) ఏప్రిల్ 2-3 తేదీల్లో హైదరాబాద్ లో జరుగుతుందనిరాష్ట్ర వ్యవసాయ, చేనేత మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబులు వెల్లడించారు. నోవాటెల్ హెచ్ ఐసిసి (HICC) లో జరిగే ఈప్రతిష్మాత్మక సదస్సుకు వివిధ దేశాలకు చెందిన ఇండస్ట్రీ ప్రతినిధులు, అత్యాధునిక యంత్రాల సరఫరాదారులు, ప్రభుత్వ సంస్థల ఉన్నతాధికారులు పాల్గొంటారని మంగళవారం నాడు సచివాలయంలో తెలిపారు. ఈ సందర్భంగా మంత్రులుకాన్ఫరెన్స్ పోస్టర్ ను ఆవిష్కరించారు.తెలంగాణా ప్రభుత్వ నిర్వహించే ఈ సదస్సుకు కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ టెక్స్ టైల్ ఇండస్ట్రీ (CITI) కో హోస్ట్ గా వ్యవహరిస్తుంది. పోస్టర్ విడుదల కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, చేనేత, జౌళి శాఖల ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, టిజిఐఐసి మేనేజింగ్ డైరెక్టర్ శశాంక, డైరెక్టర్ ఇన్వెస్ట్ మెంట్స్ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు. గత ఏడాది నిర్వహించిన 12 వ సదస్సు ముంబైలో జరిగింది. వస్త్ర పరిశ్రమలో అంకుర సంస్థలకు తోడ్పాటును అందించడం, ప్రపంచ వస్త్రరంగం అవసరాలు, ముడి సరుకుల లభ్యత, ఇండస్ట్రీ ఎదుర్కొంటున్న సవాళ్లతో పాటు పలు అంశాలపై సదస్సులో సమావేశాలు చోటు చేసుకుంటాయి.

### దక్షిణాది రాష్ట్రాల్లో రైతు రుణ భారం తెలంగాణలోనే తక్కువ

హైదరాబాద్: దక్షిణ భారత రాష్ట్రాల్లో రైతులకు రుణ భారం తక్కువగా తెలంగాణలోనే ఉంది. వ్యవసాయ ప్రధానమైన కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లతో పోలిస్తే తెలంగాణలో రైతులకు ఉన్న రుణభారం చాలా తక్కువగా ఉంది. వివిధ రాష్ట్రాల్లో రైతులకు ఉన్న అప్పుల మొత్తంపై లోక్‌సభలో కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి ఓ ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. దాని ప్రకారం 2025, డిసెంబరు 31 నాటికి తెలంగాణలో రైతులకు ఉన్న మొత్తం అప్పులు రూ.1,75,960.56 కోట్లు... ఇందులో పంట రుణాలు రూ.95,167.98 కోట్లు, టర్మ్ రుణాలు రూ.80,792.58 కోట్లు... అదే సమయంలో కర్ణాటకలో రైతులపై ఉన్న మొత్తం అప్పులు రూ.2,10,244.47 కోట్లు, ఆంధ్రప్రదేశ్‌లో రైతులపై ఉన్న మొత్తం రుణ భారం రూ.3,75,254.59 కోట్లు, తమిళనాడు రైతులపై ఉన్న మొత్తం అప్పుల భారం రూ.5,06,290.45 కోట్లు... తెలంగాణలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం 2024లో రూ.21 వేల కోట్లపైగా రుణమాఫీ చేయడంతో రైతులపై రుణభారం తగ్గింది.

## న్యాయవ్యవస్థ అవినీతి పాఠ్యాంశం తొలగించాం

**పుస్తకాన్ని అందుబాటులో లేకుండా చేశాం**

**సుప్రీం కోర్టుకు ఎన్‌సిఇఆర్‌టి బహిరంగ క్షమాపణలు**

న్యూఢిల్లీ : 8వ తరగతి సోషల్ పాఠ్యపుస్తకంలో వివాదాస్పద అధ్యాయంపై 'నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ ఎన్‌సిఇఆర్‌టి మంగళవారం సుప్రీం కోర్టుకి బహిరంగ క్షమాపణలు తెలిపింది. న్యాయవ్యవస్థలో 'అవినీతి'గురించి పాఠ్యపుస్తకంలో ప్రస్తావించడంపై సుప్రీంకోర్టు రెండు వారాల క్రితం ఎన్‌సిఇఆర్‌టిని మందలించిన సంగతి తెలిసిందే. ఈ అధ్యాయంపై సుమోటోగా కేసు నమోదు చేసిన సుప్రీంకోర్టు.. పాఠ్యపుస్తకాన్ని ఉపసంహరించుకోవాలని ఆదేశించింది. దీంతో ఎన్‌సిఇఆర్‌టి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఎన్‌సిఇఆర్‌టి డైరెక్టర్ , సభ్యులు పుస్తకంలో ప్రకటించిన అధ్యాయానికి బేషరతుగా, తగిన అర్హతతో కూడిన క్షమాపణలు చెబుతున్నాం. మొత్తం పుస్తకం ఉపసంహ రించబడింది. అందుబాటులో లేదని పేర్కొంది. ఈ కారణంగా కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నాం. సభ్యుల అవగాహనకు అభినందిస్తున్నాం అని పేర్కొంది. విద్యా సమాచారంలో ఖచ్చితత్వం, సున్నితత్వం మరియు బాధ్యతతో కూడిన అత్యున్నత ప్రమాణాలను నిర్వహించడానికి ఎన్‌సిఇఆర్‌టి కట్టుబడి ఉందని పేర్కొంది. వివరాల్లోకి వెళితే.. జాతీయ విద్యా పరిశోధన శిక్షణ మండలి ఎన్‌సీఈఆర్‌టీ 8వ తరగతి సాంఘిక శాస్త్రం పాఠ్యపుస్తకంలో 'న్యాయవ్యవస్థలో అవినీతి'ని పాఠ్యాంశంగా చేర్చటం దేశ వ్యాప్తంగా తీవ్ర చర్చకు దారి తీసిన సంగతి తెలిసిందే. ఆ పుస్తకంపై దేశ అత్యున్నత న్యాయ స్థానం సుప్రీంకోర్టు బ్లాంకెట్ బ్యాన్ విధించిన రెండు వారాల తర్వాత ఈ వివాదంపై ఎన్‌సీఈఆర్‌టీ స్పందించింది. సోమవారం బహిరంగ క్షమాపణలు చెప్పింది. పుస్తకం మొత్తాన్ని ఉపసంహరించుకున్నామని వెల్లడించింది. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది. ప్రస్తుతం ఆ పుస్తకాన్ని పూర్తిగా ఉపసంహరించుకోవడం జరిగింది. అది ఇప్పుడు అందుబాటులో లేదు' అని స్పష్టం చేసింది. పాఠ్యాంశంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. ఆ పాఠ్యాంశాన్ని న్యాయ వ్యవస్థపై ప్రణాళికాబద్ధమైన, లోతైన దాడిగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ అభివర్ణించారు. న్యాయవ్యవస్థ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు ఈ భూమీద ఎవరినీ అనుమతించ నని తేల్చి చెప్పారు. బుక్‌పై నిషేధం విధించారు. అన్ని కాపీలను సీజ్ చేయాలని అధికారులను ఆదేశించారు. అంతేకాదు.. ఆన్‌లైన్ ద్వారా పుస్తకం మొత్తం లేదా దాని భాగాలను షేర్ చేయటంపై కూడా చీఫ్ జస్టిస్ నిషేధం విధించారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వానికి, ఎన్‌సీఈఆర్‌టీ ఛైర్మన్‌కు నోటీసులు జారీ చేశారు.



## మిలియన్ మార్చ్‌కు 15 ఏళ్లు : ఉద్యమ ప్రస్తానంలో కీలక ఘట్టం :కెటిఆర్ ట్వీట్

హైదరాబాద్, నినాదం: స్వరాష్ట్ర సాధన కోసం ట్యాంక్‌బండ్‌పై యావత్ తెలంగాణ ప్రజలు ఏకమై గర్జించి నేటికి 15 ఏళ్లు పూర్తయిందని బీఆరఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గుర్తుచేశారు. స్వరాష్ట్ర సాధన కోసం నాడు ఉద్యమ ప్రస్థానం ఉవ్వెత్తున ఎగిసిందని, తెలంగాణ ఉద్యమాన్ని ఉవ్వెత్తున ఎగిసేలా చేసిన కీలక ఘట్టాల్లో మిలియన్ మార్చ్ ఒకటని ఆయన పేర్కొన్నారు. 2011 మార్చి 10న మిలియన్ మార్చ్ సందర్భంగా నిర్బంధాలు, దిగ్బంధాలు, అడ్డంకులు, బ్యారికేడ్‌లు, ఇనుపకంచెలు ఇవేవీ తెలంగాణ ఉద్యమకారుల స్ఫూర్తిని దెబ్బతీయలేకపోయాయని కేటీఆర్ ఎక్స్ ఖాతాలో రాసుకొచ్చారు. లక్షల గొంతుకలు తెలంగాణ రాష్ట్రం కోసం ట్యాంక్‌బండ్‌పై నినదించిన అద్భుత పోరాట రూపానికి నేటితో 15 ఏళ్లు పూర్తయ్యాయని పేర్కొన్నారు. తెలంగాణ అమరవీరులకు జోహార్లు, జై తెలంగాణ అంటూ తన పోస్టును ముగించారు. ఈ పోస్టుకు మిలియన్ మార్చ్ నాటి కొన్ని ఫొటోలను షేర్ చేశారు.

# మూడేళ్లలో పంచాయితీలకు శాశ్వత భవనాలు

బడ్జెట్‌ను పురస్కరించుకుని మంగళవారం వివిధ శాఖల అధికారులు, మంత్రులతో డిప్యూటీ సీఎం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ శాఖ అధికారులతో సమావేశమై, హాస్టళ్లు, గురుకులాల అభివృద్ధికి నిధుల మంజూరుపై సమీక్షించారు. 'తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలు కలిపి నిర్మించే అవకాశాలు పరిశీలించాలని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. అదే విధంగా అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లలో ఉపాధి కల్పించే కోర్సులు ప్రవేశపెట్టాలి. గ్లోబల్ సమ్మిట్‌లో ఒప్పందం కుదుర్చుకున్న కంపెనీలతో ఏటీసీ కోర్సులు ప్రారంభిస్తాము. ఏజెన్సీ ప్రాంతాల్లో ఇసుక మైనింగ్ ట్రైబల్ ఏజెన్సీల ద్వారానే జరగాలని భట్టి విక్రమార్క వెల్లడించారు. ఐటీడీఏల సహకారంతో గిరిజనులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలి. తెలంగాణ పర్యాటక రంగాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలి. కవ్వాల్, శ్రీశైలం టైగర్ జోన్ల అభివద్ధిపై ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలి. ప్రభుత్వం ఎకో టూరిజం, టెంపుల్ టూరిజం అభివద్ధిపై చర్యలు తీసుకుంటుంది.డ్రగ్స్ మహమ్మారి నివారణకు గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. డ్రగ్స్ దుష్ప్రభావాలపై కళారూపాల ద్వారా యువతకు అవగాహన కల్పించాలి' అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఇదిలావుంటే రాష్ట్రంలో పంచాయతీరాజ్ గ్రామీణాభివద్ధి వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. గ్రామాల అభివద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం, గ్రామ స్థాయిలో ప్రజాప్రతినిధుల పాత్రను బలోపేతం చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో బ్జడెట్ వినియోగం, వచ్చే ఏడాది బ్జడెట్ ప్రతిపాదనలపై విస్తృతంగా చర్చించారు. విభాగాల వారీగా అధికారులు బ్జడెట్ ప్రతిపాదనలు సమర్పించగా వాటిలో పలు మార్పులు చేయాలని అధికారులకు సూచించారు. అలాగే ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే లోపు కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులను పూర్తి స్థాయిలో విడుదల చేయించుకోవాలని అధికారులను ఆదేశించారు. ఒక్క రూపాయి కూడా. పెండింగ్ పడకుండా, వెనక్కి పోకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని నిర్దేశిరచారు. గత ప్రభుత్వ నిర్ణయాల కారణంగా గ్రామాలకు కేంద్ర నిధులు చాలా వరకు పెండింగ్లో ఉన్నాయని, ఈనేపథ్యంలో రాష్ట్రానికి హక్కుగా రావాల్సిన వాటాను సాధించాలని అధికారులకు దిశానిర్దేశర చేశారు. కేంద్రానికి రాష్ట్రం భారీగా పన్నులు చెల్లిస్తున్న నేపథ్యంలో రాష్ట్రానికి రావాల్సిన నిధులను సమర్థంగా సాధించుకోవాలని మంత్రి పేర్కొన్నారు. ప్రతి రూపాయిని జాగ్రత్తగా ఖర్చు చేస్తే అభివృద్ధికి ఎలాంటి ఆటంకాలు ఉండవన్నారు. ముఖ్యంగా కేంద్రం నుంచి రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు పెండింగ్లో ఉన్నాయని, అవసరమైన యుటిలిటీ సర్టిఫికెట్లు సమర్పించి వాటిని త్వరగా విడుదల చేయించు కోవాలన్నారు. 99 రోజుల ప్రణాళికల్లో పంచాయతీ రాజ్, గ్రావిణాభివద్ధి శాఖ నంబర్



వన్ స్థానంలో నిలవాలని ఆకాంక్షించారు. జిల్లాల వారీగా నిర్మాణంలో ఉన్న ఇందిరా మహిళా శక్తి భవనాలను త్వరితగతిన పూర్తి వేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం జూన్ 2 నాటికి ఈ భవ నాలను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆనంతరం వాటర్ షెడ్ డెవలప్మెంట్ కార్యక్రమంపై మంత్రి సమీ క్ష నిర్వహించారు. ఆదివాసి, ఏజన్సి, గిరిజన ప్రాంతాల్లో అనేక వాగులు ఉన్నప్పటికీ వేసవి కాలంలో సాగు, తాగునీటి సమస్యలు తలెత్తుతున్నాయని మంత్రి పేర్కొన్నారు.

## గోవృషభ కళ్యాణం..
# గోదానం

**జగన్మోహన్ కులకర్ణి**

**నాగర్ కర్నూల్ మార్చి 10 (నినాదం)**

నాగర్ కర్నూల్. మునిసిపాలిటీ పరిధిలోని ఎండబెట్ల గ్రామంలో ఈనెల 13న అనంత శ్రీ గోశాల ట్రస్టు సభ్యులు జగన్మోహన్ కులకర్ణి వివరించారు మంగళవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉదయం 11 గంటలకు స్థానిక ఎమ్మెల్యే



డాక్టర్ రాజేష్ రెడ్డి దంపతులచే గో వృషభ కళ్యాణం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. గో వృషభ కళ్యాణం అనంతరం రైతులకు గోదానం చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి ఎంపీ మల్లు రవి జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి పాటిల్ మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు మున్సిపల్ చైర్మన్ తీగల సునింద్ర కుమార్ వైస్ చైర్మన్ బాదం రమేష్ స్థానిక కౌన్సిలర్ అర్జునయ్య హాజరవుతున్నట్లు తెలిపారు. వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య నిర్వహించే కార్యక్రమానికి గ్రామస్తులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు

# మార్చి 12న ప్రజా ప్రతినిధులకు శిక్షణ కార్యక్రమం

**జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**





### ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం అమలుపై సీఎస్ నిర్వహించిన వీసీలో పాల్గొన్న కలెక్టర్

**ఖమ్మం ప్రతినిధి, మార్చి 10 (నినాదం )**

మార్చి 12న భక్త రామదాసు కళాక్షేత్రంలో సర్పంచ్, మున్సిపల్ చైర్ పర్సన్, వార్డు కౌన్సిలర్ లు వంటి ప్రజా ప్రతినిధులకు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంపై శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంపై మంగళవారం అన్ని జిల్లాల కలెక్టర్ లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో ఖమ్మం జిల్లా కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి పాల్గొన్నారు.ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమం లో భాగంగా జరుగుతున్న పారిశుద్ధ్య పనులు, ఫైల్ క్లియరెన్స్, మార్చి 12న సర్పంచ్, కౌన్సిలర్ లకు ఏర్పాటు చేయనున్న శిక్షణ కార్యక్రమంపై సీఎస్ సుదీర్ఘంగా చర్చించి పలు సూచనలు చేశారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ.. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక అంశంపై ఖమ్మం జిల్లా ఇంచార్జి మంత్రివర్యుల ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహిం చినట్లు తెలిపారు. పారిశుధ్య నిర్వహణ, ఫైల్స్ క్లియరెన్స్ కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా విజయవంతంగా జరుగుతున్నదని కలెక్టర్ తెలిపారు. క్షేత్ర స్థాయి సందర్శనలో సర్పంచ్, మున్సిపల్ చైర్ పర్సన్, వార్డు కౌన్సిలర్ల భాగస్వామ్యం, పారిశుద్ధ్య నిర్వహణ కార్యక్రమంలో ఉండటం గమనించినట్లు కలెక్టర్ తెలిపారు. మార్చి 12న భక్త రామదాసు కళాక్షేత్రంలో సర్పంచ్, మున్సిపల్ చైర్ పర్సన్, వార్డు కౌన్సిలర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తు న్నామన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులకు నిర్వహించే శిక్షణ కార్యక్రమానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, ప్రతి ప్రజా ప్రతినిధికి ఆహ్వానం అందేలా చర్యలు తీసుకున్నామని అన్నారు. ప్రోటోకాల్ ప్రకారం వివిఐపి, వి.ఐ.పి. లకు ఆహ్వానం అందేలా జాగ్రత్తలు పాటించినట్లు అన్నారు. శిక్షణ కార్యక్రమానికి వచ్చే ప్రజా ప్రతినిధులకు అవసరమైన ఆహారం, ఇతర ఏర్పాట్లు కూడా కల్పించామని, ఆడియో, వీడియో వ్యవస్థ సరిగ్గా ఉండేలా చర్యలు చేపట్టామని అన్నారు.శిక్షణ కార్యక్రమంలో ఉదయం సెషన్ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యాచరణ, 10 థీమ్స్ లో వివిధ శాఖల ద్వారా చేపట్టే పనులు, ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యంపై అవగాహన కల్పిస్తామని, లంచ్ అనంతరం పిఆర్ చట్టం, మున్సిపల్ చట్టంపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.వీసీ అనంతరం జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో మాట్లాడుతూ.... శిక్షణ కార్యక్రమం సంబంధించి మినెట్ టు మినెట్ ప్రోగ్రాం షెడ్యూల్ తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. పిఆర్ చట్టంపై ఇది వరకే శిక్షణ అందించినందున, దానికి కొంత సమయం కేటాయించి, మున్సిపల్ యాక్ట్ ముఖ్యమైన అంశాలు క్లియర్ గా తెలిసేలా అవగాహన కల్పించాల న్నారు. శిక్షణ కార్యక్రమం అనంత రం స్థానిక ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యం ఉండేలా ఇంటారా క్టివ్ సెషన్ పెట్టాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, విద్య, వైద్య శాఖలో చేపడుతున్న చర్యలు వంటి ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలు, వాటి అమలులో ఎదురయ్యే ఇబ్బందులు, పరిష్కారానికి తీసుకుంటున్న చర్యల గురించి కూడా స్థానిక ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ వీడియో సమావేశంలో ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, జెడ్పీ సిఈఓ దీక్షా రైనా, సిపీఓ ఏ. శ్రీనివాస్, డిఆర్డిఓ కె. శ్రీరాం, డిపిఓ రాంబాబు, మున సిపల్ కమీషనర్లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





# ఈవిఎం గోడౌన్‌ను తనిఖీ చేసిన కలెక్టర్

**ఖమ్మం ప్రతినిధి, మార్చి 10 (నినాదం)**

త్రైమాసిక తనిఖీల్లో భాగంగా కలెక్టరేట్ ఆవరణలో ఉన్న ఈవిఎం గోడౌన్ ను జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, రాజకీయ ప్రతినిధులతో కలిసి మంగళవారం తనిఖీ చేశారు. ముందుగా ఈవిఎం గోడౌన్ సీల్ ను పరిశీలించి రాజ కీయ ప్రతినిధులు, అధికారుల సమక్షంలో సీల్ తీసి లోపలికి వెళ్లి, ఈ.వి.ఎం., వి.వి.ప్యాట్లు ఉన్న గది లోపల పరిశీలన చేసి తిరిగి సీల్ వేయించారు. తనిఖీ రిజిస్టర్ లో జిల్లా కలెక్టర్ సంతకం చేశారు. అలారం, ఫైర్ సేఫ్టీ పరికరాలు పరిశీలించారు. సీసీ కెమెరాల పని తీరును ఎప్పటికప్పుడు పరిశీలి స్తూ, నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సెక్యూరిటీ సిబ్బందికి తెలిపారు. ఎన్నికల సామాగ్రి భద్రత అత్యంత ముఖ్యమని, సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని అన్నారు. జిల్లా కలెక్టర్ వెంట ఎన్నికల విభాగం పర్యవేక్షకులు ఎం.ఏ. రాజు, ఆర్ అండ్ బి డిఇ లఖన్ నాయక్, ఏఇ లలిత, ఎన్నికల డిటి అన్సారీ, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి స్వర్ణ సుబ్బారావు, బహుజన్ సమాజ్ పార్టి ప్రతినిధి ఎం. కిషోర్, బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధి ఎల్. సతీష్ బాబు, సిపిఐ (ఎం) పార్టీ ప్రతినిధి ఆర్. ప్రకాష్, ఐఎన్ సి పార్టీ ప్రతినిధి అన్నెం గోపాల్ రావు, టిడిపి పార్టీ ప్రతినిధి పాలడుగు టిఆర్ కృష్ణప్రసాద్, అధికారులు, తదితరులు ఉన్నారు.

# ఉపాధి హామీ కూలీలకు తగు సదుపాయాలు కల్పించాలి

**గ్రామ సర్పంచ్ భూక్య చిన్నయ్య**

**ఖమ్మం, మార్చి 10(నినాదం ):**

గ్రామంలో పనిచేస్తున్న ఉపాధి హామీ కూలీలకు ఎండలును దృష్టిలో ఉంచుకొని తగు జాగ్రత్తలు తీసుకుని విధంగా అధికారులు కృషి చేయాలని కొర్లబండ గ్రామ సర్పంచ్ భూక్య చిన్నయ్య అన్నారు. మంగళవారం రఘునాథపాలెం మండలంలోని కొర్లబోడు తండా గ్రామపంచాయతీలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను గ్రామ సర్పంచ్ భూక్య చిన్నయ్య నాయక్, మండల ఏపీవో పద్మయనాయుడు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి హామీ పనులలో తగు జాగ్రత్తలు తీసుకుంటూ ఎండలు ముదురుతున్న సందర్భంగా వాళ్లకు షెడ్ నెట్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. కొత్తగా వచ్చిన రూల్స్ ప్రకారం పనులు చేసుకుంటూ కూలీలు రోజుకు 307 రూ,లు పూర్తి వేతనం పొందాలని సూచించారు. కచ్చితంగా నాలుగు గంటలు పని ప్రదేశం





లోనే ఉంటూ మొదటి ఫోటో చివరి ఫోటో దిగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ భాను భీమ్లా నాయక్ మరియు మేట్ భూక్యా కృష్ణ మరియు ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక పంపిణీ
# పూర్తిగా ఆన్‌లైన్ ద్వారా చేపట్టాలి

**నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్**

**నాగర్ కర్నూల్/ మార్చి 10 (నినాదం)**



నాగర్ కర్నూలు జిల్లాలో ప్రజల అవసరాలు మరియు ప్రభుత్వ పనుల కోసం అవసరమైన ఇసుకను పూర్తిగా ఆన్‌లైన్ విధానంలోనే దరఖాస్తు చేసుకుని పొందే విధంగా చర్యలు చేపట్టాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాధావత్ సంతోష్ అధికారులకు ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్ లో రెవెన్యూ, మైనింగ్ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో ప్రజల అవసరాలకు, అలాగే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుకను కూడా ఆన్‌లైన్ ద్వారానే పంపిణీ చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇసుక పంపిణీ పూర్తిగా పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు తమ అవసరాల కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. అలాగే ట్రాక్టర్ యాజమాన్యాలు తమ వాహనాలను ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకుంటే వారికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. జిల్లాలో అక్రమ ఇసుక రవాణాకు తావులేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. జీపీఎస్ కలిగి మైనింగ్ శాఖ వద్ద రిజిస్టర్ అయిన వాహనాల ద్వారానే ఇసుక రవాణాకు అనుమతించాలని ఆదేశించారు. జిల్లాలో ఉన్న 18 ఇసుక రీచ్‌ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, పోలీసు, రెవెన్యూ, మైనింగ్ శాఖల అధికారులు పర్యవేక్షణలో ఉండేలా చూడాలని తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే లోడింగ్ నిర్వహించాలని సూచించారు. అక్రమంగా ఇసుక తరలించే వాహనాలు పట్టుబడితే రూ.20 వేల వరకు జరిమానా విధించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో మరిన్ని ఇసుక రీచ్‌లు ప్రారంభించేందుకు తహసీల్దార్లు ఆన్‌లైన్ ద్వారా ప్రతిపాదనలు పంపాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా మైనింగ్ అధికారి వెంకటరమణ, కలెక్టరేట్ సి సెక్షన్ తహసీల్దార్ రవికుమార్, వంగూర్, ఉప్పునుంతల, కల్వకుర్తి తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలను విజయవంతం చేయాలి

**నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్**

**నాగర్ కర్నూల్ మార్చి 10 ( నినాదం)**




రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 99 రోజుల "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక"ను అచ్చంపేట మున్సిపాలిటీలో సమర్థవంతంగా అమలు చేయాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మున్సిపల్ శాఖ అధికారులు ఆదేశించారు. మంగళవారం అచ్చంపేట పట్టణంలోని 3వ వార్డు హిందూ స్మశాన వాటికలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ శాఖ అధికారుల ఆధ్వర్యంలో చేపట్టిన శ్మశానంలో ముళ్లచెట్ల తొలగింపు, పరిశుభ్రత కార్యక్రమాలను నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాధావత్ సంతోష్ పరిశీలించారు. స్మశాన వాటికలోని ముళ్ల కంప చెట్లను, పిచ్చి మొక్కలను తొలగించి పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, దహన సంస్కారాలకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా దారి వసతులను ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్ ను కలెక్టర్ ఆదేశించారు. ఈనెల 6వ తేదీ నుంచి ప్రారంభమైన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక జూన్ 12వ తేదీ వరకు ఐదు దశల్లో 99 రోజుల పాటు వివిధ శాఖలకు సంబంధించిన పది ముఖ్య అంశాలపై కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు అధికారులందరూ సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ ఈ సందర్భంగా సూచించారు. మార్చి 6 నుంచి మార్చి 15 వరకు పరిసరాల పరిశుభ్రత, ప్రభుత్వ కార్యాలయాలలో ఫైళ్ల పరిష్కరణ అంశంపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టి పూర్తిచేయాలని ఆదేశించారు. కార్యాలయాల పరిశుభ్రత, పెండింగ్ ఫైళ్ల వేగవంతమైన పరిష్కారం, రికార్డుల సక్రమ నిర్వహణ, ప్రజలకు సమయానుకూల సేవలందించడం లక్ష్యంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాలు, మున్సిపాలిటీలలో తడి–పొడి చెత్త వేరు సేకరణ, పిచ్చి మొక్కల తొలగింపు, బహిరంగ ప్రదేశాల్లో చెత్త నిర్మూలన, ప్రభుత్వ భవనాల శుభ్రత కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టర్ వెంట అచ్చంపేట మున్సిపల్ చైర్మెన్ గార్లపాటి శ్రీనివాసులు, ఆర్డిఓ యాదగిరి, మున్సిపల్ కమిషనర్ మురళి, ఇతర అధికారులు ప్రజా ప్రతినిధులు తదితరులు ఉన్నారు .



## ఆద్య మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో
# విజయవంతమైన శస్త్రచికిత్స

**4.5 కిలోల అండాశయ గడ్డ (కనితి)ని విజయవంతంగా తొలగించిన వైద్యులు**

**అత్యాధునిక చికిత్సతో రోగిని కాపాడిన ఆద్య హాస్పిటల్ వైద్యులు**

**ఖమ్మం ప్రతినిధి, మార్చి 10(నినాదం )**

నగరంలోని ఆద్య మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో అరుదైన శస్త్రచికి త్సను వైద్యులు విజయవంతంగా నిర్వహించారు. డాక్టర్ సతీష్ కుమార్ లాప్రోస్కోపిక్ సర్జన్ ఆధ్వర్యంలో కడుపులోని అండాశయంలో ఏర్పడిన భారీ గడ్డ (కనితి )ను ఆపరేషన్ ద్వారా విజయవంతంగా తొలగించారు.బాధితురాలు తీవ్రమైన కడుపునొప్పితో ఆసుపత్రికి రావడంతో వైద్యులు తక్షణమే పరీక్షలు నిర్వహించారు. పరీక్షల్లో అండాశయంలో సుమారు 4 కిలోల 500 గ్రాముల బరువున్న భారీ గడ్డ (కనితి )ఉన్నట్లు గుర్తించారు. అనంతరం వెంటనే శస్త్రచికిత్స చేసి ఆ కనితి తొలగించారు. శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తవడంతో బాధితురాలు ప్రస్తుతం కోలుకుంటోంది. తక్షణమే చికిత్స అందించి తమ ప్రాణాలు కాపాడిన డాక్టర్ సతీష్ కుమార్ అలాగే డాక్టర్ నారగాని రాంప్రసాద్ (జనరల్ మెడిసిన్), ఆద్య హాస్పిటల్ బృందానికి బాధితురాలు ఆమె కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# పాడి రైతుల సంక్షేమానికి కృషి

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్**

**గద్వాల బ్యూరో మార్చి 10 ( నినాదం )**

పాడి రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెట్టిందని అందులో భాగంగానే గేదెల కొనుగోలుకు సహకారం అందిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. జిల్లా షెడ్యూల్డ్ కులముల సేవా సహకార అభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో పైలట్ ప్రాజెక్టుగా ప్రవేశపెట్టిన మినీ డైరీ పథకానికి ఎంపికైన 44 మంది రైతులు గేదెలు కొనుగోలు చేసేందుకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి వెళుతున్న సందర్భంగా మంగళవారం ఐడిఓసి ఆవరణలో వాహనాన్ని జెండా ఊపి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ పథకానికి ఎంపికైన లబ్ధిదారులకు గేదెల కొనుగోలుకు రూ.2 లక్షలకు గాను 60 శాతం ప్రభుత్వం సబ్సిడీ ఇస్తోందని, మిగిలిన 40 శాతం బ్యాంకు లోన్ పొందడం జరుగుతుందన్నారు. ఉత్తరప్రదేశ్లోని అయోధ్య సమీపంలో మంచి పాల ఉత్పత్తిని ఇచ్చే గేదెలు ఉండడంతో పాడి రైతులను అక్కడికి పంపిస్తున్నట్లు తెలిపారు. గేదెల కొనుగోలుకు సంబంధిత శాఖల పలువురు అధికారులు కూడా రైతుల వెంట



అక్కడికి వెళ్లి సహకరిస్తారన్నారు. రైతులు కొనుగోలు చేసిన గేదెలు జాగ్రత్తగా వారి ఇంటికి చేరేలా అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారిని నుషిత, పశుసంవర్ధక శాఖ అధికారి శివానంద స్వామి, తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోళ్లలో
# పారదర్శకతకు చర్యలు: కేంద్రం

**లోక్‌సభలో వివరాలు కోరిన ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి**

**ఖమ్మం ప్రతినిధి, మార్చి 10 (నినాదం)**



వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోళ్లలో ప్రైవేట్ ఏజెన్సీల పాత్ర, వాటి ఎంపిక ప్రమాణాలు, కొనుగోలు ప్రక్రియలో పారదర్శ కతపై కేంద్ర ప్రభుత్వం తీసుకుం టున్న చర్యలను వెల్లడించాలని ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు రఘురామ్ రెడ్డి లోక్‌సభలో కోరారు. రైతుల ప్రయోజనాలు దెబ్బతినకుండా ప్రైవేట్ కొనుగోళ్లు మరియు ప్రభుత్వ మద్దతు పథకాల మధ్య సమతుల్యత ఎలా కొనసాగిస్తున్నారో వివరించాలని ప్రశ్నించారు.పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా మంగళవారం ఆయన ఈ అంశాన్ని లేవనెత్తారు. దీనికి కేంద్ర వ్యవసాయం, రైతు సంక్షేమ శాఖ సహాయ మంత్రి భగీరత్ చౌదరీ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

**పీఎం–ఆశా ద్వారా మద్దతు ధర...**

ప్రధాన మంత్రి అన్నదాత ఆయ్ సంరక్షణ అభియాన్ (పిఎం -ఆశా ) పథకం కింద పీఎస్ఎస్ ద్వారా పప్పుధాన్యాలు, నూనె గింజల కొనుగోళ్లు కనీస మద్దతు ధర (ఎంఎస్పీ) ప్రకారం నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. కేంద్ర నోడల్ ఏజెన్సీలుగా నాఫెడ్ నేషనల్ కోఆపరేటివ్ కన్స్యూమర్స్ ఫెడరేషన్ అఫ్ ఇండియా సంస్థలు వ్యవహరిస్తున్నాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వాలు నియమించిన రాష్ట్ర స్థాయి ఏజెన్సీలు, సహకార మార్కెటింగ్ సమాఖ్యలు కొనుగోళ్లు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

**కొనుగోలు కేంద్రాల ఏర్పాటు...**

రైతులకు సౌలభ్యం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు తాత్కాలిక కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. రైతుల ఉత్పత్తి, మార్కెటింగ్ అవసరాలు, నిల్వ రవాణా సదుపాయాలను పరిగణనలోకి తీసుకుని ఈ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

**రైతుల ఖాతాల్లోకే చెల్లింపులు**

కొనుగోలు చేసిన పంటకు సంబంధించిన కనీస మద్దతు ధరను నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో డీబీటీ ద్వారా జమ చేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. కొనుగోలు తేదీలు, కేంద్రాల వివరాలు, నాణ్యత ప్రమాణాలపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.



## ఖమ్మం జిల్లాలో తొలి 2.0 మెగావాట్
# సోలార్ ప్లాంట్ ప్రారంభం

**పిఎం-కుసుమ్ పథకం కింద రైతు ఏర్పాటు చేసిన సౌర విద్యుత్ కేంద్రం గ్రిడ్‌కు అనుసంధానం...**

**జూపెడ గ్రామంలో 2.0 మెగావాట్ సౌర విద్యుత్ ప్లాంట్ ప్రారంభం**

**ఖమ్మం ప్రతినిధి, మార్చి 10 (నినాదం)**

ప్రధానమంత్రి కుసుమ్ పథకం కింద ఖమ్మం జిల్లాలో తొలి 2.0 మెగావాట్ సామర్థ్యం గల సౌర విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని గ్రిడ్‌కు అనుసంధానం చేసి ప్రారంభించా రు. తిరుమలాయపాలెం మండలం జూపెడ గ్రామ పరిధిలో రైతు బీరవల్లి శ్రీనివాసరావు ఏర్పాటు చేసిన ఈ సోలార్ ప్లాంట్‌ను ఖమ్మం జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ ఇనుగుర్తి శ్రీనివాసాచారి ప్రారంభించారు. జిల్లాలో ఈ పథకం కింద ఏర్పాటు చేసి గ్రిడ్‌కు అనుసంధానం చేసిన మొట్టమొదటి సోలార్ ప్లాంట్ ఇదే కావడం విశేషం.ఈ సౌర విద్యుత్ ప్లాంట్ ద్వారా పర్యావరణానికి హాని లేకుండా స్వచ్ఛమైన విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. ప్లాంట్ ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను గ్రిడ్‌కు సరఫరా చేయడం ద్వారా రైతుకు 25 సంవత్సరాల పాటు స్థిరమైన ఆదాయం లభించనుంది. పునరు త్పాదక శక్తి వినియోగం పెరగడం ద్వారా కార్బన్ ఉద్గారాలు తగ్గి పర్యావరణ పరిరక్షణకు దోహదం చేస్తుందని అధికారులు తెలిపారు.

జిల్లాలో ఇప్పటికే 43 మంది రైతులు 70 మెగావాట్ల సామర్థ్యంతో ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థతో కొనుగోలు ఒప్పందాలు చేసుకోగా, మరికొన్ని ప్రాజెక్టులు నిర్మాణ దశలో ఉన్నాయి.

ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ పిఎం =కూసుమ్ పథకం రైతులకు అదనపు ఆదాయం కల్పించే మంచి అవకాశమని పేర్కొన్నారు. రైతులు తమ భూములను వినియోగించి సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేసి ఆర్థికంగా లాభపడవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో రైతు బీరవల్లి శ్రీనివాసరావుతో పాటు అంపీడీసీ ఎల్ ఎస్ ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి, టీటీజీ రెడిఓ జిల్లా మేనేజర్ పోలిశెట్టి అజయ్ కుమా ర్, డి ఈ నాగేశ్వరరావు, భద్రుపవార్, ఎడిఈ లు, ఎఈ లు, గ్రామ సర్పంచులు నరేందర్ రెడ్డి, గండు చంద్రయ్య, గూడూరు ఉపేందర్, ఆత్మ కమిటీ చైర్మన్ ఓరా వెంకటేశ్వర్లు, ఎస్ బి ఐ బ్యాంక్ మేనేజర్, ఇపిసి కాంట్రాక్టర్ పునర్వి ఎనర్జీస్ ప్రతినిధులు ఫీల్డ్ ఆఫీసర్ పాల్గొన్నారు.ఈ ప్రాజెక్ట్ విజయవం తంగా ప్రారంభం కావడం ద్వారా జిల్లాలో మరిన్ని రైతులు సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటు వైపు ముందుకు రావాలని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.




## 100% సబ్సిడీపై
# కూరగాయ విత్తనాలు

**మధిర, మార్చి 10 (నినాదం):**

కూరగాయల విత్తనాలు ఒక ప్యాకెట్ 0.20 గుంటలు (అర ఎకరం) కి ఉద్యానవన శాఖ వారు 100% సబ్సిడీపై అందచేస్తున్నారు... ఆసక్తి గల రైతులు సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారి గారిని సంప్రదించగలరు. కావలసిన జిరాక్స్ పొలం పాస్ బుక్ 2. ఆధార్ కార్డు 3. బ్యాంకు ఖాతా 4. పాస్పోర్ట్ సైజు ఫోటో.

# సోలార్ మోడల్ గ్రామంగా రఘునాథపాలెం ఎంపిక

**ఖమ్మం, మార్చి 10(నినాదం ):**

సోలార్ మోడల్ గ్రామంలో మండల కేంద్రమైన రఘునాథపాలెం గ్రామాన్ని ఎంపిక చేయడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కృష్ణారావు గ్రామంలో ఏర్పాటు చేసిన నూతన ట్రాన్స్ఫార్లను మంగళవారం ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి సారధ్యంలో మన రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధ్వర్యం లో రఘునాథపాలెం హెడ్ క్వార్టర్స్ లో రఘునాథపాలెం విలేజ్ సోలార్ మోడల్ విలేజ్ గా ఎంపిక చేసినందుకు మంత్రికి వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఖమ్మం డి రామారావు, ఏ డీ ఈ సంజీవికుమార్



జె.ఏఈ శంకర్ లు, మాజీ సొసైటీ చైర్మన్ తాత రఘురాం , ఉప సర్పంచ్ ప్రశాంత్, వార్డు సభ్యులు , కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు బోయిన వెంకటనర్సయ్య, బాధవత్ సంధ్య,మరియు గ్రామ నాయకులు పాల్గొన్నారు

# 10 వ తరగతి హాల్ టిక్కెట్లు ఆపొద్దు

**బి. ఎస్. ఎఫ్ .డిమాండ్**

**నాగర్ కర్నూల్/ మార్చి: 10 (నినాదం)**



ఫీజుల పేరుతో పదవ తరగతి హాల్ టికెట్లు ఆప వద్దని బహుజన్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి కొంగరి రామకృష్ణ కోరారు ఫీజుల బకాయిల పేరుతో ఈ రాష్ట్రంలో ఉన్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు పదేళ్ల కష్టానికి ప్రతి రూపమైన పదో తరగతి పరీక్షల సమయంలో కేవలం ఫీజుల కోసం హాల్ టిక్కెట్లు ఆపి విద్యార్థులను మానసిక ఆందోళనకు గురి చేయొద్దని అన్నారు.ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఫీజులు పెండింగ్ కారణం చూపి విద్యార్థులకు హాల్ టిక్కెట్లు ఆపి విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకోవద్దని ఆయన హెచ్చరించారు.హాల్ టికెట్ల వేధింపులపై జిల్లాల విద్యాశాఖ కార్యాలయాలలో ఒక ప్రత్యేక ఫోన్ నెంబర్ లేదా హెల్ప్ డేస్కులు ఏర్పాటు చేయాలని ఆయన తెలిపారు .విద్యార్థులను మానసిక ఆందోళనకు గురి చేసినట్లు అయితే ఆ పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని ఉన్నతాధికారులను కోరారు

# యువ క్రికెటర్లకు ప్రేరణ

తొలిసారిగా కపిల్ దేవ్ సార్థ్యంలోని క్రికెట్ టీమ్ ప్రపంచ కప్ గెలిచిన 1983 నుంచి ఇప్పటి వరకు అనేక మార్పులు వచ్చాయి. క్రికెట్‌లో రూల్స్ మారాయి. అనేక నిబంధనలు వచ్చి పడ్డాయి. ట్వంటీ ట్వంటీ వచ్చింది. కొత్తగా ఐపిఎల్ మ్యాచ్‌లు వచ్చాయి. ఇవన్నీ కూడా యువ క్రెటర్లను ఆకర్షిస్తున్నాయి. ఇలా ఎన్ని మార్పులు వస్తున్నా..భారత్ క్రికెట్ వన్నె తగ్గకుండా పోరాడుతున్న స్ఫూర్తి అభినందనీయం. అంతేకాదు.. భారత్ క్రికెట్‌లో కొత్త నీరు నిరంతరంగా ప్రవహిస్తూనే ఉంది. సచిన్ టెండూల్కర్, గంగూలీ, యువరాజ్ సింగ్, జడేజా, వీరేంద్ర సెహ్వాగ్ ఇలా ఎందరో క్రికెటర్లు మన టీమ్ పనితనాన్ని మెరుగు పర్చారు. ధోనీ, విరట్ కోహ్లీ, రోహిత్ శర్మ లాంటి వారు క్రికెట్ స్వరూపాన్నే మార్చేశారు. ఇక మొన్న జరిగిన టీ ట్వంటీ వరల్డ్ కప్ పోటీల్లో భారత్ మరోమారు సత్తా చాటింది. ఇందులో గమనించాల్సిన విషయం ఏమంటే సంజూ శంసన్ విశ్వరూపం. అతడి ఆటతీరు చూడగానే సమయాను కూలంగా ధోనీలా, విరాట్‌లా, రోహిత్ శర్మలా విజృంభించగల నైపుణ్యం కనిపించింది. అన్నింటికి మించి అతను చేసిన ఓ చిన్న పని భారత ఔన్నత్యాన్ని, క్రికెట్ గొప్పతనాన్ని చాటింది. ఇంగ్లడ్తో జరిగిన సెవి స్‌లో సెంచరీ మిస్ అయిన సంజూ శాంసన్ మ్యాన్ ఆఫ్‌ది మ్యా, గా ఎన్నికయ్యాడు. కానీ భారత్ విసిరిన 250 పైన పరుగుల ఛాలెంజ్‌లో ఇంగ్లడ్ యువ కిశోరం బెథెల్ అద్భుతంగా రాణించాడు. ఒంటరి పోరుతో సెంచరీతో భారత్‌కు వణుకు పుట్టించాడు. అతను ఔట్ కాకుండా ఉంటే...భారత్ వెనుదిరుగేదే. సంజూ శాంసన్ తనకు దక్కిన మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును బెథెల్‌కు అందించారు. అతనే నిజమైన హీరో అని పొగిడారు. సంజూ చేసిన ఈ ఒక్క పనితో భారత్ గొప్పతనాన్ని ప్రపంచానికి చాటింది. అయితే అదే సంజూను మనం గుర్తించి, జట్టులోకి తీసుకోవడం లో రాజకీయాలు ఆడామని ఒప్పుకోవాల్సిందే. ప్రతిభకు ఏదీ అడ్డం కాదని, క్రీడల్లో రాజకీయాలు ఉండరాదని మనం గుర్తించాలి. అందులే ఇలాంటి వారందరినీ స్ఫూర్తిగా యువతలో కొత్త ఆశలు చిగురింప చేశారు. క్రికెట్‌లోచోటు దక్కేది 11 మందికే అని తెలిసినా భారత యువరక్తం ఇప్పుడు లక్షల్లో శిక్షణ తీసుకుంటున్నారు. తామూ క్రికెటర్లుగా ఎదగాలనుకుంటున్నారు. ఇలాంటి వారు జాతీయ జట్టులో చోటు దక్కించుకోకున్నా, క్రికెట్‌ను నిలబడెతున్నారని తెలుసుకోవాలి. అందుకే ఇప్పుడు ఎక్కడ చూసినా క్రికెట్ కోచింగ్ సెటర్లు వెలిశాయి. ప్రతి ఇంట్లో ఒకరు క్రికెట్ బ్యాట్ పట్టుకుని మైదానంలోకి పరుగెడుతున్నాడు. ఇది ఓ రకంగా ప్రేరణ. యువతకు స్ఫూర్తి. అటు విమెన్ క్రికెట్ అయినా, ఇటు మెన్ క్రికెట్ అయినా ప్రతి ఒక్కరూ శిక్షణకు దిగుతున్నారు. మొత్తంగా టీమిండియా వరుసగా రెండోసారి, మొత్తంగా మూడో పర్యాయం టీ20 ప్రపంచ కప్‌లో చాంపియన్‌గా నిలిచింది. అభిషేక్ శర్మ, సంజూ శాంసన్, ఇషాన్ కిషన్, తిలక్ వర్మ వంటి యోధులు ఇప్పుడున్న జట్టుకు వెన్నముక గా నిలిచారు. జస్‌ప్రీత్ బుమ్రా బౌలింగ్‌ను ముందుండి నడిపించాడు. అవసరమనుకున్న ప్రతిసారీ వికెట్ పడగొట్టి ప్రస్తుత తరంలో ప్రపంచ అత్యుత్తమ బౌలర్‌గా తనపేరును సార్థకం చేసుకున్నాడు. హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే, అక్షర్ పటేల్ ఆల్‌రౌండ్ మెరుపులతో టీమిండియా ఆధిపత్యానికి ఎదురులేక పోయింది. జట్టులోని ఆటగాళ్లంతా కలిసికట్టుగా కదంతొక్కి ప్రపంచకప్ సంగ్రామంలో భారత్ మరోమారు విశ్వవిజేతగా ఆవిర్భవించడంలో విశేషంగా దోహదపడ్డారు. సమర్థ నాయకుడిగా ముందుండి నడిపించిన సూర్యకుమార్ జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. ఈ విజయంతో భారత్‌కు ఐసీసీ ట్రోఫీలు అందించిన దిగ్గజాలు కపిల్ దేవ్, ఎంఎస్ ధోనీ, రోహిత్ శర్మ సరసన నిలిచాడు. ప్రపంచ క్రికెట్‌లో ఆధిపత్యాన్ని చాటుకుంటున్న భారత జట్టు సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. కపిల్ డెవిల్స్, ధోనీ సేన, రోహిత్ బృందం అద్భుత విజయాలను మరిపిస్తూ.. మరో విశ్వకప్పును ఒడిసి పట్టుకుంది. న్యూజిలాండ్‌ను ఏకపక్షంగా నిలువరించిన సూర్యకుమార్ సేన యావద్భారతావని గర్వించే ప్రదర్శన కనబరచింది. రెండేళ్ల క్రితం జరిగిన టోర్నీలో టైటిల్ గెలిచిన భారత జట్టు ఈసారి ట్రోఫీ నిలబెట్టుకొని సరికొత్త చరిత్ర సృష్టించింది. మొత్తంగా మూడోసారి ఈ కప్పును దక్కించుకొని మరే జట్టుకూ సాధ్యమవని అరుదైన ఘనతను అందుకొంది. ఈ అద్భుతానికి సాక్షిగా నిలిచిన అహ్మదాబాద్ స్టేడియంలో మూడేళ్లక్రితం వన్డే ప్రపంచకప్ ఫైల్లో ఎదురైన పరాజయ భారాన్ని దించేసుకుంది. ఆతిథ్య జట్టుకు కప్పు దక్కదన్న సెంటిమెంట్‌ను పటాపంచలు చేసింది. ఇలా ఎన్నో రికార్డుల పరంపరలు, మధురస్మృతులను క్రికెట్ అభిమానులకు అందించిన భారత జట్టు విజయం చిరస్మరణీయం. అహ్మదాబాద్ స్టేడియంలో పరుగులను రాబట్టడం కష్టమే అయినా, 255 పరుగుఉల కొట్టి, పటిష్టమైన న్యూజిలాండ్ జట్టును ధీకొటటిన తీరు యువ క్రికెటర్లకు స్ఫూర్తాదాయకం. క్రికెట్ అభిమానలకు విమెన్స్ డే ఆదివారం పండ గనింపింది. రెండేళ్ల క్రితం టీ20 ప్రపంచకప్ గెలిచిన టీమిండియాలోని రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, రవీంద్ర జడేజాలాంటి కీలక ఆటగాళ్లు ఇప్పుడు జట్టులో లేరు. అయినా, ఆ సీనియర్లు లేరన్న లోటు లేకుండా యువ క్రికెటర్లు అద్భుతంగా రాణించారు. ఇదే టీమిండియా బలం అని నిరూపించారు. కొత్త రక్తం వస్తూనే ఉంటుందని నిఊపించారు. టీమిండియా ఈసారి టోర్నీ ఆసాంతం అద్భుమైన ప్రదర్శనతో ఆకట్టుకుంది. టోర్నమెంట్ మొత్తంగా సూపర్`8 దశలో దక్షిణాఫ్రికాతో పరాజయం మినహా అన్ని మ్యాచుల్లోనూ విజయదుందుభి మోగించి సత్తా చాటుకుంది. మూడుసార్లు 250కి పైగా స్కోర్లు నమోదు చేయడం మన జట్టు యువ బ్యాటర్ల సత్తాకు నిదర్శనం. ఛేదన అయినా, లక్ష్యాన్ని నిర్దేశించడంలో అయినా జట్టు రాటుదేలిందనే చెప్పాలి. ఇలాగే కొనసాగితే రేపు జరిగే అనేక పోటీల్లో విజయం మనదే అవుతుంది. ఈ చిరస్మరణీయ గెలుపులో ఆటగాళ్ల పట్టుదల, ప్రతిభకు తోడు కోచ్ గౌతమ్ గంభీర్ పాత్ర ఎనలేనిది.

సంపాదకీయం




# ఇరాన్ యుద్ధ ప్రభావంతో ధరల మోత

### గ్యాస్ ధరలు పెరగడంతో పెట్రో ధరలపై ఆందోళన ఇప్పటికిప్పుడు ప్రమాదం లేదని వెల్లడించిన కేంద్రం

న్యూఢిల్లీ: పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మనదేశ నిత్యావసరాలపై తీవ్ర ప్రభావం చూపించబోతున్నట్టు వార్తలు వస్తున్నాయి. ముఖ్యంగా పెట్రోల్, గ్యాస్, ఎరువుల దిగుమతులకు ఆటంకం ఏర్పడడంతో, అతి త్వరలోనే వీటి నిల్వలు నిండుకుంటాయని భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇదే సంర్భంలో గ్యాస్ ధరలు పెరిగాయి. అలాగే పెట్రో ధరలు పెరుగాయని అంటున్నారు. వీటి ప్రభావంతో నిత్యాసవరాలు కూడా పెరగక తప్పేలా లేదు. ఈ నేపథ్యంలో కేంద్రం స్పందించింది. ముఖ్యంగా పెట్రోల్ ధరలు పెరుగుతాయనే వార్తలను ఖండించింది. కొంతపాలం పాటు నష్టాలను చమురు కంపెనీలు భరిస్తాయని వెల్లడించింది. రాబోయే 6 నుంచి 8 వారాల వరకు ముడి చమురు, శుద్ధి చేసిన పెట్రోల్ నిల్వలు ఉన్నాయని కేంద్రం వెల్లడించింది. అలాగే ఎల్పీజీ సిలిండర్ల నిల్వలు కూడా ప్రస్తుతానికి సరిపోతాయని పేర్కొంది. అయితే గ్యాస్ సిలిండర్ల బుకింగ్ వ్యవధిని 25 రోజులకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఇంతకు ముందు ఈ వ్యవధి 21 రోజులు ఉండేది. మనదేశంలో సగటున ఒక కుటుంబం ఏడాదికి 7 నుంచి 8 సిలిండర్లను మాత్రమే వినియోగిస్తున్నట్టు కేంద్రం పేర్కొంది. లాగే రాబోయే ఖరీఫ్ సీజన్‌కు సరిపడా ఎరువులు కూడా అందుబాటులో ఉన్నాయని ఫెర్టిలైజర్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా వెల్లడించింది అయితే ప్రస్తుత భౌగోళిక ఉద్రిక్తతలు, గ్యాస్ సరఫరాలో కోత యూరియా ఉత్పత్తులపై ప్రభావం చూపించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. ప్రస్తుతం 177.31 లక్షల టన్నుల ఎరువులు నిల్వలున్నట్టు తెలిపింది. వాటిల్లో 59.30 లక్షల టన్నుల యూరియా, 25.13 లక్షల టన్నుల డీఏపీ, 55.87 లక్షల టన్నుల ఎన్‌పీకేఎస్ నిల్వలున్నాయని పేర్కొంది.

### ఇంధన ధరలు దిగి వస్తాయి
#### త్వరలోనే ఇరాన్ యుద్ధం ముగుస్తుంది
#### ట్రంప్ సంచలన ప్రకటన

ఇరాన్‌పై యుద్ధం కొనసాగుతుందని,వెనక్కి తగ్గేది లేదన్న ట్రంప్ కొంత మెత్త బడ్డారు. వెనక్కి తగ్గుతున్నట్లుగా కనిపిస్తున్నారు. ఇరాన్ కూడా గట్టి హెచ్చరికలు చేయడంతోనో ఏమో యుద్ధానికి త్వరలోనే ముగింపు దొరుకుతుందని అన్నారు. ఇరాన్ యుద్ధం త్వరలోనే ముగుస్తుందని, చమురు ధరలు కిందకు దిగి వస్తాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. ఇరాన్ విషయంలో తాము నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించడానికి చేరువలో ఉన్నామని, ఇరాన్‌పై దాడిని, మధ్య ప్రాచ్యంలోని చెడును వదిలించడానికి అమెరికా చేసిన విహారయాత్రగా ట్రంప్ అభివర్ణించారు. ఆ విహారయాత్ర స్వల్పకాలికంగానే ఉంటుందని తెలిపారు. మియామి గోల్ఫ్ క్లబ్‌లో రిపబ్లికన్ చట్ట సభ్యులతో జరిగిన సమావేశంలో ట్రంప్ ప్రసంగించారు. 'ఇరాన్ యుద్ధం ఈ వారంలోనే ముగుస్తుందా' అనే ప్రశ్నకు ట్రంప్ స్పందిస్తూ.. 'లేదు. కానీ త్వరలోనే ముగుస్తుంది' అని జవాబిచ్చారు. 'మా సైనిక లక్ష్యాన్ని పూర్తి చేసే దిశగా పెద్ద అడుగులు వేస్తున్నాం. ఇరాన్‌లోని బలగాలను పూర్తిగా తుడిచిపెట్టేశాం. అంతర్జాతీయ చమురు సరఫరాకు అంతరాయం కలిగిస్తే ఉపేక్షించేది లేదు. అలా చేస్తే ఇరాన్‌ను పూర్తిగా ధ్వంసం చేస్తాం' అని ట్రంప్ హెచ్చరించారు. మెరికా, ఇజ్రాయెల్‌పై దాడిని పొడిగించేందుకు ఇరాన్‌కు తగినంత సామర్థ్యం లేదు కాబట్టి, యుద్ధం త్వరలోనే ముగిసిపోతుందని ట్రంప్ పేర్కొన్నారు. అమెరికా`ఇజ్రాయెల్ దాడిలో ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ మరణించడంతో ఆయన వారసుడిగా మొజ్తాబా ఖమేనీ ఎంపికైనట్టు వార్తలు వస్తున్నాయి. ఇరాన్ నూతన సుప్రీం లీడర్‌గా మొజ్తాబాను ఎంపిక చేయడం పట్ల తాను చాలా నిరాశ చెందానని, అయితే కొత్త సుప్రీం లీడర్‌పై దాడి చేసే ఉద్దేశం తనకు లేదని ట్రంప్ తెలిపారు.

# పెన్సిలిన్ ఆవిష్కర్త ఫ్లెమింగ్

### మార్చి 11...అలెగ్జాండర్ ఫ్లెమింగ్ వర్ధంతి

వెయ్యేళ్ల కాలంలోనే అతి గొప్ప ఆవిష్కరణగా, కోట్లాది మంది ప్రాణాలకు రక్షణగా గుర్తింపు పొందింది 'పెన్సిలిన్'. వైద్య శాస్త్రంలో అద్భుతమైన యాంటీ బయాటిక్ మందుగా పేరుపొందిన పెన్సిలిన్ పేరు చెప్పగానే వెంటనే స్ఫురించే పేరు అలెగ్జాండర్ ఫ్లెమిం గ్. తొలి యాంటీ బయోటిక్‌గా పేరొందిన ఆ మందును కనిపెట్టిన శాస్త్రవేత్తే అలగ్జాండర్ ఫ్లెమింగ్.

ప్రపంచంలో అత్యంత విస్తృతంగా ఉపయోగించే యాంటీ బయాటిక్.

వేరే ప్రయోగం చేస్తుండగా జరిగిన చిన్న పొరపాటు వల్ల ఇది బయట పడడం విశేషం. పెన్సిలిన్ వల్ల క్షయ, న్యూమోనియా, టైఫాయిడ్ లాంటి ఎన్నో ప్రాణాంతక వ్యాధుల నుంచి మానవాళికి రక్షణ కలుగు తోంది. దీన్ని కనిపెట్టినందుకు ఫ్లెమింగ్ 1945లో నోబెల్ బహు మతిని పొందారు.

సర్ అలెగ్జాండర్ ఫ్లెమింగ్ (ఆగస్టు 6, 1881 – మార్చి 11, 1955) స్కాట్లాండుకు చెందిన జీవ శాస్త్ర వేత్త, వైద్యుడు. 1923 లో కనుగొన్న ఎంజైములు, లైసోజై ములు, 1928 లో కనుగొన్న ప్రపంచ మొట్ట మొదటి యాంటీ బయోటిక్ పెన్సిలిన్ ఆయన పరిశోధనల్లో ముఖ్యమైనవి. పెన్సిలిన్ కనుగొన్నందుకు ఆయన 1945లో హోవర్డ్ ఫ్లోరే, ఎర్నెస్ట్ బోరిస్ చైన్ లతో కలిసి వైద్య శాస్త్రంలో నోబెల్ బహుమతి అందుకున్నాడు. బ్యాక్టీరియాలజీ, ఇమ్యునాలజీ, కీమోథెరపీ మీద అనేక వ్యాసాలు రాశారు.

స్కాట్లాండ్‌లో 1881 ఆగస్టు 6న రైతు కుటుంబంలో పుట్టిన ఫ్లెమింగ్, ఏడేళ్ల వయసు లోనే తండ్రిని కోల్పోయి, ఆర్థిక ఇబ్బందుల వల్ల చదువు మధ్యలోనే ఆపేసి షిప్పింగ్ కంపెనీలో గుమాస్తాగా చేరాల్సి వచ్చింది. అనుకోకుండా ఆస్తి కలిసి రావడంతో తిరిగి ఇరవయ్యేళ్ల వయసులో చదువును కొన సాగించడం ప్రపంచానికెంతో మేలు చేకూర్చింది. సెయింట్ మేరీస్ కాలేజీలో వైద్యవిద్యలో చేరి చురుగ్గా చదువుతూనే రైఫిల్ షూటింగ్, ఈత, వాటర్‌పోలో క్రీడల్లో బహుమతులు పొందుతూ ఉండేవారు. మేరీ మెడికల్ కాలేజీ నుంచి 1906 లో ఈయన డిగ్రీ తీసుకున్నారు. డిగ్రీ పొందాక పరిశోధనల్లో నిమగ్నమయ్యారు.

మొదటి ప్రపంచ యుద్ధం ఫలితంగా 1918 లో మళ్ళీ సెయింట్ మేరీ మెడికల్ కాలేజీకి చేరారు. మొదటి ప్రపంచ యుద్ధం మొదలవడంతో సైనికులకు చికిత్స లు చేసే బృందానికి నాయకత్వం వహించారు. గాయాలకు సూక్ష్మ జీవుల వల్ల ఇన్ఫెక్షన్ సోకి చాలా మంది సైనికులు చనిపోవడాన్ని గమనించిన ఫ్లెమింగ్, యుద్ధా నంతరం బ్యాక్టీరియాపై పరిశోధన లు చేయసాగారు. లండన్ లోని సెయింట్ మేరీస్ హాస్పిటల్‌లోని ప్రయోగశాలలోని ఇన్‌క్యులేషన్ విభాగంలో ఫ్లెమింగ్ ఇన్ఫ్లుఎంజా వైరస్‌తో ప్రయోగాలు చేశారు. వాటిలో భాగంగా 'స్టెఫైలో కోకి' సూక్ష్మజీవులపై పరిశోధన చేస్తుండగా ఓ రోజున చిన్న పొర పాటు జరిగింది. ఆ బ్యాక్టీరియా ఉన్న పాత్రలను బల్లపై పెట్టి మర్చిపోయి ఇంటికి వెళ్లిపోయారు. ఆ మర్నాడు వచ్చి చూస్తే బయటి వాతావరణం ప్రభావం వల్ల ఓ పాత్రలో నీలిరంగులో బూజులాంటి తెట్టు (ఫంగస్) కట్టి ఉండడం గమనించారు. చిత్రంగా ఆ బూజు ఆశించినంత మేరా పాత్రలో సూక్ష్మజీవులు నాశనమై కనిపించా యి. అంటే ఆ బూజులో సూక్ష్మ జీవులను చంపే పదార్థమేదో ఉందని తెలుసు కున్నారు.

దాంతో ఫ్లెమింగ్ దానిపై పరిశోధ నలు చేసి చిన్న కుంచెలాగా ఉండే పదార్థాన్ని వేరుచేయ గలిగారు. లాటిన్‌లో పెన్సిలియమ్ అంటే చిన్న కుంచె అనే అర్థం ఉండడంతో దానికి 'పెన్సిలిన్' అని పేరు పెట్టారు. దాన్ని 1928లో కనిపెట్ట గా, మరిన్ని పరిశోధనలు చేసి ఓ మందుగా మార్చి వాడుకలోకి తీసుకు రావడానికి 17 సంవత్స రాలు పట్టింది. దీంతో యాంటీ బయాటిక్ యుగానికి నాంది పలికినట్టయింది.

ప్రచురించిన నివేదికలలో ఫ్లెమింగ్ ఇలా అంటారు:



ఒకరు కొన్నిసార్లు తాను వెతకని దాన్ని కనుగొంటారు. నేను సెప్టెంబర్ 28, 1928 న తెల్లవారు జామున మేల్కొన్న ప్పుడు, ప్రపంచం లోని మొట్ట మొదటి యాంటీ బయాటిక్ లేదా బ్యాక్టీరియా కిల్లర్‌ను కనుగొనడం ద్వారా ఔషధం మొత్తాన్ని విప్లవా త్మకంగా మార్చాలని నేను ఖచ్చితంగా అనుకోలేదు. కానీ నేను సరిగ్గా అదే చేశానని అనుకుంటు న్నాను. 1942 లో యునైటెడ్ స్టేట్స్‌లో స్ట్రెప్టోకోకల్ సెప్టిసిమియాకు మొదటి రోగికి విజయవంతంగా చికిత్స అందించబడింది.

అలెగ్జాండర్ ఫ్లెమింగ్ స్కాటిష్ జీవశాస్త్రవేత్త, వైద్య రసాయన శాస్త్రవేత్త (ఫార్మకాలజిస్ట్) కాగా, ఆయన కనిపెట్టిన "ఎంజైము లైసోజైము(1923 ), అంటి బయోటిక్ ' పెన్సిలిన్(1928 ) ' ముఖ్యమైనవి. 1945లో వైద్య శాస్త్రానికి నోబెల్ బహుమానం ఈ పెన్సిలిన్ కనుగొన్నందుకు ఫ్లెమింగ్ తో పాటు హొవార్డ్ ఫ్లోరె, ఎర్నెస్ట్ చెయిన్ అనే మరో ఇద్దరు శాస్త్ర వేత్తలకు కూడా ఇచ్చారు.

**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...**

# భారత క్రికెట్ స్వర్ణ యుగం

## టీ–20 ప్రపంచకప్ విజయం



సమకాలీన క్రికెట్ ప్రపంచం వేగం, వ్యూహం, సాంకేతికతల సమన్వయంతో కొత్త దశలోకి అడుగు పెట్టింది. ముఖ్యంగా ట్వంటీ–20 ఫార్మాట్ క్రికెట్‌ను అత్యంత ఉత్కంఠ భరిత క్రీడగా మలిచింది. కేవలం మూడు గంటల వ్యవధిలోనే ఫలితం తేలే ఈ ఫార్మాట్ ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది అభిమానులను ఆకర్షిస్తోంది. అంతర్జాతీయ క్రికెట్ వ్యవస్థను నిర్వహిస్తున్న అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహించే పురుషుల టీ–20 ప్రపంచకప్ ఈ ఫార్మాట్‌కు అత్యున్నత వేదికగా నిలుస్తోంది. ప్రపంచంలోని అత్యుత్తమ జట్లు పాల్గొనే ఈ మహా టోర్నమెంట్‌లో భారత క్రికెట్ జట్టు అద్భుత ప్రదర్శనతో విజేతగా నిలవడం భారత క్రీడా చరిత్రలో గర్వకారణంగా నిలిచింది. గత కాలపు చారిత్రాత్మక విజయానికి నాయకత్వం వహించిన కెప్టెన్ రోహిత్ శర్మ తన సమర్థ వ్యూహాలతో ఆధునిక క్రికెట్‌లో ఒక విశిష్ట నాయకుడిగా గుర్తింపు పొందాడు. జట్టును సమన్వయంతో ముందుకు నడిపించడంలో, ఆటగాళ్ల ప్రతిభను సరైన సమయంలో వినియోగించడంలో ఆయన చూపిన దూరదృష్టి ఈ విజయానికి ప్రధాన కారణంగా నిలిచింది. టోర్నమెంట్ మొత్తం భారత జట్టు అజేయంగా సాగి టైటిల్ సాధించడం అరుదైన ఘనతగా నిలిచింది.

భారత క్రికెట్‌కు గొప్ప వారసత్వం ఉంది. టెస్ట్ క్రికెట్ నుంచి వన్డేలు, టీ–20ల వరకు భారత జట్టు ఎన్నో చారిత్రక విజయాలను సాధించింది. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది అభిమానులను కలిగిన జట్లలో భారత జాతీయ క్రికెట్ జట్టు అగ్రస్థానంలో నిలుస్తోంది. 2007లో జరిగిన తొలి టీ–20 ప్రపంచ కప్ విజయం భారత క్రికెట్‌లో ఒక కొత్త యుగాన్ని ప్రారంభించింది. ఆ విజయంతో యువ ఆటగాళ్లకు కొత్త అవకాశాలు లభించాయి. దేశవ్యాప్తంగా ప్రతిభావంతులైన క్రికెటర్లు వెలుగులోకి వచ్చి భారత జట్టును మరింత బలంగా తీర్చిదిద్దారు.

కాలక్రమేణా జట్టు నిర్మాణంలో కీలక మార్పులు చోటు చేసుకున్నాయి. ఒకప్పుడు సీనియర్ ఆటగాళ్లపై ఆధారపడి ఉన్న జట్టు, ఇప్పుడు అనుభవం మరియు యువశక్తి కలయికతో సమతుల్యంగా మారింది. విరాట్ కోహ్లీ వంటి స్థిరమైన బ్యాట్స్‌మన్, హార్దిక్ పాండ్యా వంటి దూకుడు ఆల్ రౌండర్, అలాగే ప్రపంచ స్థాయి వేగబౌలర్ జస్ప్రీత్ బుమ్రా వంటి ఆటగాళ్లు జట్టుకు కీలక బలంగా నిలిచారు. వీరి సమిష్టి ప్రదర్శన భారత జట్టును ప్రపంచ స్థాయిలో అత్యంత పటిష్ట జట్టుగా నిలిపింది.

ప్రస్తుత 2026 టోర్నమెంట్‌లో భారత జట్టు ప్రదర్శన గణాంక పరంగా కూడా విశేషంగా నిలిచింది. లీగ్ దశ నుంచి ఫైనల్ వరకు ఒక్క మ్యాచ్ మినహా అజేయంగా ముందుకు సాగడం భారత జట్టు సామర్థ్యానికి నిదర్శనం. ప్రతి మ్యాచ్‌లోనూ జట్టు సమన్వయంతో కూడిన ప్రదర్శన కనబరిచింది. బ్యాటింగ్ విభాగంలో ప్రారంభ ఓవర్ల నుంచే దూకుడు ప్రదర్శించడం ద్వారా ప్రత్యర్థి జట్లపై ఒత్తిడి సృష్టించారు. పవర్ ప్లేలో వేగంగా పరుగులు సాధించడం ద్వారా బలమైన పునాది వేసి, మధ్య ఓవర్లలో నిలకడగా ఆడి, చివరి ఓవర్లలో స్కోరును భారీగా పెంచడం భారత బ్యాటింగ్ వ్యూహంలో ప్రధాన లక్షణంగా నిలిచింది.

బౌలింగ్ విభాగం కూడా భారత విజయానికి కీలక పాత్ర పోషించింది. పవర్ ప్లేలోనే ప్రత్యర్థి జట్లను ఒత్తిడికి గురిచేయడం ద్వారా ప్రారంభంలోనే వికెట్లు సాధించారు. మధ్య ఓవర్లలో స్పిన్నర్లు పరుగులను నియంత్రించి బ్యాట్స్‌మన్‌లపై ఒత్తిడిని పెంచారు. చివరి ఓవర్లలో వేగబౌలర్లు కట్టుదిట్టమైన బౌలింగ్ చేయడం ద్వారా ప్రత్యర్థి జట్లకు భారీ స్కోర్లు సాధించే అవకాశాన్ని తగ్గించారు. ముఖ్యంగా జస్ప్రీత్ బుమ్రా చేసిన కట్టుదిట్టమైన బౌలింగ్ అనేక మ్యాచ్‌లలో భారత జట్టుకు విజయాన్ని అందించింది.

ఫీల్డింగ్ కూడా భారత జట్టు విజయానికి కీలక కారణంగా నిలిచింది. ఆధునిక క్రికెట్‌లో ఫీల్డింగ్ స్థాయి ఎంత ముఖ్యమో భారత ఆటగాళ్లు తమ ప్రదర్శనల ద్వారా నిరూపించారు. బౌండరీల వద్ద అద్భుతమైన క్యాచ్‌లు, మెరుపు వేగంతో చేసే రన్ అవుట్లు, మైదానంలో చురుకైన కదలికలు ప్రత్యర్థి జట్లపై తీవ్ర ఒత్తిడిని సృష్టించాయి. కొన్ని సందర్భాల్లో ఫీల్డింగ్ ద్వారానే మ్యాచ్ గమనాన్ని మార్చిన ఘట్టాలు కనిపించాయి.

ప్రస్తుత విజయ ప్రయాణంలో మరో ముఖ్య పాత్ర పోషించిన ఆటగాడు సూర్య కుమార్ యాదవ్. ఆధునిక క్రికెట్‌లో అత్యంత వినూత్నమైన బ్యాటింగ్ శైలి కలిగిన ఆటగాడిగా ఆయన ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందాడు. మైదానం మొత్తం మీద అసాధారణ కోణాల్లో షాట్లు ఆడగల సామర్థ్యం ఆయన ప్రత్యేకత. క్రికెట్ విశ్లేషకులు ఆయనను "360 డిగ్రీ బ్యాట్స్‌మన్"గా అభివర్ణిస్తారు. ఒత్తిడి పరిస్థితుల్లో కూడా ధైర్యంగా ఆడే స్వభావం జట్టుకు కీలక బలంగా నిలిచింది.

ఈ విజయానికి వెనుక ఉన్న మరో ప్రధాన కారణం భారత క్రికెట్ వ్యవస్థ యొక్క బలం. దేశంలో ఉన్న విస్తృతమైన దేశీయ క్రికెట్ వ్యవస్థ యువ ప్రతిభను వెలికి తీస్తోంది. ఈ వ్యవస్థను సమర్థంగా నిర్వహిస్తున్న భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన క్రికెట్ సంస్థగా గుర్తింపు పొందింది. దేశీయ టోర్నీలు, శిక్షణా అకాడమీలు, ఆధునిక సౌకర్యాలు యువ ఆటగాళ్లను అంతర్జాతీయ స్థాయికి తీర్చిదిద్దు తున్నాయి.

భారత క్రికెట్ విజయాలు కేవలం క్రీడా విజయాలు మాత్రమే కాదు; అవి జాతీయ గర్వానికి ప్రతీకలు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కోట్లాది భారతీయ అభిమానులు ఈ విజయాన్ని ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. చిన్న పట్టణాల నుంచి మహానగరాల వరకు ప్రతి చోటా అభిమానులు సంబరాలు నిర్వహించారు. క్రికెట్ భారతదేశంలో ఒక క్రీడ మాత్రమే కాదు; అది ఒక భావోద్వేగం, ఒక సామూహిక అనుభూతి. భవిష్యత్తు దృష్ట్యా ఈ విజయం భారత జట్టుకు మరింత ప్రేరణగా నిలుస్తుంది. యువ ఆటగాళ్లకు ఇది ఒక ప్రేరణాత్మక ఉదాహరణగా మారింది. క్రమశిక్షణ, కృషి, సమన్వయం ఉంటే ప్రపంచ స్థాయిలో విజయాలను సాధించడం సాధ్యమని ఈ విజయం నిరూపించింది. సూర్య కుమార్ యాదవ్ నాయకత్వం భారత జట్టుకు స్థిరత్వం, ఆత్మవిశ్వాసాన్ని అందించింది. ఆయన నిర్మించిన బలమైన జట్టు నిర్మాణం భవిష్యత్తులో కూడా భారత క్రికెట్‌కు మార్గదర్శకంగా నిలుస్తుంది.

మొత్తంగా చూస్తే ఈ టీ–20 ప్రపంచకప్ విజయం భారత క్రికెట్ చరిత్రలో ఒక మైలురాయి. అజేయ ప్రస్థానం, సమన్వయంతో కూడిన జట్టు ప్రదర్శన, వ్యూహాత్మక నాయకత్వం ఇవన్నీ కలిసి ఈ విజయాన్ని సాధ్యం చేశాయి. భారత క్రికెట్ యొక్క స్వర్ణయుగం కొనసాగుతుందనే నమ్మకాన్ని ఈ విజయం మరింత బలపరిచింది. సూర్య కుమార్ యాదవ్ నాయకత్వంలో సాధించిన ఈ విజయగాథ భారత క్రికెట్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచి పోతుంది. సూర్య కుమార్ యాదవ్ వంటి యువ నాయకుల చేతుల్లో భారత క్రికెట్ భవిష్యత్తు మరింత ప్రకాశవంతంగా ఉండబోతోందనే ఆశాభావాన్ని అభిమానులలో నింపుతోంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# పెరుగుతున్న ఎండల తీవ్రత

### ముందస్తు చర్యలపై ప్రభుత్వం అప్రమత్తం

అమరావతి : రాష్ట్రంలో ఎండల తీవ్రత క్రమంగా పెరుగుతోంది. దీంతో ప్రభుత్వం అప్రమత్తం అయ్యింది. ముందస్తు చర్యలపై సమీక్షించింది. ఎండల తీవ్రత, వడగాల్పుల పరిస్థితులపై హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత మంగళవారం సమావేశం నిర్వహించారు. ఏపీఎస్‌డీఎంఏ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో కలెక్టర్లు, లైన్ డిపార్ట్‌మెంట్ల అధికారులు, విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'హీట్ వేవ్ యాక్షన్ ప్లాన్ న్`2026'ను హోంమంత్రి ఆవిష్కరించారు. అధికారులందరూ అనుసరించి ముందుకు సాగాలని ఆదేశించారు. సెంట్రల్ ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని ఏపీఎస్‌డీఎంఏ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. రాబోయే రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగి వడగాల్పులు ఎక్కువగా వీచే అవకాశం ఉందని మంత్రి అనిత హెచ్చరించారు. అధికారులు నిరంతరం అప్రమత్తంగా పనిచేయాలని.. వడదెబ్బ కారణంగా ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా చూడాలని హోంమంత్రి ఆదేశాలు జారీ చేశారు. పశువుల రక్షణకు సంబంధించి సూచనలు జారీ చేయాలని సూచించారు. వడదెబ్బ బారిన పడిన వారి చికిత్స కోసం బెడ్లు, మందులు, అంబులెన్సులు సిద్ధం చేయాలని వైద్యశాఖను ఆదేశించారు. విద్యుత్ అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. బహిరంగ ప్రాంతాల్లో పనిచేసే కార్మికులపై ప్రత్యేక దృష్టి సారించాలని హోంమంత్రి తెలిపారు. నిరంతరాయంగా తాగునీటి సరఫరా ఉండేలా చర్యలు చేపట్టాలని అధికారులను హోంమంత్రి ఆదేశించారు. తాత్కాలిక చలువ కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు.



''నడక చాలు, మీకు జిమ్ అవసరం లేదు'' అని ఎవరైనా చెప్పడం మనలో చాలా మంది విని ఉండొచ్చు. సాధారణంగా జిమ్‌కు వెళ్లలేకపోతున్న వారికి ఇది ఓదార్పుగా అనిపించవచ్చు. జిమ్‌కు డుమ్మా కొట్టడం దానికి బదులుగా నడకను ఎంచుకోవడం అంటే అది అంత సులువైన విషయం కాదు అలాగని అసాధ్యం కూడా కాదు. జిమ్ మానడం వల్ల కలిగే నష్టాలను నడకతో భర్తీ చేయడం సాధ్యమే అంటున్నారు వ్యాయామ నిపుణులు. వారు చెబుతున్న ప్రకారం...అలా చేస్తే లాభం లేదు...

# నడకతో ఎన్నో లాభాలు!

కారు దిగి ఆఫీసు వరకు నడవడం, షాపింగ్ మాల్‌లో తిరగడం, ఫోన్‌లో మాట్లాడుతూనో, చాట్ చేస్తూనో నడవడం, పార్కులో రిలాక్స్‌డ్‌గా నెమ్మదిగా వాక్ చేయడం... వంటి వాటివల్ల జిమ్ సెషన్‌ను భర్తీ చేయడం సాధ్యం కాదు. ఎందుకంటే అవి వ్యక్తి శరీరంపై నిర్మాణాత్మక ఒత్తిడిని కలిగించవు. కార్డియో పేరిట ట్రెడ్‌మిల్, క్రాస్ ట్రైనర్, సైక్లింగ్...వగైరాలు జిమ్‌లో అందుబాటులో ఉంటాయి.
అటువంటి వ్యాయామాలతో కూడిన జిమ్ సెషన్ వదిలేస్తూ, ఆ నష్టం భర్తీ కావాలంటే ఏదో ఒక పని మీద కాకుండా నడవడం అనే పని మీద బయటకు వెళ్లాలి. అప్పుడే మన చేతులు సరిగ్గా కదులుతాయి. చూపు ముందుకు ఉంటుంది. ఒక్కో అడుగు సాధారణం కంటే ఎక్కువ దూరం పడుతుంటుంది.

**ఇలా నడిస్తే...భళా...**

స్మార్ట్‌వాచ్ లేదా ఫోన్ ఉంటే, ఒక సాధారణ లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి. స్థిరమైన రీతిలో గంటకు 5 కి.మీ వేగంతో 30 నిమిషాల పాటు నిర్విరామంగా నడవాలి. అంటే దాని ద్వారా మనం 2.50 కి.మీ నడుస్తామన్న మాట. ఆ వేగంతో, చాలా మంది సాధారణ నడక నుంచి బయటపడి తేలికపాటి కార్డియో శైలిలోకి వెళతారు. శ్వాస కొంచెం లోతుగా మారుతుంది. కండరాలు సాధారణ ప్రయాణ వేగం కంటే ఎక్కువ శక్తిని ఖర్చు చేయడానికి తగ్గట్టుగా వేడెక్కుతాయి. అలా 30 నిమిషాలు నాన్–స్టాప్ గా నడిస్తే గుండె, ఊపిరితిత్తులు రక్త నాళాలు గట్టి ప్రభావాన్ని ఎదుర్కొంటాయి.
దీనికి రోజువారీ తప్పక చేయాల్సిన అవసరం కూడా లేదు. వారంలో నాలుగు రోజులు సరిపోతుంది. ''దానిని ఒకేలా పరిగణించినప్పుడు మాత్రమే. నడక ఒక వ్యాయామం అవుతుంది. తొలుత 5 నిమిషాల పాటు సున్నితమైన వేగంతో ప్రారంభించి ఆపై తగిన వేగంలో స్థిరంగా నడవడం అలవాటు చేసుకోవాలి. అంతే కాకుండా చేతులను వెనక్కి కట్టేయడం లాంటివి చేయకూడదు.
చేతులను దాదాపు 90 డిగ్రీల వద్ద వంచి సహజంగా ఊగుతూ ఉండేలాచూడాలి. చదునైన నేలపై 30 నిమిషాల్లో 2.3–2.7 కి.మీ. లక్ష్యంగా పెట్టుకోవాలి. వేగాన్ని తగ్గించకుండా ఉండటానికి అవసరమయితే సంగీతం లేదా పాడ్‌కాస్ట్‌లను ఉపయోగించవచ్చు. వాక్ ముగిసే సమయంలో హృదయ స్పందన రేటు తగ్గడానికి 2–3 నిమిషాల పాటు నెమ్మదించిన నడకతో ముగించాలి.

## బాల్య వివాహం అంటే
# పసిబిడ్డపై అత్యాచారమే

### ముగిసిన 100 రోజుల బాల్య వివాహ ముక్తి రథం అవగాహన యాత్ర

### ఆర్డీఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షురాలు చిన్నమ్మ తామస్

**వనపర్తి ప్రతినిధి, మార్చి 10 (నినాదం)**
బాల్య వివాహం అనేది కేవలం సామాజిక దురాచారం మాత్రమే కాదని, అది చట్టం దృష్టిలో పసిబిడ్డపై జరిగే అత్యాచారమని రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్షురాలు చిన్నమ్మ తామస్ అన్నారు. భారత ప్రభుత్వ మహిళా,శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ పిలుపుమేరకు దేశవ్యాప్తంగా చేపట్టిన వందరోజుల సాంద్రత కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహ ముక్త భారత్, బాల వివాహ ముక్తిరథంతో వనపర్తి, జోగులాంబ గద్వాల, మహబూబ్ నగర్ జిల్లాల్లో అవగాహన యాత్ర ముగిసింది. ఈ సందర్భంగా రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్షురాలు చిన్నమ్మ తామస్ మాట్లాడుతూ వనపర్తి, జోగులాంబ గద్వాల, మహబూబ్ నగర్ జిల్లాలోని మారుమూల గ్రామాలు, పట్టణాల్లో 'బాల వివాహ ముక్తి రథం'పర్యటించిందని, మూడు దశల్లో నిర్వహించిన ప్రచారంలో మత పెద్దలు, విద్యార్థులు, పంచాయతీలు, వివాహ సేవా నిర్వాహకులతో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా వేల సంఖ్యలో ప్రజల చేత ప్రమాణం చేయించడం జరిగిందని, బాల్య వివాహం అంటే పసిబిడ్డపై అత్యాచారమేనని, ఇది శిక్షార్హమైన నేరమని ప్రజలకు వివరించినట్లు ఆమె పేర్కొన్నారు. దేశంలోనే అతిపెద్ద స్వచ్ఛంద సంస్థల నెట్‌వర్క్ 'జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్' భాగస్వామ్యంతో రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఈ





కార్యక్రమాన్ని నిర్వహించిందని పేర్కొన్నారు. మా నిస్వార్థ ప్రయత్నాలకు ప్రజల నుండి లభించిన స్పందన చూస్తుంటే వనపర్తి, జోగులాంబ గద్వాల, మహబూబ్ నగర్ జిల్లాలో బాల్య వివాహ రహిత భారతదేశం అనే లక్ష్యానికి మనం చాలా దగ్గరగా ఉన్నామని నమ్మకం కలుగుతోందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. బాల వివాహ ముక్తి రథం రథయాత్రను వనపర్తి జిల్లాలో నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు మల్లు రవి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ సునీతా రెడ్డి, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిని సుధారాణి లు ప్రారంభించారని తెలిపారు. జోగులాంబ గద్వాల జిల్లాలో ఎంపీ మల్లు రవి, జిల్లా కలెక్టర్ బి.సంతోష్, అదనపు ఎస్పీ శంకర్, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిని సునంద, సిడబ్ల్యుసి చైర్మన్, డీఈవో, ఏ ఎల్ ఓ, డిసిపిఓ లు ప్రారంభించారని వివరించారు. మహబూబ్ నగర్ జిల్లాలో మహబూబ్ నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ, జెడ్పి సీఈవో వెంకట్ రెడ్డి లు ప్రారంభించారని చెప్పారు. గత 30 రోజుల్లో ఈ రథంసుమారు 7200 కిలోమీటర్లు ప్రయాణించిందని, 730 గ్రామాలను చేరుకుందని, దాదాపు ఎనిమిది లక్షల 80 వేల మంది ప్రజలను ఈ ఉద్యమంలో భాగస్వాములను చేసిందని ఆమె గుర్తు చేశారు. ప్రధాన రహదారులకే పరిమితం కాకుండా మోటార్ సైకిళ్లు, సైకిల్ యాత్రల ద్వారా మారుమూల తండాలకు, గ్రామాలకు కూడా సందేశాన్ని చేరవేసిందని అన్నారు. ఈ ప్రచారాన్ని అత్యంత శాస్త్రీయంగా మూడు దశల్లో నిర్వహించామని చెప్పారు. మొదటి దశలో విద్యాసంస్థల్లో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పించడం, రెండవ దశలో మత పెద్దలు, వివాహ శుభకార్యాలతో సంబంధం ఉన్న కేటరర్లు, డెకరేటర్లు, బ్యాండ్ మేళం, కళ్యాణ మండప యజమానులను కలిసి వధూవరుల వయస్సు ధృవీకరించుకున్న తర్వాతే సేవలు అందించాలని కోరడం జరిగిందన్నారు. మూడవ దశలో గ్రామ పంచాయతీల్లో ప్రజాప్రతినిధుల సమక్షంలో గ్రామస్థులను చైతన్యపరచడం, బాల్య వివాహం అనేది కేవలం సామాజిక దురాచారం మాత్రమే కాదని, అది చట్టం దృష్టిలో పసిబిడ్డపై జరిగే అత్యాచారమని, ఇది ఒక బాలిక ఎదుగుదలను చిదిమేసి ఆమెను అనారోగ్యం, నిరక్షరాస్యత, పేదరికంలోకి నెట్టివేస్తుందిని వివరించినట్లు చిన్నమ్మ తామస్ పేర్కొన్నారు. మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ డిసెంబర్ 4, 2025న ప్రారంభించిన ఈ 100 రోజుల ప్రచారం ఇప్పుడు ప్రజా ఉద్యమంగా మారిందని, ప్రభుత్వ యంత్రాంగం, ఎన్నికైన ప్రజా ప్రతినిధులు, సామాన్య ప్రజల మద్దతుతో 'బాల్య వివాహ రహిత జిల్లా' లక్ష్యాన్ని త్వరలోనే సాధిస్తామని చిన్నమ్మ తామస్ ధీమా వ్యక్తం చేశారు









## ఆటో రిపేర్ రంగంలో
# డిజిటల్ విప్లవం

భారతదేశంలో అతిపెద్ద డిజిటల్ ఎనేబుల్డ్ రిపేర్ షాప్ నెట్‌వర్క్ ఆటోరాక్స్.. ఆఫ్టర్‌మార్కెట్ ఎకోసిస్టమ్‌ను నిర్మించడానికి బూడ్మోతో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ప్రకటించింది. ఈ భాగస్వామ్యం ద్వారా రిపేర్ షాపులు, స్పేర్ పార్ట్స్ క్యాటలాగ్‌లు, అమ్మకందారులు & ఆన్‌లైన్ మార్కెట్‌ప్లేస్‌లు అన్నీ ఒకే డిజిటల్ వ్యవస్థలో రియల్ టైమ్‌లో అనుసంధానిస్తుంది. ఆటోరాక్స్ ప్రస్తుతం భారతదేశంలో 2000కిపైగా వర్క్‌షాప్‌లతో దేశంలో అతిపెద్ద డిజిటల్ గ్యారేజ్ నెట్‌వర్క్‌గా ఉంది. ఇది ఇప్పటికే 40 దేశాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. కాగా మరింత విస్తరణకు సిద్ధమవుతోంది. ఈ సంస్థ స్వతంత్ర గ్యారేజీలకు డీలర్‌షిప్ స్థాయి డిజిటల్ టూల్స్ అందించి వాటి పనితీరును మెరుగుపరచడంలో సహాయపడుతోంది. ఇప్పటి వరకు ఆటోమొబైల్ రిపేర్ రంగంలో చాలా టెక్నాలజీ మార్పులు వచ్చినప్పటికీ సరైన స్పేర్ పార్ట్‌ను కనుగొనడం అనే దశలో మాత్రం చాలా సమస్యలు ఉండేవి. టెక్నీషియన్లు పని మధ్యలో ఆపి వేరే సిస్టమ్‌లలో పార్ట్స్ వివరాలు చూసుకోవాల్సి వచ్చేది. దీని వల్ల సమయం వృథా కావడం, తప్పులు జరిగే అవకాశం పెరగడం వంటి సమస్యలు ఉండేవి. ఈ సమస్యను పరిష్కరించడానికి ఆటోరాక్స్ మరియు బూడ్మో కలిసి పనిచేస్తున్నాయి. దీంతో రిపేర్ ఆర్డర్ ఒక సాధారణ డాక్యుమెంట్‌గా కాకుండా.. డయాగ్నోసిస్, పార్ట్స్ కనుగొనడం, కొనుగోలు ప్రక్రియలను కలిపే ఒక తెలివైన డిజిటల్ హబ్‌గా మారుతుంది.



# రెండు రోజుల నష్టాలకు బ్రేక్

### ట్రంప్ వ్యాఖ్యలతో మార్కెట్లకు జోష్.. లాభాల్లో ముగిసిన మార్కెట్లు

### ఇరాన్ యుద్ధం త్వరలో ముగియవచ్చన్న ట్రంప్ వ్యాఖ్యలతో సానుకూల సంకేతాలు

### 640 పాయింట్లు లాభపడిన సెన్సెక్స్, 233 పాయింట్లు పెరిగిన నిఫ్టీ

రెండు రోజుల వరుస నష్టాలకు తెరదించుతూ మంగళవారం దేశీయ స్టాక్ మార్కెట్లు భారీ లాభాల్లో ముగిశాయి. ఇరాన్‌తో యుద్ధం త్వరలోనే ముగియవచ్చంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను బలపరిచాయి. దీంతో అంతర్జాతీయంగా ఆందోళనలు తగ్గడంతో కొనుగోళ్లకు మద్దతు లభించింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి, సెన్సెక్స్ 639.82 పాయింట్లు పెరిగి 78,205.98 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 233.5 పాయింట్లు లాభపడి 24,261.6 వద్ద ముగిసింది. ఇరాన్‌తో వివాదం కారణంగా గత కొన్ని రోజులుగా అంతర్జాతీయ మార్కెట్లు తీవ్ర ఒడుదొడుకులకు లోనయ్యాయి. అయితే, ఈ వివాదం త్వరలోనే పరిష్కారమవుతుందని ట్రంప్ సూచించడంతో గ్లోబల్ మార్కెట్లలో సానుకూల వాతావరణం నెలకొంది. ఈ పరిణామంతో అంతర్జాతీయ ముడిచమురు ధరలు కూడా దిగిరావడంతో మార్కెట్లకు కలిసొచ్చింది.
ట్రేడింగ్‌లో బెంచ్‌మార్క్ సూచీల కంటే బ్రాడర్ మార్కెట్లు మెరుగైన పనితీరు కనబరిచాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచీ 1.62 శాతం, స్మాల్‌క్యాప్ 100 సూచీ 2.12 శాతం మేర లాభపడ్డాయి.




రంగాల వారీగా చూస్తే, నిఫ్టీ ఆటో సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. కన్స్యూమర్ డ్యూరబుల్స్, ఫైనాన్షియల్ సర్వీసెస్ షేర్లలోనూ కొనుగోళ్లు కనిపించాయి. అయితే, నిఫ్టీ ఐటీ సూచీ అమ్మకాల ఒత్తిడికి గురైంది. ఆయిల్ అండ్ గ్యాస్ రంగం కూడా బలహీనంగానే కదలాడింది. టెక్నికల్‌గా నిఫ్టీకి 24,300 వద్ద తక్షణ నిరోధం ఉందని, దానిని దాటితే 24,600 స్థాయికి చేరవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. అదే సమయంలో, 24,000 స్థాయి కీలక మద్దతుగా పనిచేస్తుందని విశ్లేషకులు తెలిపారు. మధ్యప్రాచ్యంలోని పరిణామాలు, అంతర్జాతీయ ఆర్థిక సంకేతాలను బట్టి మార్కెట్ల భవిష్యత్ గమనం ఆధారపడి ఉంటుంది.




# ఇన్వెస్టర్లూ.. ఆందోళన వద్దు!

### సెబీ చైర్మన్ తుహిన్ కాంతా పాండే



రాజకీయ, భౌగోళిక సవాళ్లు ఎదురైనప్పుడు ఆందోళనకు లోనుకావద్దని క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ చైర్మన్ తుహిన్ కాంతా పాండే ఇన్వెస్టర్లకు సూచించారు. ప్రస్తుత పశ్చిమాసియా యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో భయాలకు లోనుకాకుండా వ్యవహరించవలసిందిగా సలహా ఇచ్చారు. దేశీయంగా ఆర్థిక మూలాలు పటిష్టంగా ఉన్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుత సవాళ్లు సద్దుమణిగే వరకూ వేచిచూడమని సూచించారు. దీర్ఘకాలంలో ఎన్ఎస్ఈ ఇండెక్స్ నిఫ్టీ పటిష్టత కొనసాగుతుందని, తద్వారా భారత్ వృద్ధి అవకాశాలను ప్రతిబింబిస్తుందని తెలియజేశారు. ఎన్ఎస్ఈ ప్రధాన ఇండెక్స్ నిఫ్టీ–50.. 30 వసంతాల వేడుక సందర్భంగా పాండే ఇన్వెస్టర్లకు పలు సూచనలు ఇచ్చారు.పశ్చిమాసియాలో యుద్ధం నేపథ్యంలో దేశీయంగా స్టాక్ మార్కెట్లు అత్యధికస్థాయిలో హెచ్చుతగ్గులను చవిచూస్తున్నట్లు పేర్కొన్నారు. కీలక నౌకా మార్గాలలో ఎదురవుతున్న అవాంతరాల కారణంగా చమురు, గ్యాస్ సరఫరాలకు విఘాతం ఏర్పడుతున్నట్లు తెలియజేశారు. దీంతో ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ సరఫరాలమధ్య సమతౌల్యం దెబ్బతింటున్నట్లు వివరించారు.

# ఎఫ్‌డీఐల నిబంధనలు సరళతరం

### చైనా ఎఫ్‌డీఐలకు కేంద్ర క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్!

భారత్‌తో సరిహద్దును పంచుకునే దేశాల నుంచి వచ్చే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల విషయంలో కేంద్రం కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. చైనా సహా మిగిలిన అన్ని దేశాల ఎఫ్‌డీఐల విషయంలో ఉన్ననిబంధనలను సరళతరం చేసేందుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని సంబంధిత వర్గాలను ఉటంకిస్తూ పీటీఐ వార్తా సంస్థ పేర్కొంది. ఈ మేరకు ప్రధాని మోదీ నేతృత్వంలో మంగళవారం జరిగిన కేంద్ర క్యాబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు తెలిపాయి.

**ఎఫ్‌డీఐల నిబంధనలు కఠినతరం ఎందుకు?**

గల్వాన్ లోయలో 2020లో భారత్– చైనా సైనికుల మధ్య చోటుచేసుకున్న ఘర్షణ కారణంగా ఆ దేశంతో సంబంధాలు క్షీణించాయి. దీంతో టిక్‌టాక్, వియ్‌చాట్ వంటి 200 యాప్‌లను భారత్ నిషేధించింది. ఎలక్ట్రిక్ వాహన తయారీ సంస్థ బీవైడీ నుంచి వచ్చిన పెట్టుబడి ప్రతిపాదనలనూ భారత్ తిరస్కరించింది. ఆ దేశం నుంచి వచ్చే ఎఫ్‌డీఐల నిబంధనలనూ కఠినతరం చేసింది.



ప్రభుత్వం నుంచి తప్పనిసరిగా ముందస్తు అనుమతి తీసుకోవాలని 2020లో ప్రెస్ నోట్ 3ని ప్రభుత్వం జారీ చేసింది. భారత్‌తో సరిహద్దులను పంచుకునే దేశాలన్నింటికీ ఈ ప్రెస్ నోట్ 3 వర్తిస్తుందని తెలిపింది. చైనా, బంగ్లాదేశ్, పాకిస్థాన్, భూటాన్, నేపాల్, మయన్మార్, అఫ్గానిస్థాన్ లాంటి దేశాలు ఇందులో ఉన్నాయి.

**రెండేళ్ల క్రితమే ప్రస్తావన**

ఎన్డీయే మూడోసారి అధికారంలోకి వచ్చిన కొద్దిరోజులకే చైనా ఎఫ్‌డీఐల అంశం ప్రస్తావనకు వచ్చింది. 2024లో అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వేలో చైనా పెట్టుబడుల గురించి ప్రస్తావన ఉంది. చైనా ఎఫ్‌డీఐలతో దేశీయంగా తయారీని పెంచవచ్చని, తద్వారా ఇక్కడి నుంచి విదేశాలకు వస్తువులను ఎగుమతి చేయొచ్చని పేర్కొంది. అమెరికా, యూరప్‌లు చైనాకు ప్రత్యామ్నాయాన్ని చూస్తున్న వేళ.. ఆ ప్రయోజనాన్ని పొందొచ్చని పేర్కొంది. చైనా పెట్టుబడులను ఆహ్వానించి ఆ ఉత్పత్తులను ఎగుమతి చేయడం మెరుగైన ఆలోచనగా సర్వే అభిప్రాయపడింది. కాబట్టి చైనా ఎఫ్‌డీఐలను ప్రోత్సహించాలని పేర్కొంది. నిబంధనలు కఠినం కావడంతో చైనా నుంచి వచ్చే ఎఫ్‌డీఐలు తగ్గాయి. 2000 ఏప్రిల్ నుంచి 2025 డిసెంబర్ మధ్య చైనా నుంచి కేవలం 2.51 బిలియన్ డాలర్ల పెట్టుబడులు మాత్రమే వచ్చాయి. దేశంలోకి వచ్చే మొత్తం ఎఫ్‌డీఐల్లో చైనా 23వ స్థానంలో ఉంది.

## మినిమం బ్యాలెన్స్ చార్జీల రూపంలో
# రూ. 11 వేల కోట్లు వసూలు

కనీస నిల్వల నిబంధన పేరుతో ఖాతాదారుల నుంచి గడిచిన మూడేళ్లలో (2022–23 నుంచి 2024–25) ప్రైవేటు రంగ బ్యాంకులు రూ.11 వేల కోట్లు వసూలు చేసినట్లు కేంద్రం పార్లమెంట్‌కు వెల్లడించింది. ఇదే కాలంలో ప్రభుత్వరంగ బ్యాంకులు రూ.8వేల కోట్లు వసూలు చేసినట్లు తెలిపింది. ఈ మేరకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌కు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ప్రైవేటురంగ బ్యాంకుల్లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ అత్యధికంగా రూ.3800 కోట్లు ఛార్జీల రూపంలో ఖాతాదారుల నుంచి వసూలు చేసిందని మంత్రి తెలిపారు. యాక్సిస్ బ్యాంక్ రూ.2,700 కోట్లు, ఐసీఐసీఐ బ్యాంక్ రూ.1200 కోట్లు చొప్పున వసూలు చేశాయన్నారు.
ప్రభుత్వరంగ బ్యాంకుల్లో పంజాబ్ నేషనల్ బ్యాంక్ అత్యధికంగా రూ.1500 కోట్లు వసూలు చేయగా.. బ్యాంక్ ఆఫ్ బరోడా రూ.1200 కోట్లు, ఇండియన్ బ్యాంక్ రూ.1100 కోట్లు చొప్పున వసూలు చేసినట్లు ఆర్థిక మంత్రి తెలిపారు.




కనీస నిల్వలపై 2020 మార్చి నుంచి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఛార్జీలు వసూలు చేయడం లేదు. పంజాబ్ నేషనల్ బ్యాంక్, కెనరా బ్యాంక్ కూడా గతేడాది నుంచి ఈ ఛార్జీలను తొలగించాయి. కరెంట్ ఖాతాల విషయంలో కొన్ని మార్పులు చేశాయి. ప్రైవేటు రంగ బ్యాంకులు మాత్రం ఇప్పటికీ కనీస నిల్వలు లేకపోతే ఛార్జీలు వసూలు చేస్తున్నాయి.

## షిర్డీ సాయినాధుని దర్శించుకున్న స్పీకర్ కుటుంబ సభ్యులు



**వికారాబాద్, మార్చి 10(నినాదం ):** మహారాష్ట్రలోని షిరిడిలో కొలువు దీరిన సాయిబాబాను మంగళవారం తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ కుటుంబసభ్యులు దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. ఆయన కూతురు, వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం అనన్య, సన్నిహిత బంధువులు, మిత్రులతో కలిసి నిన్న రాత్రి దూప హారతి పూజలో పాల్గొన్నారు. విఐపి బ్రేక్ దర్శనంలో సాయినాధుని మహా సమాధిని దర్శించుకున్నారు. తెలంగాణ రాష్ట్ర సభాపతిని సంప్రదాయబద్ధంగా, ఆలయ మర్యాదలతో స్వాగతం పలికిన శ్రీ సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ సభ్యులు, అధికారులు. దర్శనం అనంతరం ట్రస్ట్ కార్యాలయంలో స్పీకర్ ప్రసాద్ కుమార్ ను, మున్సిపల్ చైర్ పర్సన్ అనన్య ను షిర్డీ సాయిబాబా సంస్థాన్ సీ ఈ వో గోరక్ష గాడ్లికర్ ఐ ఏ ఎస్ తదితరులు శాలువాతో సన్మానించి, ప్రసాదాలు అందజేశారు.

## మహిళలు ఆర్థికంగా రాజకీయంగా ఎదగాలి

### బిజెపి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి





**అమీన్‌పూర్, మార్చి 10 (నినాదం):** మండలంలోని భారతీయ జనతా పార్టీ అధ్యక్షురాలు శ్రీమతి గోదావరి అంజి రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడు కలు రామచంద్రపురం పట్టణంలో తన నివాసంలో అంతర్జాతీయ మహి ళా దినోత్సవ వేడుకలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మహిళలకు ఆటలు పోటీలు నిర్వహించి బహుమతులు అందుకే చేయడం జరిగింది. అదేవిధంగా మహిళలు ఆర్థికంగా రాజకీయంగా సామాజికంగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమానికి సంగారెడ్డి జిల్లా భారతీయ జనతా పార్టీ మహిళా అధ్యక్షురాలు మాధురి ఆనంద్, కౌన్సిలర్స్ జిల్లా రాష్ట్ర పదాధికారులు బూత్ మరియు పట్టణ మండల నాయకురాలు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు పంపిణీ



**మల్కాజిగిరి, మార్చి 10 (నినాదం):** మౌలాలి డివిజన్‌లో ఉన్న జిల్లా పరిషత్ హైస్కూల్ (జెడ్ పి హెచ్ ఎస్) లో మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ బాబు సూచనల మేరకు, మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఆదేశాల మేరకు మైనంపల్లి సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ (ఎంఎస్ఎస్ఓ) ఆధ్వర్యంలో పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న పేద విద్యార్థులకు అవసరమైన పెన్‌లు, పెన్సిల్‌లు, పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బి బ్లాక్ అధ్యక్షులు వెంకటేష్ యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ బి కే శీను, మౌలాలి డివిజన్ అధ్యక్షులు పోతుల వినోద్ యాదవ్ లు పాల్గొని విద్యార్థులకు ఫ్యాడ్స్ ను పంపిణి చేశారు. ఈ కార్యక్రమం కాంగ్రెస్ నాయకులు జి.డి. సంపత్ గౌడ్ గారు, ప్రవీణ్, యూసుఫ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పిట్టల శ్రీనివాస్, కపిల్, మహిళా నాయకులు ఆశ, ఇంద్రమ్మ, నాయకులు చంకు శ్రీనివాస్, గడ్డం సత్తన్న, మంద భాస్కర్, శ్రీనివాస్, చందు, పార్థు, పాండురంగ చారి, సిద్ధిక్, యూత్ కాంగ్రెస్ వర్కింగ్ అధ్యక్షులు అజయ్, విక్కి, సాయి, తనీష్, పవన్, నీరజ్, హనీష్, రిషి తదితరులు పాల్గొన్నారు.

# ప్రగతి ప్రణాళికపై ప్రజాప్రతినిధుల శిక్షణను విజయవంతం చేయాలి

### ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు



**రంగారెడ్డి బ్యూరో, మార్చి 10 (నినాదం) :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రజాప్రతినిధుల శిక్షణను విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అన్నారు. మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక లో భాగంగా ఈ నెల 12వ తేదీన ప్రజా ప్రతినిధులకు నిర్వహించనున్న శిక్షణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ మార్చి 6 నుంచి జూన్ 12వ తేదీ వరకు 99 రోజుల కార్యచరణ రూపొందించడం జరిగిందని, గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయి లలో కార్యచరణ అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా మార్చి 6వ తేదీన మొదలై మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలలో పారిశుధ్యం, ప్రభుత్వ కార్యాలయాలలో పెండింగ్ లో ఉన్న పైళ్ల క్లియరెన్స్ తదితర అంశాలపై కార్యాచరణ అమలు చేయడం జరుగుతుందని, ఆరోగ్యం, అరైవ్ అలైవ్, సంక్షేమం, పిల్లలు భద్రత, వ్యవసాయం, విద్య, యువత, మహిళలు, పర్యావరణం తదితర అంశాలపై ప్రణాళికలు అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 12వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి జిల్లాలోని గ్రామపంచాయతీల సర్పంచ్ లు, మున్సిపల్ కార్పొరేషన్/మున్సిపల్ కార్పొరేటర్లు/కౌన్సిలర్లకు జిల్లా కేంద్రాలలో శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, అందులో భాగంగా ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ అమలులో వారు నిర్వర్తించవలసిన విధుల పట్ల అవగాహన కల్పించాలని తెలిపారు. శిక్షణలో ప్రజాప్రతినిధులకు రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాల వివరాలు, అర్హులైన ప్రజలకు అదే విధంగా అమలు చేయడంలో ప్రజా ప్రతినిధులు తీసుకోవలసిన చర్యల గురించి తెలియజేయాలని తెలిపారు. 99 రోజుల ప్రణాళిక, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల అనంతరం తెలంగాణ పంచాయతీరాజ్ ఢ మున్సిపల్ యాక్ట్ ల గురించి ప్రజాప్రతినిధులకు సంక్షిప్తంగా వివరించాలని తెలిపారు. సులభంగా అర్థమయ్యే రీతిలో మాస్టర్ ట్రైనర్ల సహాయంతో ప్రజాప్రతినిధులకు శిక్షణ కార్యక్రమం విజయవంతం చేయాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి మాట్లాడుతూ ప్రజాప్రతినిధుల శిక్షణ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. అదే విధంగా జిల్లాలో 99 రోజుల ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శాఖల వారీగా ప్రణాళిక సిద్ధం చేయడం జరిగిందని, పారిశుద్ధ్య ప్రక్రియ ప్రారంభించడం జరిగిందని, జిల్లాలో త్రాగునీటికి సంబంధించి నెలకొన్న చిన్న చిన్న సమస్యలు కూడా పరిష్కరించడం జరుగుతుందని, ఇందిరమ్మ ఇండ్లు దశల వారీగా త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమానికి సంబంధించి ప్రజా ప్రతినిధులతో సమన్వయం చేస్తూ ఎలాంటి ఇబ్బందులు లేకుండా కార్యక్రమాన్ని పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) కె.శ్రీనివాస్, వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బాలికల విద్యకు ప్రభుత్వ సహకారం





### మేడ్చల్ మల్కాజిగిరి కలెక్టర్ మనుచౌదరి

**మేడ్చల్ కలెక్టరేట్, మార్చి 10 (నినాదం):** బాలికలవిద్యకు ప్రభుత్వం ఎనలేని సహకారం అందిస్తుందని మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి తెలిపారు. బాలికలు చదువులో ముందుండి అన్నిరంగాలలో రాణించాలని అందుకు అవసరమైన సహాయ సహకారం ప్రభుత్వం అందిస్తుందని ఆయన తెలిపారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు ఉచితంగా బాలికలకు 100 సైకిళ్లు అందించే కార్యక్రమంలో భాగంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ బాలికలకు సైకిళ్ల ను పంపిణి చేసారు. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలలో చదువుతూ వంద శాతం హాజరు ఉన్న బాలికలకు మంజూరు చేసి, మంగళవారం 21 మంది విద్యార్థినులకు సైకిళ్లను అందజేసారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, ఎస్బిఐరీజినల్ మేనేజర్, డిఈఓ విజయ కుమారి, విద్యార్థినులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# భూ సమస్యలు పరిష్కరించాలని వినతి



**అమీన్‌పూర్, మార్చి 10 (నినాదం):** అమీన్పూర్ మున్సిపల్ పరిధి లోని సర్వే నంబర్ 196 పరిధిలో ఉన్న శుభోదయ వెల్ఫేర్ సొసైటీకి చెందిన ప్లాట్ యజమానులు తమ సమస్యల పరిష్కారం కోసం ఈ రోజు రెవెన్యూ అధికారిని కలిసి వినతి పత్రం సమర్పించారు. సర్వే నంబర్ 196 భూమిని 1958 జూలై 25న జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం 1961 సంవత్సరంలో ఐదుగురు వెనుకబడిన వర్గాలకు ఎలాంటి నియమ నిబంధనలు లేకుండా పట్టాలు ఇచ్చినట్లు తెలిపారు. ఆ ఐదుగురు భూమి పన్నులు చెల్లిస్తూ తమ పేర్లపై మ్యూటేషన్ కూడా పొందినట్లు వివరించారు. తరువాత 1984లో అమీన్పూర్ గ్రామ పంచాయతీ అనుమతితో స్థల విభజన చేసి, రిజిస్ట్రేషన్ పత్రాల ద్వారా ప్లాట్లను విక్రయించినట్లు చెప్పారు. తమ వద్ద ఉన్న పత్రాలన్నీ అధికారిక రిజిస్ట్రేషన్ పత్రాలేనని పేర్కొన్నారు. అయితే 2007 సంవత్సరంలో ఈ భూమి ప్రభుత్వ భూమి అని పేర్కొంటూ ప్లాట్ల రిజిస్ట్రేషన్ నిలిపివేయబడిందని తెలిపారు. అప్పటి నుండి న్యాయం కోసం న్యాయస్థానాన్ని ఆశ్రయించినట్లు వివరించారు. ఈ విషయంలో పలు వ్యాజ్యాలు దాఖలైనాయని, న్యాయస్థానం శుభోదయ వెల్ఫేర్ సొసైటీకి అనుకూలంగా తాత్కాలిక ఆదేశాలు ఇచ్చి సర్వే నంబర్ 196 ప్రాంతంలో ఎవరూ జోక్యం చేసుకోకూడదని పేర్కొన్నట్లు తెలిపారు. అయినా కూడా ప్రభుత్వ అధికారులు అక్కడ మలిన జల శుద్ధి కేంద్రం నిర్మిస్తామని చెప్పి ప్లాట్ యజమానులను భయాందోళనలకు గురి చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై ప్రజా ప్రతినిధి రఘునందన్ రావు చొరవతో, అమీన్పూర్ ప్రాంత నాయకురాలు తనూజ రెడ్డి సహకారంతో ప్లాట్ యజమానులు ఈ రోజు రెవెన్యూ అధికారిని కలిసి తమ వద్ద ఉన్న అధికారిక పత్రాలతో వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రవీందర్ రెడ్డి, కె. నరసయ్య, అబ్దుల్ వారీస్, శ్రీనివాసులు రెడ్డి, వాసు నాయుడు, రాధాకృష్ణ, టి.వి. రావు తదితర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రులలో పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

### కలెక్టర్ దీపక్ తివారి



**వికారాబాద్, మార్చి 10(నినాదం):** ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. మంగళవారం ఆయన జిల్లా కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని వార్డులు, మందుల నిల్వలు రికార్డులను నిశితంగా పరిశీలించారు. గర్భిణీలతో మాట్లాడి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్న ఆయన ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాల సంఖ్య పెరిగేలా వైద్య సిబ్బంది కృషి చేయాలని సూచించారు. ఆసుపత్రిలో పరిశుభ్రత పాటిస్తూ, రోగులకు ఎల్లప్పుడూ మందులు అందుబాటులో ఉంచాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డి.ఎం.హెచ్.ఓ స్వర్ణకుమారి, వైద్యులు సౌమ్య, రజని తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ స్థలాలకు ఫెన్సింగ్ వేసిన వారిపై చర్యలు తీసుకుంటాం

### కాప్రా తహసీల్దార్ బైరెడ్డి రాజేష్





**జవహర్‌నగర్, మార్చి 10 (నినాదం):** ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపట్టరాదని కబ్జాదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని కాప్రా తహసిల్దార్ బైరెడ్డి రాజేష్ హెచ్చరించారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ లో ప్రభుత్వ భూముల్లో అక్రమంగా నిర్మించిన కట్టడాలను తాసిల్దార్ రాజేష్ ఆదేశాల మేరకు గిర్దవార్ సత్యనారాయణ సమక్షంలో మంగళవారం కూల్చివేతల చేపట్టారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ సర్కారు భూముల్లో ప్రైవేటు వ్యక్తులు ఫెన్సింగ్ వేయడం చట్ట విరుద్ధమని వారిపై చర్యలు తప్పవని అన్నారు. వేసిన ఫెన్సింగ్ ను కూల్చివేసి ప్రభుత్వ భూమిని కాపాడమని జవహర్ నగర్ లో ఎలాంటి అక్రమ నిర్మాణాలు చేయవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళల అభ్యున్నతికి సావిత్రిబాయి పూలే ఎనలేని కృషి

### బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మేకల రాము యాదవ్

### ఘనంగా సావిత్రిబాయి పూలే వర్ధంతి వేడుకలు



**మల్కాజిగిరి, మార్చి 10( నినాదం):** మహిళల అభ్యున్నతికి ఎనలేని కృషిచేసిన భారత తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే సేవలు మరువలేనివని బీ.ఆర్. ఎస్ సీనియర్ నాయకులు మేకల రాము యాదవ్ అన్నారు. సావిత్రిబాయి పూలే వర్ధంతి వేడుకలను పురస్కరించుకొని గౌతమ్ నగర్ చౌరస్తా లో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మేకల రాము యాదవ్ పాల్గొని సావిత్రిబాయి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడపిల్లల చదువు కోసం నిరంతరం పాటుపడిన చైతన్య మూర్తి మరియు సమాజంలో రుగ్మతలు రూపుమాపడానికి సామాజిక ఉద్యమకారిణి సావిత్రిబాయి పూలే అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సీనియర్ నాయకులు దీ=ా సిద్ధిరాములు, బైరు అనిల్, నాగేష్ గౌడ్, కావాలి శ్రీనివాస్, చిట్టి బాబు, శంకర్, హబీబ్, సూర్య ప్రకాష్, భాను, సుధాకర్, వాసుదేవరావు, ఎష్ట్ర వెంకట్, భరత్, అశోక్, తదితరులు ఉన్నారు.

# గోల్కొండ రిసార్ట్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల వర్క్‌షాప్

### పాల్గొన్న మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



**అల్వాల్, మార్చి 10 (నినాదం):** గండిపేటలోని గోల్కొండ రిసార్ట్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల వర్క్‌షాప్‌లో మల్కాజ్‌గిరి నియోజకవర్గ శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ వర్క్‌షాప్‌కు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు, మాజీ మంత్రి వర్యులు చామకూర మల్లారెడ్డి ,బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ లీడర్లు , సబితా ఇంద్రారెడ్డి తలసాని శ్రీనివాస్ యాదవ్, అసెంబ్లీ విప్ . వివేకానంద గౌడ్ హాజరయ్యారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, సభలో ప్రజా సమస్యలను సమర్థవంతంగా ఎలా లేవనెత్తాలి అనే అంశాలపై ప్రజాప్రతినిధులకు ఈ సందర్భంగా దిశానిర్దేశం చేశారు. అదేవిధంగా సభా నియమాలు (రూల్ బుక్), రాజ్యాంగ అంశాలు, సభా వ్యవహారాలపై సమగ్ర అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి వైస్ చైర్మన్ బండ ప్రకాష్, శాసన మండలి ప్రధాన ప్రతిపక్ష నాయకుడు మహమ్మద్ మహమ్మద్ అలీ, మధుసూదనాచారి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ టి. హరీష్ రావు సహా పలువురు సీనియర్ నాయకులు ప్రత్యేక సెషన్లలో పాల్గొని ప్రజాప్రతినిధులకు సూచనలు చేశారు. వర్క్‌షాప్ ముగింపు సెషన్‌లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి పాల్గొని అసెంబ్లీ సమావేశాల్లో ప్రజా సమస్యలను బలంగా ప్రస్తావించే అంశాలపై నిర్వహించిన దిశానిర్దేశ కార్యక్రమాన్ని శ్రద్ధగా అనుసరించారు. ఇలాంటి వర్క్‌షాప్‌లు ప్రజాప్రతినిధులకు సభా వ్యవహారాలపై మరింత అవగాహన కల్పించి ప్రజా సమస్యల పరిష్కారానికి దోహదపడతాయని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు.

## ఆలయ వార్షికోత్సవం..

## ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డికి ఆహ్వానం



**చేగుంట, మార్చి 10 (నినాదం):** మెదక్ జిల్లా చేగుంట మండలం కన్యారం గ్రామంలో నిర్వహించనున్న శ్రీశ్రీశ్రీ పెద్దమ్మ దేవాలయ ద్వితీయ వార్షికోత్సవ మహోత్సవం సందర్భంగా ఆహ్వాన పత్రికను మంగళవారం నాడు దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి కి అందజేశారు. అదేవిధంగా చేగుంట మండలానికి చెందిన కన్యారం గ్రామ ముదిరాజ్ సంఘం సభ్యులు దుబ్బాకలోని ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి దేవాలయ వార్షికోత్సవ మహోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని కోరుతూ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## భార్యభర్తల మధ్య కుటుంబ వివాదం

### ఇరువర్గాలపై కేసు నమోదు

**చేగుంట, మార్చి 10 (నినాదం):** తూప్రాన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అల్లాపూర్, చేగుంట మండలాలకు చెందిన రాంపూర్ గ్రామానికి చెందిన భార్యా భర్తల మధ్య కుటుంబ వివాదం చోటుచేసుకున్నది. ఈ విషయమై ఇరు వర్గాల వారు సమస్య పరిష్కారం కోసం తూప్రాన్ పోలీస్ స్టేషన్‌కు వచ్చారు అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణంలో ఇరు వర్గాల మధ్య మాటామాటా పెరిగి గొడవకు దారితీసింది ఇది పోలీసులు గమనించిన వెంటనే అప్రమత్తమై పోలీసు సిబ్బంది పలుమార్లు వారిని శాంతింపజేయడానికి ప్రయత్నించి గొడవ చేయవద్దని హెచ్చరించినప్పటికీ వారు వినకుండా స్టేషన్ ప్రాంగణంలోనే ఒకరిపై ఒకరు దూషణలు చేసుకుంటూ న్యూసెన్స్ సృష్టించారు. పోలీసు విధులకు ఆటంకం కలిగించే విధంగా ప్రవర్తించారు. ఈ నేపథ్యంలో ప్రజా శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకొని పోలీసు సిబ్బంది ఇరు వర్గాల వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నాము అని తూప్రాన్ ఎస్సై తెలిపారు

## ఐటీఐ కేంద్రాలను బలోపేతం చేయాలి

### కలెక్టర్ ప్రావీణ్య



**సంగారెడ్డి బ్యూరో, మార్చి 10 (నినాదం):** జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో అమలవుతున్న పీఎం సేతు ప్రాజెక్టు ద్వారా ఐటీఐ కేంద్రాలను బలోపేతం చేసి ఆధునిక మౌలిక వసతులు కల్పించడం, కాలానికి అనుగుణంగా కొత్త కోర్సులు ప్రవేశపెట్టడం ద్వారా యువతకు నైపుణ్య శిక్షణ అందించి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ లో ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భముగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ... పీఎం సేతు ప్రాజెక్టు కింద ఐదు ఐటీఐలను హబ్ అండ్ స్పోక్స్ విధానంలో అభివృద్ధి చేసి పరిశ్రమల సహకారంతో ఐదేళ్లపాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆధునిక యంత్రాలు, మౌలిక వసతులు, శిక్షణా సామగ్రి ఏర్పాటు చేసి ఐటీఐలను ఆధునిక నైపుణ్య కేంద్రాలుగా తీర్చిదిద్దనున్నట్లు వివరించారు. ఈ సమీక్షలో ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎస్ రాజా, ఐటిఐ ప్రిన్సిపల్ తిరుపతిరెడ్డి, సీఎం సేతు కన్సల్టెంట్ శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

## గుర్రపు డెక్క తొలగింపు వేగవంతం చేయాలి


### మాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాసరెడ్డి



**అల్వాల్, మార్చి10 (నినాదం):** చెరువులలో పేరుకుపోయిన గుర్రపు డెక్క తొలగింపు కార్యక్రమం వేగవంతం చేయాలని మాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాసరెడ్డి అధికారులకు ఆదేశించారు. గుర్రపు డెక్క తొలగింపు కార్యక్రమం నత్త నడక నడుస్తుండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చెరువులలో గుర్రపు డెక్క వల్ల పరిసరాల కాలనీవాసులు దోమల వల్ల తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని ఇబ్బందులు కలగకుండా తగు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. యుద్ధ ప్రాతిపదికన పనులను పూర్తి చేసి దోమల బెడద నుండి కాపాడాలని కాంట్రాక్టర్లను కోరారు. ఈ కార్యక్రమంలో డోలి రమేష్ ప్రశాంత్ రాజేందర్ లింగారెడ్డి శోభన్ బాబు ,వెంకటేష్, గణేష్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు సి.ఎం.ఆర్.ఎఫ్ వరం

### కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్



**కుత్బుల్లాపూర్, మార్చి 10 (నినాదం):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన దమ్ము భవాని అనారోగ్యంతో పంజాగుట్ట నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. రెండు రోజుల క్రితం మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ ను కలిసి వైద్య పరీక్షల నిమిత్తము ప్రభుత్వం తరుపున ఆర్థిక సహాయం చెయ్యాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే వెంటనే స్పందించి ఇంచార్జ్ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు దృష్టికి తీసుకెళ్ళి 2.50 లక్షల ముఖ్యమంత్రి సహాయ నిధి పథకంలో ఎల్ఓసి మంజూరు చేయించి మంగళవారం బాధ్యత కుటుంబ సభ్యులకు అందజేశారు. అనంతరం కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ అనారోగ్య పరిస్థితులతో ఆసుపత్రులలో చికిత్స పొందినవారు, చికిత్స నిమిత్తము వైద్య సేవలకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు. అర్హులైన ప్రజలు ముఖ్యమంత్రి సహాయనిధి పథకమును సద్వినియోగపర్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొంపల్లి మాజీ సర్పంచ్ జిమ్మీ దేవేందర్, అరుణ్, లక్ష్మణ్, రంగా, సాయి తదితరులు పాల్గొన్నారు.

## సావిత్రీబాయి పూలేకు ఘన నివాళి



**కాప్రా, మార్చి 10 (నినాదం) :** నాచారం సర్కిల్ నాచారం డివిజన్ ఎర్రకుంట అంబేడ్కర్ గ్రంథాలయంలో సావిత్రీబాయి పూలే వర్ధంతిని నిర్వహించారు. వర్ధంతి కార్యక్రమములో గ్రంథాలయ సభ్యులు, ఎర్రకుంట సీనియర్ సిటిజన్స్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# హుజూరాబాద్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

## దశాబ్దాల తర్వాత హుజూరాబాద్ గడ్డపై కాంగ్రెస్ జెండా.. ఎన్నికల వరకే రాజకీయం, తర్వాత అభివృద్ధే

### ప్రణవ్ బాబు పనితీరు భేష్.. చైర్మన్ పదవి బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్

**జమ్మికుంట, మార్చి 10 (నినాదం)**

హుజూరాబాద్ ప్రాంత ప్రజల మనోభావాలకు అనుగుణంగా ఈ ప్రాంత అభివృద్ధికి తామంతా కట్టుబడి ఉన్నామని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ,రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ అన్నారు.మంగళవారం హుజూరాబాద్ మున్సిపల్ చైర్మన్ సుహాసిని పదవి బాధ్యతల స్వీకరణ మహోత్సవ కార్యక్రమానికి మంత్రి పొన్నం, చొప్పదండి ఎమ్మెల్యే సత్యం, హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా హుజూరాబాద్ అంబేద్కర్ చౌక్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం మున్సిపల్ కార్యాలయం వరకు భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు.మార్గ మధ్యంలో మాజీ రాజ్యసభ సభ్యులు రాజేశ్వర్ రావు,జగ్ జీవన్ రామ్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.అనంతరం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో పాల్గొన్నారు.అనంతరం వారు మాట్లాడుతూ కొన్నేళ్ళ నుండి హుజూరాబాద్ ప్రాంతంతో మంచి సంబంధాలు కలిగిన పొన్నం ప్రభాకర్ ఈ ప్రాంతానికి పెద్దన్న పాత్ర పోషించాలని ఎంపీగా







ఉన్న సమయంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశారని,అటు హుస్నాబాద్ ఇటు హుజూరాబాద్ ను రెండు కళ్లతో చూస్తూ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు.డీసీసీగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హయంలో హుజూరాబాద్ మున్సిపల్ పై కాంగ్రెస్ జెండా ఎగరవేశామని ప్రణవ్ అన్నారు.హుజూరాబాద్ లో పార్టీలకు అతీతంగా హుజూరాబాద్ అభివృద్ధికి కట్టుబడి ఉండాలని,ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొకటిగా నెరవేరుస్తున్నామని రాష్ట్రంలో ఏ ఎన్నికలు వచ్చినా కాంగ్రెస్ పార్టీ విజయం సొంతం చేసుకుంటుందని నూతనంగా పదవి బాధ్యతలు స్వీకరించిన మున్సిపల్ పాలకవర్గానికి అభినందనలు తెలియజేశారు.అనంతరం పొన్నం మాట్లాడుతూ హుజూరాబాద్ అభివృద్ధికి సీఎం రేవంత్ సహకరిస్తామని తన మాటగా ప్రత్యేకంగా చెప్పారని,ఎన్నికల వరకే రాజకీయాలని,ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పని చేయాలని పిలుపునిచ్చారు.హుజూరాబాద్ మున్సిపల్ అభివృద్ధి కోసం 300 కోట్ల ప్రతిపాదనలు ఇచ్చారని,ఎంపీ సహకారంతో అభివృద్ధి చేస్తామని,మహిళల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం దోహదం చేస్తోందని అన్నారు.సీఎం రేవంత్ నాయకత్వంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని,ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నా ఒక్కో హామీని నెరవేరుస్తున్నాం అన్నారు.హుజూరాబాద్ మున్సిపల్ ఆధ్వర్యంలో ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని,పర్యావరణం పచ్చదనంగా ఉంటేనే మానవ మనుగడ బాగుంటుందన్నారు.ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా మెడికల్ క్యాంపులను ప్రభుత్వం పక్షాన ఏర్పాటు చేస్తున్నామని,ప్రజలంతా అన్ని రకాల టెస్టులు చేయించుకుని ఆరోగ్యంగా ఉండాలని అన్నారు.ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేలా కృషి చేయాలని అన్నారు.వాహనాలు నడిపేప్పుడు జాగ్రత్తగా వెళ్లాలని,ట్రాఫిక్ నిబంధనలు పాటించి అందరూ సహకరించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం,హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్చార్జి వొడితల ప్రణవ్,మున్సిపల్ కమిషనర్ అహ్మద్ సయ్యద్,మున్సిపల్ అధికారులు,30 వార్డుల కౌన్సిలర్లు,కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భారీగా పాల్గొన్నారు.



# తుమ్మడిహెట్టి కాంగ్రెస్ పార్టీ డ్రీమ్ ప్రాజెక్ట్

## బ్యారేజ్ నిర్మాణానికి నిధులు కేటాయించాలి.. మేడిగడ్డ పునరుద్ధరించాలి

## తాగు, సాగు నీటితో పాటు, పారిశ్రామిక అవసరాలకు ఉపయోగం..

## బడ్జెట్ లో రెండేళ్లలో 10,000 కోట్ల నిధులు కేటాయించాలి...

## మాజీ మంత్రి జీవన్ రెడ్డి

**జగిత్యాల ప్రతినిధి, మార్చి 10 (నినాదం )**

మేడి గడ్డను పునరుద్ధరించాలని బడ్జెట్ లో పది వేల కోట్ల నిధులు కేటాయించాలని మాజీ మంత్రి జీవన రెడ్డి అన్నారు. మంగళవారం ఇందిరా నివాసం లో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశం లో మాట్లాడుతూ త్రాగు సాగు నీటి తో పాటు పారిశ్రామిక అవసరాలు దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు.ఉత్తర తెలంగాణ సస్య శ్యామలం చెందేందుకు గోదావరి దిగువన వృధాగా పోతున్న నీటిని ఉపయోగించుకునేందుకు వై ఎస్ రాజశేఖర్ రెడ్డి కృషి చేశారన్నారు ప్రాణహిత నది నీటి హక్కును వినియోగించుకునేందుకు తుమ్మడి హేటి వద్ద బ్యారేజ్ నిర్మాణం చేపట్టేందుకు కాలువలు కూడా నిర్మించారన్నారు.హైదరాబాద్, రంగారెడ్డి కి కూడా త్రాగునీరు, పారిశ్రామిక అవసరాలకు వినియోగించుకునేందుకు ఎంతో అవసరమన్నారు కానీ తుమ్మడి హేటి వద్ద టెండర్ దశలోనే నిలిచిపోయిందన్నారు.2023 అక్టోబర్ లో 7వ బ్లాక్ వద్ద కుంగి పోవటంతో నీటిని తరలించే అవకాశం లేకుండా పోయిందన్నారు.మేడిగడ్డ అన్నారం, సుందిల్ల కు మరమ్మతులు చేపట్టాలని జాతీయ డ్యామ్ సేఫ్టీ సంస్థ సూచించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వమే మరమతు చేపట్టి కాంట్రాక్టర్ వద్ద రికవరీ చేయవ చ్చన్నారు.అవసరమైతే క్రిమినల్ ప్రాసిక్యూషన్ చేపట్టవచ్చన్నారు. తుమ్మడిహెట్టి బ్యారేజ్ నిర్మాణం కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో కూడా చేర్చిందన్నారు.తుమ్మడి హేట్టి వద్ద బ్యారేజ్ నిర్మాణం చేపడుతామని రాహుల్ గాంధీ చెప్పారన్నారు .152 మీటర్ల నీటిని తరలించేందుకు తవ్విన కాలువలు 148 మీటర్ల నీటిని తరలించేందుకు రీ డిజైన్ చేయ వచ్చన్నారు. జైపూర్ వాగు నుండి సుందిల్ల లిఫ్ట్ తో ఎల్లంపల్లి కి నీటిని తరలించవచ్చన్నారు.తుమ్మడి హేట్టి బ్యారేజ్ నిర్మాణం, నీటి తరలింపు, కాలువల రీ డిజైన్ కు పదివేల కోట్లకు మించదన్నారు. ఉత్తర తెలంగాణ జిల్లాలతో పాటు ముసి నది ప్రక్షాళనకు, హైదరాబాద్ వరంగల్, మెదక్, నల్గొండ సగం రాష్ట్రానికి ప్రాణహిత నది జలాలను వినియోగించుకోవడం..లేదన్నారు.రాష్ట్రానికి ఆయువుపట్టు గోదావరి, ప్రాణహిత నది జలాలన్నారు .రెండేళ్లుగా ప్రకృతి సహకరించిందన్నారు.వర్షాభావ పరిస్థితుల లు ఏర్పడితే రాష్ట్రం త్రాగు నీరు, సాగు నీరు కు ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందన్నారు. మేడిగడ్డ పునరుద్ధరణ, నిర్మాణ వైఫల్యమా.. నిర్వహణ లోపమా..ఏదైనా..మేడిగడ్డ పునరుద్ధరణ చేసి, వినియోగంలోకి తీసుకురావాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉందన్నారు.తుమ్మడి హేట్టి వద్ద బ్యారేజ్ నిర్మాణం చేపట్టేందుకు ప్రాధాన్యతతో నిధులు కేటాయించాలన్నారు.ఆరు నెలల పాటు సుమారు 180 టీ ఎం సి నీటిని తరలించుకోవచ్చు.. ఒక్క లిఫ్ట్ తో ఎల్లం పల్లికి నీటిని తరలించే అవకాశం ఉందన్నారు.తుమ్మడి హేట్టి బ్యారేజ్ నిర్మాణానికి రెండుళ్లు 5000 కోట్లు చొప్పున కేటాయించాలనీ గౌరవ సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కి విజ్ఞప్తి చేశారు. గత పదేళ్ల నుండి బాధ్యతగల పౌరుడిగా తుమ్మడి హేట్టి ప్రాధాన్యతను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన అని గుర్తు చేశానన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ కార్యాకర్తలు నాయకులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళికతో సమస్యల పరిష్కారం

## 19వ డివిజన్‌లో పారిశుధ్య పనుల పరిశీలన చేసిన కమిషనర్ ప్రఫుల్ దేశాయ్

**కరీంనగర్, మార్చి 10(నినాదం )**

నగరంలోని ప్రజా సమస్యలను ప్రాధాన్యతతో పరిష్కరించేందుకు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం అమలు చేస్తున్నట్లు కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఆయన 19వ డివిజన్‌ను సందర్శించి పారిశుధ్య పనులను పరిశీలించారు. కార్పొరేటర్ సుధగోని మాధవి కృష్ణతో కలిసి పాతపల్లె కాలనీలో యంత్రాల సహాయంతో డ్రైనేజీలో పేరుకుపోయిన మురుగును తొలగించారు. అనంతరం హరిహర, విజయదుర్గ కాలనీలలో మురుగు సమస్యను పరిశీలించారు. ప్రధాన రహదారి చౌరస్తాలో ప్రజా మరుగుదొడ్డి నిర్మాణం కోసం స్థలాన్ని కూడా పరిశీలించారు.అదే సమయంలో నగరంలోని పలు డివిజన్లలో పారిశుధ్య పనులు నిర్వహించి మురుగు కాలువలలోని మురుగును తొలగించడంతో పాటు పరిసరాలు, ఖాళీ స్థలాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ద్వారా అన్ని డివిజన్లలో ప్రజల సమస్యలను పరిష్కరిస్తున్నామని తెలిపారు. పారిశుధ్య పనులకు ప్రాధాన్యత ఇచ్చి, తాగునీటి సరఫరాలో లీకేజీలను నివారించడంతో పాటు అవసరమైన చోట ఐదు లక్షల రూపాయల నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు. వీధి దీపాల నిర్వహణ ద్వారా ప్రజలకు మెరుగైన వెలుగు సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆరోగ్య అధికారి సుమన్, పారిశుధ్య అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





## హుజురాబాద్ మునిసిపల్ చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలిపిన జమ్మికుంట చైర్మన్

**జమ్మికుంట, మార్చి 10 (నినాదం)**

హుజరాబాద్ మునిసిపల్ చైర్ పర్సన్ గా ఎన్నికైన రెంటాల సుహాసిని మంగళవారం పదవి బాధ్యతలు స్వీకరించారు. మంగళవారం నిర్వహించిన పదవి బాధ్యతల కార్యక్రమం అట్టహాసంగా నిర్వహించగా వారిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపిన జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్. అనంతరం ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ, హుజురాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేయాలని ప్రభుత్వ సహకారంతో అభివృద్ధి విషయంలో రాజీపడకుండా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని వారిని కోరినట్లు తెలిపారు. ఉన్నత చదువులు చదివిన ఒక విద్యావేత్త మున్సిపల్ చైర్మన్ కావడం అభినందనీయమని ప్రతి సమస్యపై అవగాహన కలిగి ఉండడం వలన అభివృద్ధి విషయంలో ఆటంకం ఉండదని రాజకీయాలకు అతీతంగా పట్టణాభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట మున్సిపల్ వైస్ చైర్మన్ మహమ్మద్ జావిద్ కౌన్సిలర్లు చింతల శ్రీనివాస్ తో పాటు శ్రవణ్ చింటూ మార్కెట్ డైరెక్టర్ గడ్డం దీక్షిత్ తదితరులు పాల్గొన్నారు.

# నీటి పారుదల శాఖ ఉద్యోగుల క్యాలెండర్ 2026 ఆవిష్కరణ

## ఉద్యోగుల సమస్యలపై దృష్టి సారిస్తానని ఈఎన్‌సీ శ్రీనివాస్ హామీ

## ఎన్‌టీపీఏ పోస్టుల పెంపుపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపనున్నట్లు వెల్లడి

**కరీంనగర్, మార్చి 10(నినాదం)**



హైదరాబాద్‌లో నీటి పారుదల శాఖ ఉద్యోగుల క్యాలెండర్–2026ను గౌరవ ఇంజనీర్ ఇన్ చీఫ్ (పరిపాలన) శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్ మాట్లాడుతూ, శాఖ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ఈఎన్‌సీ దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా ఎన్‌టీపీఏ పోస్టుల పెంపు కోసం వినతిపత్రాన్ని సమర్పించారు.దీనికి స్పందించిన ఈఎన్‌సీ శ్రీనివాస్ మాట్లాడుతూ ఉద్యోగుల అన్ని సమస్యలను సమగ్రంగా పరిశీలిస్తానని తెలిపారు. ఎన్‌టీపీఏ పోస్టుల పెంపు విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి తగిన ప్రతిపాదనలు పంపుతానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఉప ఇంజనీర్ ఇన్ చీఫ్ చెందర్ రావు, ప్రధాన కార్యదర్శి ముజీబ్, సహాధ్యక్షుడు వెంకట్, కోశాధికారి సత్యనారాయణ గౌడ్, పెదపల్లి జిల్లా అధ్యక్షుడు శెంకర్, హైదరాబాద్ నగర అధ్యక్షుడు శ్రీకాంత్ పాల్గొన్నారు. అలాగే నీటి పారుదల రాష్ట్ర అధ్యక్షుడు సంగేమ్ లక్ష్మణ్ రావు, రాష్ట్ర కార్యదర్శి నజీర్ అహ్మద్, రాగి శ్రీనివాస్, తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు, కార్యదర్శులు, నీటి పారుదల జిల్లా అధ్యక్షుడు గంగారపు రమేష్, జిల్లా కార్యదర్శి ప్రసాద్, అజు, అలీతో పాటు రాష్ట్ర నాయకులు, శాఖ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# భగత్‌నగర్ ప్రజల ప్రేమకు జీవితాంతం రుణపడి ఉంటా

## అయ్యప్ప స్వామి దర్శనం అనంతరం ఆదర్శ యువజన సంఘం, జైభీమ్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మానం: డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు

**కరీంనగర్, మార్చి 10(నినాదం )**

కరీంనగర్ నగరంలోని 42వ డివిజన్ భగత్‌నగర్ అయ్యప్ప దేవాలయంలో మంగళవారం డిప్యూటీ మేయర్ (మాజీ మేయర్) యాదగిరి సునీల్ రావుకు ఆదర్శ యువజన సంఘం, జైభీమ్ యువజన సంఘం సభ్యులు ఆత్మీయ సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన హరిహరక్షేత్రంలోని అయ్యప్ప స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య ఆశీర్వచనం అందించారు. అనంతరం యువజన సంఘాల సభ్యులు మరియు స్థానికులు యాదగిరి సునీల్ రావును శాలువాలతో సత్కరించి పూల మొక్కలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా సునీల్ రావు మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో నగరంలోని 66 డివిజన్లలో ఫలితాలపై అనిశ్చితి ఉన్నప్పటికీ 42వ డివిజన్ ప్రజలు తన విజయం ఖాయమని విశ్వసించారని గుర్తుచేశారు. గత కొన్ని సంవత్సరాలుగా ఎలాంటి ఆశలు లేకుండా తన విజయానికి కృషి చేసిన ఆదర్శ యువజన సంఘం, జైభీమ్ యువజన సంఘం, చైతన్య యువజన సంఘం, భగత్‌నగర్ సంక్షేమ సంఘం సభ్యులతో పాటు డివిజన్ ప్రజలందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.తనపై చూపుతున్న ప్రేమాభిమానాలు, విశ్వాసం వల్లే వరుస విజయాలు సాధ్యమవుతున్నాయని పేర్కొన్నారు. డివిజన్ ప్రజల కోసం శక్తి మేరకు పని చేశానని, భవిష్యత్తులో కూడా అదే కృషి కొనసాగిస్తానని తెలిపారు. డ్రైనేజీ, రహదారులు, పారిశుధ్యం, త్రాగునీటి సరఫరా వంటి మౌలిక వసతుల విషయంలో భగత్‌నగర్ డివిజన్ ఇతర ప్రాంతాలకు ఆదర్శంగా నిలుస్తోందన్నారు. హిందూ,ముస్లిం ప్రజలు అన్నదమ్ముల్లా కలిసి పండుగలను పరస్పరం గౌరవించుకుంటూ శాంతి సౌహార్దాలతో జీవించడం భగత్‌నగర్ ప్రత్యేకతగా ఉందని పేర్కొన్నారు. ఎలాంటి సమస్య వచ్చినా ప్రజల వెన్నంటే ఉంటానని హామీ ఇచ్చారు. తనకు మళ్లీ డిప్యూటీ మేయర్ పదవి లభించేందుకు పూర్తి మద్దతు ఇచ్చిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్‌కు, అలాగే భగత్‌నగర్ ప్రజలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ యువజన సంఘం సభ్యులు డొంకిని జయరాం, సోడే ధనరాజ్, సోమిడి మల్లేశం, బాలు, జైభీమ్ యువజన సంఘం సభ్యులు అరికిల్ల శంకర్, దాసరి రమేష్, అరుణ్ కుమార్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.







## పదవ తరగతి విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు సమావేశం

**జమ్మికుంట, మార్చి 10 (నినాదం)**

జమ్మికుంట బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం పదవ తరగతి విద్యార్థులకు 9వ తరగతి విద్యార్థులు ఘనంగా వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఇట్టి సమావేశంలో 10వ తరగతి విద్యార్థులతో 9వ తరగతి విద్యార్థులకు ఉన్న తీపి జ్ఞాపకాలను ఒకరికి ఒకరు షేర్ చేసుకోవడం జరిగింది. ఇట్టి వీడ్కోలు సమావే సమావేశానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాదం సురేష్ బాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బాదం సురేష్ బాబు మాట్లాడుతూ పదవ తరగతి దశ జీవితానికి ఒక కీలక మలుపు దశ అని విద్యార్థులకు హితోపదేశం చేశారు. మార్చి 14 నుండి జరుగబోయే పదవ తరగతి పరీక్షలకు విద్యార్థులు అందరూ హాజరై వంద శాతం ఉత్తీర్ణత కావాలని, పాఠశాలకు మంచి పేరు ప్రతిష్ఠితలు తీసుకురావాలని సూచించారు. ఇట్టి వీడ్కోలు సమావేశానికి ముఖ్య అతిథులుగా స్థానిక జమ్మికుంట మండల ఇన్ చార్జి విద్యా శాఖ అధికారిణి మంథని హేమలత హాజరై విద్యార్థులు అందరూ తాము ఎంచుకున్న రంగంలో ఆరితేరి తమ జీవితానికి ఉజ్వల భవిష్యత్తు నిర్మించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని గుర్తు చేశారు. అదేవిధంగా విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి విద్య తోనే సత్ప్రవర్తన అలవరుచుకొని జీవితాన్ని ఆనందమయంగా గడపాలని సూచించారు. తదనంతరం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలతో వీడ్కోలు సమావేశం ముగిసింది. ఈ వీడ్కోలు సమావేశంలో ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొని విజయవంతం చేశారు.





# ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దుదాం

## సర్పంచ్ పోలు సంపత్

**హుస్నాబాద్, మార్చి10 (నినాదం )**

హుస్నాబాద్ మండలం గాంధీనగర్ గ్రామంలో ప్రజా పాలన ప్రగతి ప్రాణాలిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని వార్డుల్లో రోడ్లపై ఉన్నటువంటి ప్లాస్టిక్ కవర్స్ ని బాటిల్స్ ని రోడ్లపై చెత్తని శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ పోలు సంపత్ మాట్లాడుతూ గ్రామ ప్రజలందరూ కూడా గాంధీనగర్ గ్రామాన్ని ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దే విధంగా నడుము కట్టాలి అని ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని రోడ్లపై చెత్తను వెయ్యకుండా గ్రామపంచాయతీ చెత్త బండి వచ్చినప్పుడు అందులో తడి చెత్త పొడి చెత్త ప్రమాదకరమైనటువంటి చెత్త అని మూడు భాగాలను వేరువేరుగా ఇవ్వాలని పరిసరాలు బాగుంటేనే గ్రామం బాగుంటుంది అన్నారు. ఈ కార్యక్రమంలో సాహస స్వచ్ఛంద సంస్థకు చెందిన ప్రతినిధులు గ్రామ ఉపసర్పంచ్ శ్రీశైలం ఆరో వార్డ్ మెంబర్ ఆంజనేయులు గ్రామ కార్యదర్శి సతీష్ ఫీల్డ్ అసిస్టెంట్ గ్రామస్తులు పరిశుద్ధ కార్మికులు పాల్గొన్నారు.

## బుగ్గారం ఇంచార్జి ఎంపిడివోగా వాసవి

**బుగ్గారం, మార్చి10 (నినాదం )**



జగిత్యాల జిల్లా బుగ్గారం మండల ఇంచార్జి ఎంపిడివోగా వాసవి మంగళ వారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుత ఎంపిడివో సుమంత్ 45 రోజుల శిక్షణ కు వెళ్లిన సందర్భంగా బుగ్గారం ఇంచార్జి ఎంపివో గా పని చేస్తున్న వాసవి కి అదనంగా ఎంపిడివో బాధ్యతలు కూడా అప్పగిస్తూ ఈ నెల 7న ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అట్టి ఉత్తర్వుల ప్రకారం మంగళ వారం ఆమె ఇంచార్జి ఎంపిడివో గా బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా ఆమె విలేఖరులతో మాట్లాడారు. మండలంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం మండల అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రస్తుతం కొనసాగుతున్న 99 రోజుల యాక్షన్ ప్లాన్ లో ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలు కూడా మండలంలోని అన్ని గ్రామాలలో విజయ వంతం అయ్యేలా చూస్తానని తెలిపారు.





# మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం

## సుమారు 150 మందికి నిపుణుల వైద్య సేవలు

## అవసరమైన వారికి పరీక్షలు, మందులు ఉచితం

**కరీంనగర్, మార్చి 10(నినాదం )**

కరీంనగర్‌లోని డి ఆర్ డి ఓ కార్యాలయంలో మంగళవారం కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. డిఆర్డిఓ ఉద్యోగులు, సిబ్బంది, స్థానిక ప్రజలకు నాణ్యమైన సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు.శిబిరంలో సుమారు 150 మందికి నిపుణులైన వైద్యులు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. సాధారణ ఆరోగ్య సమస్యలను సమగ్రంగా పరిశీలించడంతో పాటు అవసరమైన వారికి రక్తంలో చక్కెర స్థాయి, రక్తపోటు, హృదయ విద్యుత్ నమోదు పరీక్ష, ద్విమితీయ గుండె ప్రతిధ్వని పరీక్ష వంటి కీలక వైద్య పరీక్షలు చేసి తక్షణ నిర్ధారణ చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు.ఈ సందర్భంగా మెడికవర్ ఆసుపత్రి కేంద్రాధిపతి గుర్రం కిరణ్ మాట్లాడుతూ, డిఆర్డిఓ ఉద్యోగులు, సిబ్బంది, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం తమ సామాజిక బాధ్యతగా భావిస్తున్నట్లు తెలిపారు. పండుగలు, సెలవులు అనే తేడా లేకుండా ఇరవై నాలుగు గంటలపాటు అన్ని రకాల సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని చెప్పారు.ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ అధికారులు శ్రీధర్, లింగమూర్తి, వైద్యులు నాగరాజు, తాహా, శ్రీ నయన, ఆహార నిపుణురాలు మమత, శరీర వ్యాయామ చికిత్స నిపుణుడు అనిల్, మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# కౌన్సిలర్లకు ఘన సన్మానం



**మెట్ పల్లి మార్చి, 10 ( నినాదం)**

ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో గెలుపొందిన మున్నూరు కాపు కౌన్సిలర్ల కు గోల్ హనుమాన్ మున్నూరు కాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘన సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్నూరు కాపు వైస్ చైర్మన్ ఓంకార్ నవీన్‌తో పాటు కౌన్సిలర్లు బొడ్ల రమేష్, నునుగొండ నరేష్, మాసుల ప్రవీణ్, బొడ్ల ఆనంద్, నాయకులు ధోనికెల నవీన్, బొడ్ల నగేష్, అరిగెల రాకేష్‌లను శాలువాలతో సత్కరించారు. అనంతరం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని మున్నూరు కాపు కుటుంబాలకు ఎలాంటి ఆపద వచ్చినా తాము ముందుండి సహకరిస్తామని తెలిపారు. అలాగే అన్ని కుల సంఘాల అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సంగు గంగాధర్ తదితర సభ్యులు పాల్గొన్నారు.

## బుగ్గారం వాసికి "కళా రత్న నేషనల్ అవార్డ్"

### ఈనెల 15న తిరుపతిలో అవార్డ్ అందుకోనున్న నక్క పోచ రాజయ్య

**బుగ్గారం, మార్చి 10(నినాదం )**



జగిత్యాల జిల్లా బుగ్గారం మండల కేంద్రానికి చెందిన ప్రముఖ విద్యావేత్త నక్క పోచ రాజయ్య అలియాస్ నక్క రాజు "కళా రత్న నేషనల్ అవార్డ్" కు ఎంపికయ్యారు. బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ జారీ చేసిన ఇట్టి అవార్డ్ ఎంపిక పత్రం ను అవార్డుల సెలెక్షన్ కమిటి సభ్యుడు చుక్క గంగారెడ్డి మంగళ వారం నక్క పోచ రాజయ్య ( నక్క రాజు ) కు అందజేశారు. ఈనెల 15 ఆదివారం ఉదయం తిరుపతిలో జరుగనున్న బహుజన సాహిత్య అకాడమీ 18వ జాతీయ స్థాయి కాన్ఫరెన్స్ (అవార్డుల ప్రధానోత్సవ సభ) లో ఇట్టి అవార్డ్ ను అందజేయనున్నట్లు జాతీయ అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ అట్టి ఎంపిక పత్రంలో పేర్కొన్నారు. ఇప్పటికే ఆధ్యాత్మిక ఉద్యమ కళాకారుడిగా పేరు ప్రఖ్యాతులు పొంది, విద్యారత్న జాతీయ అవార్డ్, నంది అవార్డు లతో పాటు డాక్టరేట్ కూడా సాధించిన నక్క పోచ రాజయ్య ( నక్క రాజు ) నేడు "కళా రత్న నేషనల్ అవార్డ్" కు కూడా ఎంపిక కావడం పట్ల బుగ్గారం మండల ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు, విద్యావంతులు, బంధు మిత్రులు, శ్రేయోభిలాషులు నక్క పోచ రాజయ్య ( నక్క రాజు ) ను అభినందిస్తున్నారు.

# మూగజీవాల దందా..
# అధికారుల అండ..!

## ఆసిఫాబాద్ కేంద్రంగా పశువుల అక్రమ రవాణా



**సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద మామూళ్ల ఆరోపణలు**
**రోజుకు 50 నుండి 60 వాహనాల్లో తరలింపు**

**ప్రమాణం చేసి పదవుల్లోకొచ్చిన అధికారులే అక్రమార్కులతో కలిసిపోతే, పవరుందికదా అని అసాంఘిక శక్తులకే అండగా నిలిస్తే అన్నీ ఉన్న పౌరుల రక్షణకే దిక్కుండదు.ఇక ప్రాణం తప్ప మరేమీలేని మూగజీవాల పరిస్థితేంటి? వందలు,వేలల్లో వాటి ప్రాణాలు నిత్యం గాల్లో కలవాల్సిందేనా అంటే రాష్ట్రం లోని ఆ జిల్లా అవుననే సమాధానమిస్తోంది.రక్తపు కూడుకు మరిగిన దొంగలు అక్రమంగా పశువులను తరలిస్తూఉంటే, అంతా తెలిసి వారితో అంటగాగుతున్న అధికారుల భాగోతంపై నినాదం ప్రత్యేక కథనం....**

*– ప్రత్యేక ప్రతినిధి, మార్చి10(నినాదం)*

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో పశువుల అక్రమ రవాణా మళ్లీ జోరందుకుంది. సిర్పూర్--కాగజ్‌నగర్ సమీపంలో మహారాష్ట్ర పోలీసులు ఇటీవల పట్టుకున్న వాహనాలే దీనికి నిదర్శనంగా మారాయి. తెలంగాణలోని ఆసిఫాబాద్ జిల్లాకు తరలిస్తున్న పశువుల వాహనాలను పట్టుకున్నట్లు వారు విడుదల చేసిన ప్రెస్ నోట్‌లో స్వయంగా వారే పేర్కొనటం గమనార్హం.



గతంలో వాంకిడి ఠానా పరిధి గోయగామలో ఏఎస్పీ పట్టుకున్న మూగజీవాలు

**మామూళ్లతో చెక్ పోస్టులకు చెక్..!**

సిర్పూర్, కాగజ్‌నగర్ మీదుగా గూడెం--చింతల మానేపల్లి--పంచకల్ పేట్ మార్గాల ద్వారా రోజుకు సుమారు 50 నుంచి 60 వాహనాల్లో మూగజీవాలను తరలిస్తున్నట్లు సమాచారం. సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద ఒక్కో వాహనం నుంచి రూ.2000 వరకు మామూల్లు వసూలు చేసి వదిలేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. చింతల మానేపల్లి సరిహద్దులోని గూడెం చెక్‌పోస్ట్ వద్ద కూడా మామూళ్ల వ్యవహారం కొనసాగుతోందని స్థానికులు చెబుతున్నారు. వాంకిడి పోలీస్ స్టేషన్ పరిధి నుంచి లారీలు, బొలెరో వాహనాల్లో మూగజీవాలను తరలిస్తున్న ప్పటికీ అధికారులు నామమాత్ర తనిఖీలకే పరిమితమవుతున్నారని విమర్శలు ఉన్నాయి.



**కేవలం మహారాష్ట్ర పోలీసులకే చిక్కుడమేంటో..?**

ఇటీవల సిర్పూర్ సమీపంలో మహారాష్ట్ర పోలీసులు ఐదు బొలెరో వాహనాలను పట్టుకుని వాటిలో ఉన్న సుమారు 50 ఆవులను స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ సుమారు రూ.5.20 లక్షలుగా అంచనా వేశారు. గోయగాం గ్రామానికి చెందిన మోసిన్, మంజూర్ అనే ఇద్దరు ఎస్కార్ట్ వాహనంలో వస్తూ పట్టుబడగా, మిగిలిన డ్రైవర్లు పరారయ్యారు. మహారాష్ట్రలో వాహనాలను పట్టుకుంటున్నప్పటికీ తెలంగాణ సరిహద్దుల్లో మాత్రం చర్యలు లేకపోవడంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సరిహద్దు చెక్‌పోస్టులు అక్రమ రవాణాను అడ్డుకునేందుకా..? లేక మామూళ్ల కోసమేనా..? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో పశువుల అక్రమ రవాణా మళ్లీ పెరుగుతుండటం జంతు ప్రేమికుల్లో ఆందోళన కలిగిస్తోంది.

### ఉద్యోగ అవకాశాల కల్పనకు..
# ప్రభుత్వం కృషి

**యువతకు నైపుణ్య శిక్షణ అందించడంపై ప్రత్యేక దృష్టి**

**ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు**





**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (నినాదం):** ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఏర్పాటు చేసిన ఏటీసీ ద్వారా యువతకు ఉత్తమ శిక్షణ అందించి వారికి మంచి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. మంగళవారం భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఏర్పాటు చేసిన ఐటీసీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఏటీసీ కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన టూడీ, త్రీడీ మిషన్, అడ్వాన్స్ సీఎన్‌సీ మిషన్, రోబోటిక్ వెల్డింగ్ మిషన్ ఎలక్ట్రిక్ వాహనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో యువతకు నైపుణ్య శిక్షణ అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులకు ప్రాక్టికల్ శిక్షణ అందించడం ద్వారా వారికి మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఐటీఐ విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ, ఏటీసీ కేంద్రం ద్వారా విద్యార్థులు ఆధునిక యంత్రాలపై శిక్షణ పొందుతూ తమ సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించు కోవచ్చని తెలిపారు. ఇటువంటి శిక్షణ కేంద్రాలు యువతకు ఉపాధి అవకాశాలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమరయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్ జమ్ములాల్, ఇతర అధ్యాపకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పనిచేసే కార్యకర్తలకే కాంగ్రెస్ పార్టీ సముచిత స్థానం

**డిసిసి అధ్యక్షుడు కొత్త కాపు శివసేన రెడ్డి**

**వనపర్తి ప్రతినిధి, మార్చి 10 (నినాదం):** కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి పని చేసిన నికార్సైన కార్యకర్తకు కాంగ్రెస్ పార్టీ సముచిత గౌరవం, స్థానం కల్పిస్తుందని కాంగ్రెస్ పార్టీ వనపర్తి జిల్లా అధ్యక్షులు కొత్త కాపు శివసేన రెడ్డి అన్నారు. టీపీపీసీ అధిష్టానం ఆదేశాల మేరకు నూతనంగా మండల అధ్యక్షుల ఎన్నికకు మంగళవారం పెద్దమందడి మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కొత్త కాపు శివసేన రెడ్డి లు హాజరయ్యారు. ఈ సందర్భంగా శివసేన రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సంస్థాగత బలోపేతానికి పెద్దపీటం వేయబోతున్నట్లు తెలిపారు. మండల అధ్యక్షులు, గ్రామ అధ్యక్షులు, బూతు అధ్యక్షులకు సముచిత స్థానం ఇచ్చి గౌరవించనుందన్నారు. కాంగ్రెస్ పార్టీలో చిన్న పెద్ద అన్న తారతమ్యాలు లేకుండా, సమాన అవకాశాలు ఇవ్వడంలో క్రియాశీలకంగా వ్యవహరిస్తుందన్నారు. ఇప్పటినుంచి గతంలో పదవులు తీసుకుని పనిచేయకపోతే, ఎలాగోలాగా నెట్టుకొచ్చే వాళ్ళం.. గతంలో ఉన్న మాదిరిగా ఇప్పుడు ఉండదని, అందుకోసం ఏఐసీసీ అగ్రనేత మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ నేతృత్వంలో గ్రామస్థాయిలో ప్రక్షాళన చేయాలన్న ఆలోచన విధానంతో కాంగ్రెస్ పార్టీ భవిష్యత్తు పునర్నిర్మాణంలో భాగంగా దిశా నిర్దేశం చేస్తున్నారని గుర్తు చేశారు. నూతనంగా ఎన్నికైన మండల అధ్యక్ష కార్యవర్గానికి త్వరలో శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. ప్రతి ఒక్కరూ సోషల్ మీడియాను సద్వినియోగం చేసుకొని పార్టీ కార్యకర్త నుంచి రాష్ట్ర స్థాయి నాయకుల వరకు ప్రతిపక్ష నాయకులు విమర్శిస్తే..స్పందించి వెంటనే తగిన రీతిలో సమాధానం చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సెక్రటరీ నందిమల్ల యాదయ్య, మాజీ డిసిసి అధ్యక్షుడు రాజేందర్ ప్రసాద్, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, మొగిలి సత్యారెడ్డి, సత్యారెడ్డి, కోట్ల రవి, మాజీ జడ్పీటీసీ రమేష్ గౌడ్, సీనియర్ నాయకులు తిరుపతయ్య, ఎంపిపి శంకర్, గోవర్ధన్ సాగర్, జిల్లా యూత్ అధ్యక్షులు ఆదిత్య, పాండు సాగర్, సర్పంచులు, మండల పార్టీ నాయకులు పెంటన్న, కార్యకర్తలు, మహిళాలు తదితరులు పాల్గొన్నారు.



NINADAM CINEMA


# నెట్టింట రామాయణం ఫోటోలు

**అవి నకిలీవంటూ చిత్రబృందం కామెంట్**

భారీ బడ్జెట్‌తో బాలీవుడ్ నుంచి రాబోతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'రామాయణం'కు సంబంధించి సోషల్ మీడియాలో ఒక ఫొటో తెగ వైరలవుతున్నాయి. ఈ సినిమా షూటింగ్ సెట్స్ నుంచి రాముడిగా నటిస్తున్న రణబీర్‌తో పాటు సీతగా నటిస్తున్న సాయి పల్లవిల ఫొటోలు లీక్ అయ్యాయంటూ సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతుంది. అయితే ఈ ప్రచారంపై చిత్రబృందం స్పందిస్తూ.. ఆ ఫొటోలు నకిలివని.. అవి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతతో సృష్టించిన ఫేస్-స్వాప్ చిత్రాలని చిత్రబృందం తెలిపింది. 2015లో ప్రసారమైన 'సియా కే రామ్' సీరియల్‌లోని స్టిల్స్‌ను తీసుకుని, అందులోని నటీనటుల ముఖాలకు బదులుగా రణబీర్, సాయి పల్లవి ముఖాలను ఆకతాయిలు ఎడిట్ చేసినట్లు చిత్రబృందం తెలిపింది. నితీష్ తివారీ దర్శకత్వంలో రాబోతున్న ఈ చిత్రంలో రణబీర్ కపూర్, సాయి పల్లవితో పాటు రావణుడిగా యశ్, హనుమంతుడిగా సన్నీ డియోల్ నటిస్తున్నారు. ఈ భారీ చిత్రం రెండు భాగాలుగా విడుదల కానుంది. ఇందులో మొదటి భాగం 2026 దీపావళికి ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉండగా అధికారిక పోస్టర్లు త్వరలోనే విడుదల కానున్నాయి.








## గోపీచంద్ మూవీలో
# రీతూవర్మ

హీరో గోపీచంద్ మరో ప్రతిష్టాత్మక చిత్రంతో అలరించేందుకు సిద్ధమైన విషయం తెలిసిందే. సంకల్ప్‌రెడ్డి దర్శకత్వంలో ఓ సినిమాలో నటిస్తున్నారు. గోపీచంద్ 33వ చిత్రంగా ఇది ప్రచారంలో ఉంది. భారీ బ్జడెట్‌తో రానున్న ఈ సినిమాలో రీతు వర్మను హీరోయిన్‌గా ఎంపిక చేశారు. ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటిస్తూ ఆమె పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో రీతూ 'సత్యవతి' అనే పాత్రలో కనిపించనున్నట్లు తెలిపారు. పోస్టర్‌లో ఆమె లుక్ పవర్‌ఫుల్‌గా, పాత్రకు తగ్గట్టుగా వైవిధ్యంగా కనిపిస్తోంది. 7వ శతాబ్దానికి చెందిన, చరిత్రలో పెద్దగా వెలుగులోకి రాని ఓ యదార్థ సంఘటన నేపథ్యంలో ఈ పీరియడ్ యాక్షన్ డ్రామా తెరకెక్కుతుండటం విశేషం. మరింత సమాచారం, ఇతర నటీనటుల వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని మేకర్స్ తెలిపారు. శ్రీనివాస సిల్వర్ స్క్రీన్ బ్యానర్‌పై శ్రీనివాస చిట్టూరి నిర్మాతగా వ్యవహరిస్తున్నారు.

# ప్రభాస్ స్పిరిట్ కోసం అభిమానుల ఎదురుచూపు

రాజాసాబ్ డిజాస్టర్‌తో ఇప్పుడు ప్రభాస్ అభిమానులు ఆయన తదుపరి సినిమా స్పిరిట్ కోసం తెగ ఎదురుచూస్తున్నారు. ప్రభాస్ నటిస్తున్న భారీ ప్రాజెక్టులలో ప్రేక్షకులు అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమా స్పిరిట్ అభిమానుల అంచనాలకు తగ్గట్లుగా రూపొందించడంలో దర్శకుడు సందీప్ రెడ్డి వంగా ప్రయత్నిస్తున్నారు. ఈ చిత్రం ఒక పవర్‌ఫుల్ కాప్ యాక్షన్ డ్రామాగా రూపొందుతోంది. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్ ప్రకటించినప్పటి నుంచే సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాలో హీరోయిన్‌గా బాలీవుడ్ నటి తృప్తి దిమ్రి నటిస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం సినిమా షూటింగ్ శరవేగంగా కొనసాగుతోంది. ప్రస్తుత షెడ్యూల్‌లో భారీ యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరణ జరుగుతుండగా, అది పూర్తయ్యిన వెంటనే ఒక గ్రాండ్ సాంగ్‌ను షూట్ చేయాలని చిత్రబృందం ఎ÷-లాన్ చేస్తున్నట్లు సమాచారం. ఈ పాట సినిమాలో ప్రత్యేక ఆకర్షణగా నిలవనుందని టాక్ వినిపిస్తోంది. ముఖ్యంగా ఈ సాంగ్‌లో ప్రభాస్ మాస్ స్టెప్స్‌తో పాటు తృప్తి దిమ్రి గ్లామర్ కూడా హైలైట్‌గా ఉండనుందని చెబుతున్నారు. భారీ సెట్స్, గ్రాండ్ విజువల్స్‌తో ఈ పాటను తెరకెక్కించేందుకు మేకర్స్ ఎ÷-లాన్ చేస్తున్నారని సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఇక 'స్పిరిట్' సినిమా మొత్తంగా మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోంది. ఇందులో ప్రభాస్ ఒక పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటికే విడుదలైన పోస్టర్ ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని రేకెత్తించింది. ముఖ్యంగా ప్రభాస్ లుక్ పూర్తిగా వైల్డ్ అండ్ మాస్ అవతార్‌లో ఉండటంతో అభిమానుల్లో ఈ సినిమాపై హైప్ మరింత పెరిగింది. కథలోని ఎమోషన్, యాక్షన్‌కు తగ్గట్టుగా బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ కూడా ప్రత్యేకంగా ఉండబోతుందని సమాచారం. భారీ బ్జడెట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాను టి-సిరీస్‌తో పాటు భద్రకాళి పిక్చర్స్ బ్యానర్లు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. సాంకేతికంగా కూడా ఈ సినిమా అత్యున్నత ప్రమాణాలతో రూపొందించేందుకు మేకర్స్ ప్రత్యేకంగా ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇక కథ విషయానికి వస్తే, 'స్పిరిట్' మెయిన్ కాన్సెప్ట్ పూర్తిగా కొత్తగా ఉండబోతుందని సినీ వర్గాలు చెబుతున్నాయి. దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తన స్టైల్‌కు తగ్గట్టుగా రియలిస్టిక్ యాక్షన్‌తో పాటు గట్టి ఎమోషనల్ ఎలిమెంట్స్ కూడా ఈ సినిమాలో చూపించనున్నారని టాక్ వినిపిస్తోంది.



# సుస్మిత బర్త్‌డే...
# చిరు ఎమోషనల్ పోస్ట్



మెగాస్టార్ చిరంజీవి కేవలం వెండితెరపైనే కాదు, నిజ జీవితంలోనూ ఒక గొప్ప తండ్రిగా తన బాధ్యతలను, ప్రేమని ఎప్పుడూ చాటుకుంటూనే ఉంటారు. తాజాగా తన పెద్ద కుమార్తె, నిర్మాత సుస్మిత కొణిదెల పుట్టినరోజును పురస్కరించుకుని చిరు ఎమోషనల్ నోట్‌ని అభిమానులతో పంచుకున్నాడు. నా వేలు పట్టుకుని నడకలు నేర్చుకున్న ఆ చిన్నారి నుంచి.. ఈరోజు ఎంతో బాధ్యతాయుతమైన, హుందాతనమున్న స్త్రీగా ఎదిగిన నిన్ను చూస్తుంటే గర్వంగా ఉంది. ఒకప్పుడు తన సినిమాలను చూస్తూ మురిసిపోయిన నా కూతురు, ఈరోజు నా సినిమాకే నిర్మాతగా మారి, తనకు ఒక మెమరబుల్ బ్లాక్‌బస్టర్‌ను అందించడం ఒక తండ్రిగా తనకు దక్కిన అత్యంత ప్రత్యేకమైన గౌరవమని చిరు కొనియాడారు. నా ప్రియమైన హనీ పాపా.. నువ్వు చేసే ప్రతి పనిలోనూ విజయం సాధించాలని, ఎప్పుడూ ఆరోగ్యంగా, సంతోషంగా ఉండాలని కోరుకుంటున్నాను. నీ కీర్తి ఇలాగే వెలుగులీనాలి అంటూ మెగాస్టార్ ఎక్స్ వేదికగా రాసుకొచ్చాడు. ఈ పోస్ట్‌కి చిరంజీవి తన కూతురిని చిన్నప్పుడు ఎత్తుకున్న ఫోటోతో పాటు, ప్రస్తుత ఫోటోను కూడా జత చేశాడు. కాగా ఇందుకు సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి.

## రామ్‌చరణ్ కోసం
# రెండు వర్షన్లలో కథ

**దర్శకుడు సుకుమార్ స్పష్టీకరణ**



రామ్‌చరణ్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో ఓ సినిమా రానున్న విషయం తెలిసిందే. 'ఆర్సీ 17'గా ఇది ప్రచారంలో ఉంది. ఇటీవల ఈ సినిమా గురించి సుకుమార్ అసిస్టెంట్, దర్శకుడు హుస్సేన్ షా కిరణ్ ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ చేసిన కామెంట్స్ అభిమానులను గందరగోళానికి గురిచేశాయి. తాజాగా ఆయన తన కామెంట్స్‌పై క్లారిటీ ఇచ్చారు. రామ్ చరణ్ సినిమా కోసం రెండు కథలు రాస్తున్నట్లు హుస్సేన్ షా చెప్పారు. దీంతో కథ ఇంకా ÷నైల్ కాలేదని, సినిమా సెట్స్ పైకి వెళ్లడానికి చాలా సమయం పడుతుందేమోనని మెగా అభిమానులు ఆందోళన చెందారు. తాజాగా ఆ కామెంట్స్‌పై ఆయన క్లారిటీ ఇచ్చారు. రెండు కథలు కాదని.. ఒకే కథ రెండు వెర్షన్‌లు సిద్ధం చేస్తున్నట్లు వివరించారు. వాటిలో అత్యుత్తమమైన దాన్ని ఎంపిక చేసుకుంటారని ఆయన స్పష్టం చేశారు. ఆర్సీ17 చిత్రానికి సంబంధించిన కథ ఇప్పటికే పూర్తిగా లాక్ అయిందని, సినిమా ఆలస్యం అవుతుందన్న వార్తల్లో వాస్తవం లేదని అన్నారు. 'రంగస్థలం' వంటి బ్లాక్ బస్టర్ తర్వాత సుకుమార్ – రామ్‌చరణ్ కాంబినేషన్‌లో రానుండడంతో దీనిపై అంచనాలు నెలకొన్నాయి. ప్రస్తుతం చరణ్ 'పెద్ది'తో బిజీగా ఉన్నారు. బుచ్చిబాబు దర్శకత్వంలో రూపొందుతోన్న ఈ చిత్రం ఏప్రిల్ 30న విడుదల కానుంది.

Printed, Published & Owned by B.Srinivas, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar Medchel, Malkajgiri Dist. Hyderabad 500037 (T.S).
Published at Plot S11, 3rd Floor, Ballard Estate Margadarshi Building Tarnaka Secundrabad, Hyderabad 500 007 (T.S), Editor : B.Srinivas, PRGI.REGN.NO. APTEL /2003/11288, CELL : +91 8333068787